ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక




కాశ్మీర్ నాగరికత

24-11-48 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు


రాయలసీమ మహాజనసభ

అనంతపురం







రాయలసీమ మహాజనసభకు సమావేశమగుచున్న ప్రజాసమూహము



రాయలసీమ మహాజనసభ సందర్భమున జరిగిన ధాన్యఉత్పత్తిదారుల సభలో
అధ్యక్షుడు శ్రీ కె. ఓబుల్ రెడ్డిగారుపన్యసించుచున్న దృశ్యము.




రాయలసీమ మహాజనసభకు వెళ్లుచున్న ప్రజలు



రాయలసీమ మహాజనసభ ప్రతినిధులు
విషయనిర్ణయ సభకు అరుగుదెంచుచున్న దృశ్యము.



7-11-48 తేదీ ఉదయం, అనంతపురంలో జరిగిన రాయలసీమ మహాజనసభ ప్రారంభమున
పతాకప్రతిష్ఠ జరుపుచున్న దృశ్యము.




అనంతపురములో జరిగిన రాయలసీమ మహాజనసభ కరుదెంచుచున్న వేనవేల్ప్రజలు

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0 విడిప్రతిక అణాలు 0-4-0	**ప్రతిబుధవారమున ప్రకటింపబడును** ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్.(మహాభారతము)	సంపుటము **41** సంచిక **12**


Founder : K. NAGESWARA RAO

సర్వధారి సంవత్సర కార్తిక బహుళ అష్టమి బుధవారము



క్రొత్తపంటలు వచ్చినవి!

సంక్రాంతిలక్ష్మి రాకతో, ప్రతిపటకుటీరము ఒక చిత్రశాల!—ప్రతియిల్లాలూ ఒక చిత్రకారిణి!



ఆంధ్రపత్రిక

1948-వ సం॥ నవంబరునెల 24-వ తేది బుధవారము

దీర్ఘాయుష్మాన్ భవ!

నేడు యావదాంధ్రము డాక్టరు భోగరాజు పట్టాభిసీతారామయ్యగారి జన్మదినోత్సవమును అత్యధికోత్సాహముతో జరుపుచున్నది. అందులకు వీరు కాంగ్రెస్ అధ్యక్షులుగ ఎన్నికయగుటే కారణము గాదు. వారు రాష్ట్రపతిగ ఎన్నికగుటతో ఆంధ్రుల చిరకాలవాంఛ సిద్ధించినది. వారిలో ఆంధ్రుల ఆశయములు అభిమతములు మూర్తీభవించినవి. కనుకనే సరిగా మాసము రోజులక్రితము భారతదేశము వారిని గౌరవించినప్పుడు ఆంధ్రులందరు ఆనందపరవశులైరి. నూతనరాష్ట్రపతి జన్మదినోత్సవము జరుపుచు ఆంధ్రులు తమ విజయోత్సవమునే జరుపుకొనుచున్నారు.

కాని మహానాయకుల జన్మదినములు జాతీయపర్వదినములు. నాడు ఆ నాయకుల పథము ననుసరించుటకు వారు లక్ష్యించిన వాటిని సాధించుటలో వారి ప్రక్క నుండుటకును ప్రజలు దీక్ష పూనవలసి యున్నది. అప్పుడే జన్మదినోత్సవములు జరుపుటకు ప్రజలు అర్హులగుదురు.

డాక్టరు పట్టాభిసీతారామయ్యగారు నిర్వహింపవలసిన బాధ్యతలు, సాధింపవలసిన కార్యములు అనేకము ఉన్నవి. వారు విజయులు కావలె నని, సమగ్రాంధ్రమును స్థాపించి ఆంధ్రజాతిపునరుద్ధరణలో కృతకృత్యులై, దీర్ఘాయుష్మంతులై వర్ధిల్లవలె నని ఈ శుభసమయమున పరమేశ్వరుని ప్రార్థించుచున్నాము.

కాంగ్రెస్‌ప్రభుత్వము: కాంగ్రెస్ వాదులు

వస్త్రవిక్రయ అనుమతి పత్రముల నొసగుటలో రాష్ట్రప్రభుత్వ విధానము అసంతృప్తికరముగ నున్నదని, అది ప్రజలకు సంబంధించిన అతి ముఖ్యమైన అత్యంతావసరమైన విషయము గనుక ప్రభుత్వవిధానమును చర్చించుటకు కౌన్సిల్ కార్యక్రమమును వాయిదా వేయవలసిన దని గత శుక్రవారము రాష్ట్రకౌన్సిల్ సమావేశమునందు తురగా పురుషోత్తముగారు ప్రతిపాదింప దలచిన విరామతీర్మానము చర్చకు పరిశ్రమల మంత్రి, అధ్యక్షత వహించిన కె. వెంకటస్వామి నాయుడుగారు సమ్మతింపకపోవుట శోచనీయము. పరిశ్రమల మంత్రి అసలు సమావేశమునకే హాజరు కానందున, తీర్మాన చర్చకు వారి అభ్యంతర మేమో తెలియుటలేదు. పురుషోత్తంగారు అవ్యవధిగ తమకు తీర్మానమును అందజేసినందున, ఆతీర్మాన ప్రతిపాదనను అనుమతింపజాల నని ఉపాధ్యక్షుడు శ్రీ వెంకటస్వామి నాయుడుగారు తెలిపిరి.

కౌన్సిల్‌లో ఈ విషయము చర్చింపబడినందున పరిస్థితులు వాటికవి చక్కబడగల వనిగాని, ప్రభుత్వ విధానము అప్పటికప్పుడు మార్పుచెందు ననిగాని మేము భావించుటలేదు. కాని ప్రభుత్వము, శాసనసభాసభ్యులు, ప్రజలు యథార్థ పరిస్థితులను తెలిసికొనుటకు ఈ చర్చ కొంతవరకు అవకాశ మిచ్చియుండెడిది. "స్థానికముగనున్న శాసనసభ సభ్యుల సిఫార్సులను పూర్తిగా నిరాకరించి, ప్రభుత్వము టోకు, చిల్లర వ్యాపారస్థులకు వస్త్రు, నూలు విక్రయ అనుమతి పత్రముల నొసగుచున్నది" అని అది అసంతృప్తికరముగ నున్నదని పురుషోత్తంగారు తమ తీర్మానమునందు పేర్కొనిరి. అట్లుగాక, అనుమతిపత్రముల నొసగుటలో, శాసనసభాసభ్యులు, స్థానికకాంగ్రెస్ ప్రముఖులు జోక్యము కల్గించుకొని, అధికారుల ఒత్తిడిచేసి, కంట్రోల్సు సక్రమముగ అమలు జరుగుటకు వీలు లేకుండ చేయుచుండిరను అభియోగము సర్వత్రా వినవచ్చుచున్నది. పురుషోత్తంగారి తీర్మానముపై చర్చ జరిగిన ఈ అపోహలు తొలగుటకు ఈ అభియోగముల నిజానిజములు దిఙ్మాత్రముగనైనను ప్రజలకు తెలియుటకువీలు ఉండెడిది.

ప్రభుత్వ నిత్య వ్యవహారములలో కాంగ్రెస్ వాదుల ప్రమేయమును గురించి అధికారవర్గములందును, సామాన్య ప్రజలయందును తీవ్రమైన అసంతృప్తిఏర్పడినది. న్యాయస్థానములో విచారణలు మొదలు దేశమున శాంతిభద్రతల నెలకొల్పుటకు ఎవరెవరిని నిర్బంధింపవలెను; నిర్బంధింపబడినవారిలో ఎవరెవరిని విడుదల చేయవలెను అను విషయము వరకు కాంగ్రెస్‌వాదులు 'ఉత్తరువులు' జారీచేయుట, అధికారుల నాదేశించుట అనునిత్యము జరుగుచున్నట్లు రాష్ట్రమున జరుగుచున్న అరెస్టులు, విడుదలలు, మున్నగు సంఘటనల పూర్వాపరముల విచారించిన స్పష్టమగుచున్నది. పరిపాలనాధికారము కాంగ్రెస్ పరమైనది గనుక కాంగ్రెస్‌నందలి ప్రతివక్కరు అధికారి అయినట్లు, నేడు కాంగ్రెస్‌వాదులు భావించుచున్నట్లు కన్పించుచున్నది. కలెక్టరు కచేరీలుగాక, జిల్లా కాంగ్రెస్ సంఘ కార్యాలయములే అధికార కేంద్రములు కావలెనను అభిప్రాయము ప్రబలిపోయినది. అందువలన అధికారమన్న గౌరవము, భక్తిపూర్తిగ అంతరించిపోయినది. అధికారి ఉత్తరువులకు విలువ లేక పోయినది. 'లా అండ్ ఆర్డర్' అన్న లక్ష్యము లేకుండపోయినది. పర్యవసానము అరాచకమే.

ఇట్టి విషాదపరిస్థితులకు కారకులు కాంగ్రెస్‌వారే అయినను, పరిపాలనను నిర్వహించు కాంగ్రెస్ మంత్రులును కొంత బాధ్యత వహింపవ సియున్నది. ఈ పరిస్థితి చక్కబడకున్న కాంగ్రెస్ సంస్థ పతనమందుటే గాక, స్వాతంత్ర్యముకూడ ఎంతో కాలము నిలువదు. నేడు అధికారులలో నిర్లిప్తత, లంచగొండితనము, ప్రజాప్రతినిధులనుకొను వారిలో అవినీతి, స్వార్థము పెరిగిపోయినది. ప్రభుత్వములో ప్రజలకు విశ్వాసము క్రమముగ అంతరించి పోవుచున్నది. కనుకనే ఎంతటి కఠినమైన శాసనముల అమలుచేసినను, ఎన్ని ఆర్డినెన్సులు చేసినను కమ్యూనిస్టు ప్రమాదమును నివారింపజాలకున్నది. ప్రజలది ఒకదారి, వారి ప్రతినిధులది మరొకదారి; ప్రభుత్వము వారిది వేరొక దారి అయినది.

ఈ విషయమును పురుషోత్తంగారి ప్రతిపాదనే వెల్లడించినది. ప్రభుత్వ విధానమును ఖండింపవలెనని వారు ఉద్దేశించిరి. కాని తీర్మానాంశములు శాసనసభ్యులపై అభిశంసనముగ నున్నవి. కంట్రోలు వస్తువుల వ్యాపారానుమతి పత్రముల నిప్పించుటకు శాసనసభాసభ్యులు సిఫార్సులు చేయుచున్నట్లు వీరు అంగీకరించిరి. స్థానికాధికారులు, మంత్రులు ఈ సిఫార్సులను అంగీకరించుటలేదని వీరు అధిక్షేపించుచుండిరి. కాని దేశమందు నేడేర్పడిన 'విషాద' పరిస్థితులకు ప్రజాసంఘములం దేర్పడిన అవినీతికి, ప్రజాప్రతినిధుల మనుకొనువారిలో ప్రబలిన లంచగొండితనమునకు ఇట్టి అనవసర ప్రమేయమే కారణ మని వీరు గుర్తించినట్లు కన్పించదు.


ఆంధ్ర, తమిళ కాంగ్రెస్ సంఘములు కాంగ్రెస్‌వాదులు కంట్రోలు వస్తువులందు వ్యాపారము చేయరాదని హెచ్చరించియుండెను. ఆ విధముగ వ్యాపారము చేయువారి సంఖ్యకంటే చేయించువారి సంఖ్య విపరీతముగ నుండును. 'అనుమతిపత్రముల' సంపాదించిపెట్టుట వ్యాపారమువలె సాగుచున్నది. దీనిని అరికట్టుటకు తీర్మానములు, ప్రకటనలు ఉపయోగపడవు. నైతిక పతన మారంభమైనది. గాంధిజీ, తన హత్యకు పూర్వము, కాంగ్రెస్‌వాదుల నైతికప్రమాణము వృద్ధిచేయుట ప్రస్తుతావసరమని హెచ్చరించుచువచ్చిరి. అందుకు కాంగ్రెస్ నిబంధనావళి సంస్కరణను కూడ సూచించిరి. కాని కంచయే చేను మేయుచున్నట్లున్నది నేటి కాంగ్రెస్‌వాదుల విధానము.

1917 వ సంవత్సరమున బోల్షివిక్ పక్షము రష్యాలో అధికారమునకు వచ్చినపుడు ఆ పక్షస్థులు కూడ ఇట్లే ప్రవర్తించిరి. అవి బాలారిష్టము లని లెనిన్ వ్యాఖ్యానించెను. తన జీవితకాలముననే వాటికి చాలవరకు చికిత్స చేసిరి. గాంధిజీకి అట్టి అవకాశము లేకపోయెను. అయినను కాంగ్రెస్ అగ్రనాయకులు ఈ ప్రధానసమస్యను తక్షణం పరిష్కరింపకున్న, వారు సంకల్పించిన ఏ అభివృద్ధిపథకమూ ఫలప్రదము కాదు. నిర్ణయములో దోష మున్నదని భారత ప్రధానామాత్యుడు పండిట్ జవహర్లాల్ నెహ్రూ, తన ఆర్థికమంత్రిచే రాజీనామా నిప్పించెను. ఆవిధముగ వారేర్పరచిన నైతిక ప్రమాణమును రాష్ట్రప్రభుత్వము లందును, కాంగ్రెస్ సంఘములందును ఏర్పాటు చేయవలెను.


కొంతకాలము క్రితము ప్రజారక్షణ శాసనమును అమలు చేయు సందర్భమున అధికారులు స్థానిక కాంగ్రెస్ సంఘముల అభిప్రాయములను, కాంగ్రెస్ వాదుల అభిమతమును తెలిసికొని వ్యవహరింపవలెనని ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్‌కార్యదర్శిగా రొక ప్రకటన చేసియుండిరి. అధికారులు తమ అధికారమును దుర్వినియోగము చేయకుండ చూడవలసిన అవసరము ఉండవచ్చును. కాని అందుకు మార్గము అది కాదు. షణ్ముఖం చెట్టి గారి విషయములో భారత ప్రధానామాత్యుడు, కేంద్ర కాంగ్రెస్ పక్షము నిర్దేశించిన మార్గమే యుక్తమైనది.

ముఖ్యముగ ఈ రాష్ట్రమునందు ఇట్టి అసాధారణపరిస్థితు లేర్పడుటకు కాంగ్రెస్ రాజకీయములే కారణ మని చెప్పవచ్చును. అధికారమునందున్న కాంగ్రెస్‌వాదులు ప్రజాప్రతినిధులా, కాంగ్రెస్ సంఘములందు అధికారస్థానముల నాక్రమించినవారు ప్రజాప్రతినిధులా అన్న మీమాంసయే ఈ రాజకీయములకు మూలము. కనుక రాష్ట్రపరిస్థితులు చక్కబడవలెనన్న ఈవిషయము పరిష్కారము కావలసియున్నది. ఇందుకు నూతన రాష్ట్రపతి పట్టాభిసీతారామయ్యగారు మార్గము చూపిరి: "కాంగ్రెస్‌సంఘము ప్రభుత్వమునకు మేధానిధిగను, ప్రజల సంరక్షకురాలుగను ఉండవలెను. అటు ఆదర్శములను, ఇటు ఆచరణయుత మార్గములను సమన్వయము చేయవలెను. కాంగ్రెస్‌వాదులు ప్రభుత్వ దైనందిన వ్యవహారములలో జోక్యము కల్గించుకొనిన పరిపాలనాయంత్రము సాఫీగ ముందుకు సాగలేదు. కాంగ్రెస్ సంస్థకూడ ఛిన్నాభిన్నమైపోగలదు." అని అక్టోబరు 26వ తేదీన వీరు కాంగ్రెస్ నూతన భూమికను నిర్వచించిరి. కాంగ్రెస్‌వాదులు, కాంగ్రెస్ సంఘములు ఈవిషయమును గ్రహించి నడుచుకొనునట్లు చూడవలసిన బాధ్యత నూతన రాష్ట్రపతిపై గలదు.

రాష్ట్రపతి డా॥ పట్టాభిసీతారామయ్యగారి 69-వ జన్మదినోత్సవము



డాక్టర్ పట్టాభి సీతారామయ్యగారు, సతీమణి శ్రీమతి రాజేశ్వరమ్మగారు.



మనుమరాలితో డాక్టర్ పట్టాభిగారు



సాయం వాహ్యాళిసమయంలో

ఈనాడు (నవంబరు 24) రాష్ట్రపతి డాక్టరు పట్టాభి సీతారామయ్యగారి 69 వ జన్మదినోత్సవము ఆంధ్రదేశమంతటా సంతోషంతో జరుపుకొంటున్నారు. భగవంతు డీయనను చిరాయువుగా చేయుగాతమని ప్రార్థిస్తున్నాము.

గొప్పవారితో గుసగుసలు:

పిల్లలమర్రి పినవీరభద్రుడు

కీ॥ శే॥ శ్రీ వారణాసి శ్రీనివాసరావు

[కీర్తిశేషులైన శ్రీ వారణాసి శ్రీనివాసరావుగారు రచించిన ఈ గుసగుసలు దీనితో పరిపూర్తి. కవులతోనైన గుసగుసల శ్రేణిలో ఈ వ్యాసమును ప్రకటించియుండవలసినది. కాని స్థలాభావముచే అప్పుడు ప్రకటించుట పడలేదు. దేశసాంఘిక చరిత్రను, మహామహుల చరిత్రలలో ఆనుపూర్విగ వచ్చుచున్న ఆభాసములను, భావవైచిత్రిచే, ఊహా ప్రాబల్యముచే, సరిదిద్ది, సత్యస్వరూపదర్శనమునకై శ్రీనివాసరావుగారు పాటుపడి, తమ చారిత్ర్యక పరిశోధనా ఫలితములను, "ప్రియవాక్య" లాలిత్యముతో కావ్యస్వరూపమున ఆంధ్రావనికి అందిచ్చి కీర్తిశేషులైనారు. వారికి, వారి రచనను అత్యాదరముతో స్వీకరించిన మా పాఠకులకు, మా కృతజ్ఞత...సం॥]

[నారాయణవనంలో చెఱువులోతట్టున నీళ్ల నానుకొనివున్న యిసుక బైలుమీద పినవీరభద్రుడు, నేనూ కూర్చుని—]

పి: ఏమిటోయ్ నీగోల? నాల్గురోజుల్నించి ప్రాణా తీసి రహస్యం రహస్యమంటావ్. కుదిరిగ్గా నే కాస్సేపు కూర్చోలేకపోతిని, పట్టుమని నీ వొక ఘడియ నాతో తిరగలేకపోతివి. ఇక్కడెంత సేపుంటానో, తెలీదు. అదు టేమిటో.

నే: ఇప్పుడు గూడా మునుపటికిమల్లేనే ద్రిమ్మటా?

పి: ఆ, నాకుమటుకు పుటకతో వచ్చిన బుద్ధి పుడకల్తో పోలా.

నే: అదీ విపరీతమే. సాళువనరసింహరాజా వారికీ, మీకూ ఏమి సంబంధం?

పి: అంటే, నే బ్రాహ్మణ్ణి, ఆయన బ్రహ్మక్షత్రియుడు.

నే: అంటే?

పి: అంటే, కార్యాంతరుడై క్షత్రియత్వం వహించిన బ్రాహ్మణజాతివా డన్నమాట. నాకూ ఆయనకూ సంబంధ మేమిటి? మా అన్నగా రాయనగ్గర మంత్రి.

నే: అట్లా గనండి. మీ జైమినీభారతాన్నాయనకేగా అంకిత మిచ్చింది?

పి: ఔనుగాని, యీమాటల్లో రహస్యమే ముంది. కీకలో యే కుంక నడిగినా చెప్పేవాడే?

నే: ఎంత తొందరండి? కొంచె మాగండి, తెలుస్తుంది. మీరు మహాకవు లటగా?

పి: ఎవ డాండి? ఏ అభోజనుడికి నన్నెక్కిరించా లనిపించింది? నేను మహాకవినా? అసలు కవి నేనా, మహాసంగతి తర్వాత చూద్దాం.

నే: అ దేమిటండీ, మీరేచెప్పుకున్నారుగా?

పి: పయిగ్గా, యిదొకటా? ఎక్కడ చెప్పుకున్నా? . .

నే: 'అమృతాంశు మండలం' బన్న పద్యంలో!

పి: అసలా పద్యం నాది కాదనకో. దాన్లో చెప్పుకున్నా నా, ఏదీ ఎత్తు కిత చదువూ, చూద్దాం.

నే: 'మంత్రిమాత్రము పిల్లలమర్రి పేరు
పేరువల గాడు శారదాక్షీరకంబు
వానిలోపల పినవీరువాక్యసరణి
సరసులకు నెల్ల...'
ఔనండోయ్,
'కర్ణరసాయనంబు.'

పి: ఇట్లా వుంటుంది మీకాలంవాండ్ల తెలివి. అదుగో తోకంటే, యిదుగో పులి అంటారు. వాడు వచ్చా డంటే, నీకెట్లా తెలుసు నంటే' చూడకపోయినా నే కండ్లారా చూశా నంటారు.

నే: ఏమండోయ్, అంతమాత్రంతో విడిచిపెట్టేవాణ్ణి గాను. మీరు మాంచి కవు లని, మీరు జైమినిభారతం వ్రాస్తే బాగుంటుందని...

పి: ఊ. వృథాకాలక్షేపం నా కసహ్యం. అవన్నీ రాజుగా రంటే నా కంటగట్టాడ్.

నే: నా రంటేమటుకు పద్యాలు మీవి కావ్?

పి: బాగుంది. నా రన్నమాటలు పద్యాల్లో వుంటే మావా? అహా, యేం తర్కం! వాణీ నా రాణీ.

నే: ఆ. అ దేమిటండీ 'వాణీ నారాణీ' అంటారు?!

పి: అంటే నీ కేం బోయింది?

నే: (ఆశ్చర్యంతో) నీ కేం బోయింది?! బాగానే వుంది! మే మంతా ఆమెగార్ని దేవతనుకుని పూజిస్తూంటే మీ రేమిటో నారాణీ నారాణీ అంటా రేమిటి?!

పి: మీకాలంవాళ్లంతా కొంటె ముండా కొడుకుల్లా గున్నారు. రాణీ అంటే పాలకురాలన్నమాట: సరా?

నే: పాలకురాలు?! బ్రహ్మమైనాడూ?

పి: బ్రహ్మమైనాడు? సృష్టికృషితో నాయనకు తీరి యేడుస్తూంది, వాక్కును పాలించడానికి?

నే: ఎట్లా! (ఆశ్చర్యం)

పి: లాకపోతే, రాణీ అంటే పెండ్లాం మనకోడానికి నే నేం నీచగ్రామ్య ణ్ణనుకున్నా నా, బ్రాహ్మణముండాకొడుకుని?

నే: మొత్తానికి బలే గడుసువారండీ! సరే గాని, చిన్నప్ప డిల్లు పట్టకుండా తిరిగేవా రటగా?

పి: ఇదుగో, నీవ్యవహార మేం బాగుండా. మీరు చిన్నప్ప డిట్లాటి అట్లాటి ఆ పని చేసారట, యీ పని చేసారట, అని యేమి టీ నకళీ?! ఏదో పెద్దమనిషివి కదా, మనశ్శుద్ధి కలవాడవ్ గదా, ఏదో ఉపాసించావని మునిగిపోయినట్లు స్వర్గాన్ని విడి చొస్తే యేమి టీ ప్రసంగం?

నే. ఎందుకండీ, చిరాకుపడి చీవాట్లుకుదిగారు? నేను మి మ్మాహ్వానించిం దిట్లాటి వడగడానికే.

పి: భూలోకాని కొచ్చినా సహతి పోరు తప్పలే దన్నట్లుంది. అక్కడ నారదు డట్లాగే వేధిస్తే చెప్పడప్పుడు వచ్చి. నీ విక్కడేర్పడ్డావ్. ఇక నేం, నీ సాంప్రదాయ మాయ దన్నమాట. సరే. ఔను. ఇల్లుపట్టకుండా తిరిగేవాణ్ణి.

నే: ఎందుకని? చదువుసంధ్య ల్లేవా? ఇంట్లో కూకలేవాళ్లులేరా?

పి: చదువుసంధ్య లేమిటీ? ఎవరైనా యెవరికైనా చెబుతూంటే నిల్చుని వినేవాణ్ణి. వింటే వచ్చేది. కూకలేసేవాండ్లు లాకేం: మాఅన్నగారే వుండేవారు. ఎప్పుడూ నామొగం చూస్తే కన్నుబున్నా మనేవారు.

నే: ఔట్టగా: మీరు కనబడ్తే మండిపడేవారట!

పి: మొత్తాని కన్నీ కావాలోయ్ మీకు! మీ కాలంలో అక్కరమాలిన పరిశోధన మెక్కువైంది: పని లే దనుకుంటా మీకు. ఔను. నాతో భోంచేసేవారే గారు.

నే: ఐతే మీ భోజన మెలా?

పి: ఇంట్లోనే. మావదినెగా రుండేవారు: మహాతల్లి (నమస్కరిస్తూ)! ఆమెకు సంతానం లేదు. నన్ను కడుపున పుట్టిన బిడ్డకుమల్లే గనిపెట్టేవారు.

నే: మీకు స్నేహితు లెవరండీ?

పి: స్నేహితు లేమిటి? స్నేహ మంటే ప్రేమ; స్నేహ మంటే చమురు. మొదటర్థంలో నెవరూ లేరు: రెండో అర్థంలో నుండేవాళ్లు కొందరు, మంత్రిగారి తమ్ముడు కదాని, అది తే, యిది తే అంటే మావదిన్నడిగి తెచ్చిచ్చేవాణ్ణి.

నే: నరసింహరాజుగారు రాయలవారైంతర్వాతనే తమ గ్రంథం వ్రాశారా మీరు?

పి: లా; యిక్కడుండగానే.

నే అసలా గ్రంథాన్ని మీరే రాశారా?

పి: మళ్లీ ఆరంభించింది కొంటెతనం! నే వ్రాయకపోతే, నాపేరు పెట్టుకునే దొంగ వను కున్నావా?

నే: కాదు. చదువుసంధ్య ల్లే వంటిరిగా!

పి: చదువుసంధ్య లంటే, యెవడి దగ్గరో కూర్చుని, వాడి కుపచారం చేస్తూ, వాడు దయొచ్చి చెప్పినపుడు నాల్గుముక్కలేర్చుకుంటూ వుండడ మైతే లే దన్నా గాని, అసల్చదువు లాకుంటే నట్లాటి గ్రంథ మెట్లారాశా? వింటే వచ్చేదన్నా? అది చాల్దు? దానికి తావొక యోగ మొచ్చా నొక రోజు. ఆయనకు మాయింట భిక్ష. ఎట్లా వున్నాడో చూద్దామని తొంగిచూశా. మాడగానే దగ్గరకు పిలిచి స్నానంచేసి రమ్మన్నాడు—తడిబట్టల్తో. అంత తేజస్విమాట తోసెయ్యలాక అట్లాగే వెళ్లా దగ్గరికి. కూర్చోమని నాకు బ్రాహ్మీమంత్ర ముపదేశించారు. అప్పట్నుంచీ నాకు చిత్రంగా మా ర్పొచ్చింది.

నే. ఏమిటండీ ఆ మార్పు? నాకూ అట్లాగే అనుపించింది.

పి: ఏముందీ? ఏదో ఒక ఉద్రేకం లా వుంటుంది విషయావగాహన మానుపటికన్నా స్పష్టంగా వుంటుంది: ధైర్యసాహసా లేర్పడుతాయ్ యేం జేస్తున్నా, చెబుతున్నా—దేవి అండ వుందనే దృఢవిశ్వాసంవల్ల. నావిషయం మాడు, ఆ గ్రంథం వ్రాసినంతకాలం నా వొళ్లు నాకు దెలిసిన ట్లనుపించలా.

నే: దాన్ని మీరు వ్రాయలేదని సరస్వతీదేవి వ్రాశారని యింకా యేదో యేదో, యేమి టేమిటో అనుకుంటా రేమిటండీ?

పి అదా! రాజుగా రెవరూ వ్రాయలేని కావ్య మారునెల్లలో వ్రాయమని మా అన్నగార్నన్నారని, వ్రాయకుంటే తల నొత్తామన్నరని, అది నాన్నొచ్చి వారు బెంగపడ్తూంటే చూచిచూచి ఎల్లుండా ర్నెల్ల గడువూ దాటుతుందనగా నేను మావదిన్నడిగి కనుక్కొని గదినలంకరించ మన్నా నని, ఆరాత్రి కా గదిలో గుర్రుకొట్టి నిద్రపోతున్నా నని, అప్పు డెవరో ఒకావె వొచ్చి ఘంటం బుచ్చుకుని వ్రాస్తున్నారని, ఆ ఘంటం చప్పు డేమిటా అని మా అన్నగారు తలుపుకంతలోంచి చూశా రని, ఆమెగా అంతర్ధాన మైనారని, ప్రొద్దున్నే ఆగ్రంథం మటుకు దొరికిం దని, అదే! నేను వ్రాసిందని— అదేనా నీ వన్నది?

నే: చిత్తం.

పి: అదంతా అబద్ధం. నరసింహరాజట్లాటి రాజుసాజ్ఞ యిచ్చే ప్రభువు కారు: మహానీతిమంతులు. మా అన్నగారిపట్ల వారికున్న ప్రేమకు గౌరవానికి వా రట్లా నెన్నడూ వా ర్నాజ్ఞాపించరు. ప్రభువు వారి నన్నయ్యా యని పిలిచేవారు. అందుకని మాఅన్నగారు బెంగపడితే, నాకే అట్లాటి శ క్తుంటే, నే నా గడువు రెణ్ణాళ్లకు గడుస్తుం దనేదాకా ఆగేవాణ్ణి కాను. నన్ను నా రెంత కసిరా, నాకు వా రంటే అంత ప్రేమా, భక్తీను. ననుకటి యుగాల్లో సంగతి యెట్లాగున్నా, యీ కలియుగంలో దేవి వచ్చి అట్లా సాయపడ్తా రనుకోను: మనమట్లాటిసహాయాలకు తగం. అన్నిటికంటే, అట్లాటి మహావిచిత్రకార్యం జరిగుంటే, అవతారికల్లో కవి కొచ్చిన కల్లే వున్నప్పుడది నా అవతారికలో నెందు కుండదు? అదంతా వట్టి అబద్ధం. నేను శుభ్రంగా యింట్లో కుదిరిగ్గా కూర్చుని వ్రాసిందే ఆ గ్రంథం.

నే: అట్లా గాండీ? మాకాలంవాళ్లలో అనేకు లిప్పటికి అదంతా నిజం నిజ మని వాదిస్తూంటారు?

పి: మీ కాలంవాం ళ్లే మంటూండి, యేం జేస్తూంది వాళ్లకే తెలీ దనుకుంటా. సంధ్యావందనంలో యే ముందని మానేసినవాళ్లు ఇట్లాటి కథల్ని గట్టిగా నమ్మినట్లే వాదిస్తారు. వాళ్లు నేల విడిచి సాము చేయడంలో మొనగాళ్లు. ఆస్తికత్వం నశించిన కాలం: దాని పరిణామ మిట్లా గిట్లా గుంటుం దనుకోవడం అసాధ్యం.

నే: మీకు ఆంధ్రకవు లందర్లో నెవరంటే యెక్కువ వశీమానమండీ?

పి: ఇదొక పిచ్చ ప్రశ్న! నీ విట్లా అందర్నీ ప్రశ్నిస్తున్నావని, మొన్ననే నారదుడన్నాడు. నేం జెప్తా ననుకో, అది నీ కెట్లా వుపకరిస్తుందో చెప్పు.

నే అ కేంటండీ? మీరు సామాన్యులా! సరస్వతీవిగ్రహాలు! తమ రిట్లా గన్నా రంటే, ఆంధ్రలోకం నో రెత్తుతుందా?

పి: అదొకటి కూడానా? నాకు లేని గొప్పతనం నీవు తెచ్చిపెట్టున్నావే. నే నంటానే అనుకో, ఒక డని; దాన్నంతా ఆమోదించకుంటే దేనికి పనికొస్తుంది. నా అభిరుచి ననుసరించియే ఇక్కడనో అంటూ, అంతా దాన్నంగీకరించాద్దూ!

నే: ఎవరికోస మంగీకరించరు! దెబ్బకొట్టి అంగీకరిప్పిస్తాం!

ప: (ఆశ్చర్యంతో) ఓరి యముడా! ఆంధ్రంలో కవిత్వం చెప్పడం మీచాత దెబ్బ తిన్నాకాని! నీకే పుట్టిందా యీబుద్ధి?

నే. కొట్టడ మంటే కొట్టడమా? పినవీరభద్రయ్యగా రిట్లా గన్నా రని, అన్ని పత్రికల్లో ప్రకటిస్తాం; పెద్ద కాగితాలమీద అచ్చేసి ప్రతి గోడకూ, లాంతరు స్తంభానికీ అంటిస్తాం; టముకు వేయిస్తాం! ఇప్పుడు కాంగ్రెసుప్రభుత్వం వచ్చింది. మామంత్రుల్ని పట్టుకుని శాసనసభలో శాసనం జేయించి దాన్నమల్లో బెడ్తాం. కాదన్నవ్యక్తినల్లా......

పి: (నోరు మూసుకుంటూ) ఆ ర్నీ దెబ్బ కాలా, యెట్లా! యింకా!

నే: ఇంకా యేమిటి—

పి: చాల్చాలు గాని, విను. అట్లాటి విషయమెక్కడెప్పుడూ తేల్చి చెప్పగూడదు. కొంత కాలంమీద లోకమే తేలుస్తుంది.

నే: అయితే, ఓరుదు లెందుకూ?

పి: ఎందుకా, పన్లాక. ఇచ్చేవాండ్ల మనస్సుల దురద తీర్చుకోడానికి.

నే: అయితే...

పి: (లేస్తూ) అబ్బా, నాప్రాణం విసిగింది, వెళ్తా. ఈవాళ బృహస్పతిమేళ్లో పెద్దన్న కవిత్వవిషయ ముపన్యసిస్తాడట. వెళ్లాలి.

నే: మళ్లీ వస్తారా?

పి: ఎందు కిక్కడికే, యీడవనా? నందనవనాన్ని, నారదుణ్ణి నే నొక్క క్షణం విడి మండలేను. దేవికూడా వేంచేస్తా రని విన్నా.

నే: జ్ఞాపక ముంచుకుంటారా?

పి: మరిచిపోదా మన్నా, మరు పొచ్చేట్టు లేవు నాయనా, నీవు! [నిష్క్రి.]

పరమానందామ్

మూలం : 'గుడ్‌సోల్జర్ ష్వీక్'

రచన :
జరోస్లావ్ హాసక్

అనుకరణ :
'ఆప్లవాన్'

పరమాయి ఇల్లు చేరుకోటం

౬

యుద్ధాని కనుకూలంగా ప్రజల అభిమాన ఉత్సాహాలు ఎంతెంత మాత్రంలో ఉన్నాయో తెలుసుకొనే ప్రక్రియలలో, పోలీస్ హెడ్‌క్వార్టర్సు వాతావరణమంతా దురధికార దౌర్జన్య పూరిత మయిపోయి ఉంది. తను మాతృదేశానికి, తమకేమాత్రం సంబంధంలేని పరాయివాళ్ల ప్రయోజనాలకోసం, నెత్తురోడ్చుకు చితికిపోవాల్సిన గతి పట్టిందన్న నగ్నసత్యాన్ని, కేవలం కాదనలేనివాళ్లను ఏ బహు కొద్దిమందినో మినహాయిస్తే, అక్కడి మహామహోద్యోగులంతా "హారం" "హారం", అంటూ ఎరకోసం ఎదురుచూస్తున్న క్రోలుపులుల లాంటి వన్యమృగాలే. ఆ మన స్తత్వాలకు వదులుపట్టిపోతున్న ధర్మశాసనాన్ని రక్షించి ఉద్ధరించేందుకు, జైళ్లు, ఉరికంబాలూతప్ప మరే ఇతరవిధానాలనూ విషయాలనూ అవగాహన చేసుకోగలినంత ఇంగితజ్ఞానము లేదు.

తమచేతులలో పడ్డ అభాగ్యుల విషయంలో విశిష్టనమ్రతను, కటికివృత్తితో పయోముఖ విష కుంభనమ్రతను, గోముఖ వ్యాఘ్రనమ్రతను అవలంబిస్తూ ప్రతిఅక్షరమూ తూచి వాడినట్లు మాట్లాడటం మొదలుపెట్టారు.

పరమాయిని చిక్కించుకొన్న గోముఖ వ్యాఘ్రానికి పసుపునలుపు చారల ఔక్సాపు హోదాకూడా ఉంది.

పరమాయిని అతనిముందర ప్రవేశపెట్టగానే, ఆ జంతువు, "అరెరె పాపం! నువ్వు మళ్లీ మా చేతుల్లో పడినందుకు నాకు చాలా విచారంగా ఉందిసుమా. నువ్వు కాస్త బుద్ధిమార్చుకొని సక్రమంగా దోవకు వచ్చి సంచరిస్తూ ఉంటావను కొన్నాం" అన్నాడు.

పరమాయి అతి వినయంగా మాట్లాడకుండా నిలబడి, అతి అమాయకంగా జో ఎన్నట్లు తల ఊపాడు. దాంతో ఆ వేటమృగం, అనుమానముతో పరమాయివంక ఒక్క క్షణం చూసి, గట్టిగా—

"ఆ వెధవమొహం పెట్టొద్దు; తీసెయ్యమని చెప్పలా?" అని అరిచాడు.

కాని యింతలో నేతమాయించుకొని వెంటనే ధోరణి పూర్తిగా మార్చేసి, అతిమర్యాదగా—

"అదికాదు. ఉన్నమాట చెప్తున్నాగా! నిన్ను ఇక్కడ ఖైదులో ఉంచటంఅంటే మాకు ఏమాత్రం ఇష్టంలేదుసుమా! నా మటుకు నాకు నీది అంత పెద్ద నేరంగా అనిపించటం లేదు. ఎందుకంటే, నీవు స్వతహాగా మందమతివి. అందుచేత స్వబుద్ధిచేత చేసిఉండవు. ఎవళ్లో దుర్మార్గులు నీకిల్లా దుర్బుద్ధులు చెప్పి పెడత్రోవను పట్టించారనే నా నమ్మకము. ఏమంటావు? అసలు ఇల్లాంటి అవకతవక చేష్టలు చెయ్యమని పురికొల్పిన వాళ్ళెవళ్లూ! చెప్పు మరి" అని అడిగాడు.

పరమాయి ఒక చిన్నదగ్గు దగ్గి గొంతుక సవరించుకొని, "చిత్తమండయ్యా, క్షమించండి. మీరనే అవకతవక చేష్టలేమిటో నాకు తెలియటం లేదండి" అన్నాడు.

ఆ అధికారి కృతకవాత్సల్యం తెచ్చిపెట్టుకొంటూ, పితృసమానుడైనట్లు నయంగా చెప్పటం మొదలు పెట్టాడు.

"సరే, చెప్తున్నా విను. నిన్నిక్కడికి తీసుకొచ్చిన పోలీసుఆఫీసరు చెప్పాడు. అక్కడ ఒకసందుమూల రాజుగారిప్రకటన ఉన్న పోస్టరు దగ్గర నుల్చున్నావట. జనం గుంపుగా మూగారట.—నువ్వు "ఫ్రాంజ్ జోసఫ్‌కి జిందాబాద్! మన మీ యుద్ధంలో నెగ్గుతాము!" అని కేకలేసి, జనాన్ని రెచ్చగొట్టావట. మరి అల్లా అవకతవక పనులు చెయ్యొచ్చునా? బుద్ధితక్కువకాదూ?"

పరమాయి, తన అమాయకపు చూపులను, ఆ అధికారిమొగంమీదికి నిశ్చలంగా ప్రసరింపచేస్తూ జవాబు చెప్పాడు:

"అక్కడ ఊరక్కూచూస్తూ గుడ్లప్పచెప్పి నిల్చోటం నాకు చేతకాలేదండి. రాజుగారిప్రకటన, అందరు జనంచేరిచదువుతూన్నా, ఒక్కడు కూడా ఉత్సాహం, సంతోషం ఏమాత్రం ప్రకటించకపోయేటప్పటికి నాకు ఒళ్లు మండుకుపోయిందండి. జై అన్నవాడుగాని, జిందాబాద్ అన్నవాడుగాని, ఒక్కడూ లేడంటే నమ్మండి బాబుగారూ! ఏమిటండీ!, ఎవరన్నా చూస్తే, "వీళ్లకేవళ్లకీ యుద్ధంతో సంబంధమే ఏమీ లేనట్టుందే" అని అనుకోడండీ?—మరి నేను, 91 రెజిమెంటు పాత సోల్జరు నాయను! వాళ్లలాగా అల్లా ఊరక్కూచూస్తూ ఊరుక్కోటం నాకు కుదురుతుందా? అందుకనే, అల్లా ఆ జయజయధ్వానం చేశాను. ఆ మాట కొస్తే, అక్కడ అల్లాంటి పరిస్థితిలో మీరున్నా, తప్పకుండా అల్లాగే చేసేవారనే నేను గట్టిగా చెప్పగలను. యుద్ధను అంటూ వచ్చాక, యుద్ధంలో నెగ్గకుండా ఎల్లాగండి?—మరి జయజయ ధ్వానాలు వెయ్యకుండా ఎల్లాగండీ? లక్ష చెప్పనీండి, వయ్యి చెప్పనీండి, ఆ పని తప్పని మాత్రం, ఎవళ్లూ నన్ను ఒప్పించలేరండీ, ఆ!" అన్నాడు పరమాయి.

పరమాయి ముందు—ఈ అమాయకపు మేకపిల్లచూపుతో, అంతటి భీకరమృగమూ, తన క్రూరదృష్టి నిశ్చలంగా నిలుపుకోలేక, తలవాల్చేశింది.

ఆయన తల వాల్చేసి తన చూపులు బల్లమీద కాగితాల దస్త్రాలలో ముంచేసుకొంటూ పరమాయితో మెల్లిగా అన్నాడు

"నీ భక్తి ఉత్సాహాలను నేను మెచ్చుకొంటూనే ఉన్నాను. కాని కాస్త సమయం తెలుసుకొని ప్రదర్శించిఉంటే బాగుండేదనుకొంటున్నాను. చూడూ! ఒకపోలీసు నిన్ను అరెస్టుచేసి తీసికొస్తున్నాడని నీకూ తెలుసును గదా! మరి అల్లాంటి సమయంలో, ఇల్లాంటి దేశభక్తిప్రదర్శనం చేస్తే, జనులు కేవలం వెక్కిరింతగానూ, అల్లరికి చేసిందిగానూ భావిస్తారుగాని నిజమనుకొంటారా! తప్పకుండా, వెక్కిరింతగానే అనుకొంటారు."

పరమాయి నిదానంగా సమాధానం చెప్పటం మొదలు పెట్టాడు:

"ఏమనిషికైనా పోలీసువాళ్లు పట్టుకొని తీసుకెళ్తున్న ఘట్టం జీవితంలో చాలా విషమఘట్టమేనని నేనూ ఒప్పుకొంటున్నానండి. కాని వ్యక్తి అయినా, అల్లాంటి విషమ ఘట్టంలో కూడా, యుద్ధం ప్రారంభమయిందని తెలియగానే, తన విధ్యుక్తధర్మాన్ని నెరవేర్చటానికి, ఏమాత్రమూ సంకోచించలేదంటే, అల్లాంటి వ్యక్తి, దుర్మార్గుడు కాడనే నా కనిపిస్తూందండి."

ఒక్క ముహూర్తంపాటు ఇద్దరూ ఒకళ్లవంక ఒకరు రెప్పార్చకుండా చూడసాగారు. చివరికి పోలీసు ఆఫీసరు ఇంక తమాయించుకోలేకపోయాడు, కోపంతో—

"ఓరి పరమాయి! ఫో, ఎల్లా తగులడుతావో తగలడు. కాని చెప్తున్నాను విను అబ్బాయి. ఈమాటు మళ్లీ నాముందు కనబడ్డావంటే—సున్నంలోకి ఎముక మిగలదు. తెలిసిందా—జాగ్రత్త!" అన్నాడు.

పరమాయి ఒక్క అడుగు ముందుకు వేసి పోలీసు ఆఫీసరు దగ్గిరకు వచ్చాడు. ఏం చేస్తున్నాడో కూడా ఆఫీసరు గమనించలేనంత అకస్మాత్తుగా, చటాలున ముందుకు వంగి, ఆయనచేతులు ముద్దుపెట్టుకొంటూ కృతజ్ఞత వెలిబుచ్చుతున్నాడు.

"మీరు చాలామంచివారండి, మీరు నామీద చూపించినదయ ఎప్పటికీ మరవనండి. మిమ్మల్ని తప్పకుండా పరమాత్ముడు రక్షిస్తాడండి. మీకు ఎప్పుడైనా మంచి కుక్కపిల్ల కావాలంటే నాకు కబురుచేయండి. క్షణంలో సమకూర్చిపెడ్తాను. నాకు అదే వ్యాపారం లెండి."

పరమాయికి మళ్లీ స్వాతంత్ర్యం లభించింది. ఇంటికి బయలుదేరాడు.

ముందు యింటికి పోవటంకంటే దోవలో ఒకసారి "పానశాలకు" వెళ్లి వెళ్ళటం మంచిది కాదా అని ఆలోచించాడు. డిటెక్టివ్ బ్రెష్నిడర్‌తో కలిసి ఏ గుమ్మంలోనుంచి బైటికి వచ్చాడో, ఆ గుమ్మమే మళ్లీ తొక్కి తన భూప్రదక్షిణం పూర్తిచేసుకొన్నాడు. తలుపు తోసి లోపలికి ప్రవేశించాడు.

పానశాల బావురుమంటూ, నిశ్శబ్దంగా ఉంది. ఎవళ్లో ఒకళ్ళిద్దరు మధ్యాచార్యులు మాత్రమే దిగాలుబడి అక్కడే కూర్చుని ఉన్నారు. అమ్మకం బల్లవెనుక, పావిలెక్ భార్య, పానపాత్రల వంక గుడ్డిచూపు చూస్తూ, కూలబడిపోయిఉంది.

పరమాయి కులాసా ఒలకబోస్తూ తనను ప్రవేశపెట్టుకున్నాడు.

"అమ్మయ్య! మళ్లీ ఇక్కడికి వచ్చానత్తా! ఏదీ, ఒకగ్లాసుడు ఇల్లా ఇయ్యండి! పావిలెక్ ఏడీ! అతనుకూడా ఇంకా ఇంటికి రాలేదా?"

జవాబు చెప్పటానికి బదులుగా, పావిలెక్ భార్య భోరుమని ఏడవటం మొదలు పెట్టింది. తనదుఃఖాన్నంతనూ క్రోడీకరించి, ఒక్కొక్కమాటే విడివిడిగా పలుకుతూ, శోకన్నాలు మొదలు పెట్టింది.

"వారం రోజుల క్రింద—అతనికి—పది సంవత్సరాల కఠినశిక్ష—వేశారు.

"అరే! బలే గమ్మత్తు జరిగిందే"—అన్నాడు పరమాయి. "అయితే అప్పుడే ఏడు రోజులు అయిపోయాయి అన్నమాట."

"ఎంత జాగ్రత్తగా ఉండేవాడు! ఎంత జాగ్రత్తగా ఉండేవాడు—ఆయనేచెప్పేవాడు ఎన్నిమాట్లో—తను ఎంతో జాగ్రత్తగా ఉంటున్నానని" అంటూ ఏడ్చింది పావిలెక్ భార్య.

కొతాదార్లు ఒకళ్లొకళ్లే లేచి, తను తాగినదానికి డబ్బులిచ్చేసి బైటికి నడవసాగారు.

"మరి, ఇంకా బ్రెష్నిడీర్ ఇక్కడికి వస్తూన్నాడా?" అని అడిగాడు పరమాయి.

"ఈమధ్య నాలుగైదుసార్లు వచ్చాడు. ఒకటో రెండు గ్లాసులు తాగేవాడు. ఇక్కడికి ఎవళ్లెవళ్లు వస్తున్నారని నన్ను అడిగాడు. కొతాదార్లు, ఏం మాట్లాడుకొంటున్నారో అని పొంచి విన్నాడు. వాళ్లు ఫుట్‌బాల్ మాచీలను గూర్చి మాట్లాడుకొంటున్నారు. అతను రావటం చూసినప్పుడల్లా ఫుట్‌బాల్ మాచీలవిషయమే మాట్లాడుతూంటారు" అని ఆవిడ బదులుచెప్పింది.

పరమాయి నెమ్మదిగా కూర్చుని రెండోగ్లాసు కాళీ చేస్తున్నాడు.

అప్పుడే బ్రెష్నిడీర్ లోపల ప్రవేశించాడు. పానశాలలో చుట్టూ కలయచూశాడు. పరమాయి తప్ప ఎవళ్ళూలేరు. పరమాయికి దగ్గిరగా జేరి కూర్చున్నాడు. రెండుగ్లాసుల సారాయికి ఆర్డరిచ్చి, పరమాయి పలుకు లొలుకుతాయేమోనని అట్టే కూర్చున్నాడు.

పరమాయి అతనితో కరచాలనంచేస్తూ "ఎవరు? మీరా! ముందు గుర్తించలేదుసుమండీ. నాకు వెధవది జ్ఞాపకశక్తి తక్కువ, ఒక మొహమూ, ఒక మొహమూ గుర్తు తెలియవు. మిమ్మల్ని కడసారి పోలీసుస్టేషను హెడ్‌క్వార్టర్సులో చూశాననే గుర్తు. ఊ! ఏమిటి విశేషాలు? ఏం చేస్తున్నారు? ఇక్కడికి తరుచు వస్తున్నారా?" అంటూ కబుర్లు మొదలెట్టాడు.

"నేను యివాళ ప్రత్యేకం నీకోసమే వచ్చాను. పోలీసుస్టేషనులో, నువ్వు కుక్కల వ్యాపారం చేస్తావని చెప్పారు. నాకు ఓమంచి జాగిలమో, మందకుక్కో, అల్లాంటిదేదో. ఓమంచి కుక్క కావాలి. అది నిన్నడుగుదామని వచ్చాను" అన్నాడు బ్రెష్నిడీర్.

"మీకు తప్పకుండా తెప్పించి పెట్టగలను. అయితే మీకు మంచి జాతి కుక్క కావాలా, లేక ఊరకుక్క కావాలా?"

"జాతికుక్క అయితేనే మంచిది" అన్నాడు బ్రెష్నిడీర్.

"పోలీసుకుక్క అయితే మీకు మంచిది కాదూ—ఇట్టే పసిగట్టేసి, ఎక్కడెక్కడ నేరం జరిగితే అక్కడక్కడి కల్లా మిమ్మల్ని అలాగ్గా తీసుకుపోతుంది. అల్లాంటిది కావాలా!"

బ్రెష్నిడీర్ తొణక్కుండా, "నాకు జాగిలమే కావాలి. కాస్త కరవకుండా ఉండేది చూడు."

"మరి, అయితే పళ్లులేని జాగిలం కావాలా?" అని అడిగాడు పరమాయి.

"పోనీలే! జాగిలం వద్దు." అంటున్నాడు బ్రెష్నిడీర్.

"మరీ అయితే ఏది కావాలి? రేచుకుక్క కావాలా, ఎలకలు బలేగా పట్టుంది. లేక నీటికుక్క, భైరవాయి, శ్వాన—మహాశ్వానం" అంటూ పరమాయి తన శునకభాషను ఏకరువు పెడ్తున్నాడు.

బ్రెష్నిడీర్ ఈ పేర్లుఅన్నీ వింటూంటే, కంగారుపడ్డాడు. అసలు రహస్యం-బ్రెష్నిడీర్‌కి అంతవరకూ కుక్కకు నాల్గు కాళ్లుంటాయో, రెండుకాళ్లే ఉంటాయో కూడా తెలియవలసిన అవసరం లేకుండానే బ్రతికాడు. ఈ సహదేవ శునకశాస్త్రంలో అతనికి అక్షరాభ్యాసంకూడా జరగలేదు. పోలీసుస్టేషనులో "పరమాయి వెంట ఉండి, కుక్కలు కొనేపేరుతో అతని పరిచయం వృద్ధిచేసికొని కూపీతీయవలసిం"దని అతన్ని గూఢచారిగా నియమించి ఆర్డరిచ్చారు. అందుచేత ఈ కుక్కల ప్రసక్తి తేవలసి వచ్చింది. పరమాయి శాస్త్రవ్యాకరణంలోకి దిగుతున్నాడు.

బ్రెష్నిడర్ కంగారుగా, "ఎలకలుపట్టుందన్నావే, ఆ రేచుకుక్క చాలులే" అన్నాడు.

"రేచుకుక్కల్లో చాలా తేడా లున్నాయి. పెద్దసైజువి ఉంటయి, చిన్నసైజువి ఉంటయి. నేనెరిగున్న చోట ఒకచోట, ఐదు కుక్కలున్నయి, మూడు పెద్దసైజువి; రెండు చిన్నసైజువి. అయిదూకూడా ఒళ్లో ఇముడుతాయి. అవి మంచికుక్కలేనే నయితే అవి పుచ్చుకోమనే చెపుతాను" అన్నాడు పరమాయి.

"మంచిదే! ఐతే ధర ఎంత ఉంటుంది?" అని అడిగాడు బ్రెష్నిడీర్."

"అది సైజునుబట్టి ఉంటుంది. అంటే పెద్ద సైజు తక్కువ ధరా, చిన్నసైజు ఎక్కువ ధరనూ—ఆ కుక్కల్లో అదేగమ్మత్తు! సైజు చిన్నదైనకొద్దీ, ధర ఎక్కువౌతుంది" అన్నాడు పరమాయి.

"నాకు పెద్దదే కావాలి! కాపలా కుక్కగా కూడా పనికి వస్తుంది" అన్నాడు బ్రెష్నిడీర్—మళ్ళీ ధర ఎక్కువపెడితే, పోలీసు డబ్బు దుర్వ్యయం చేసేవని అధికారులు అంటారేమోనన్న భయంతో.

"ఓ! అదే మంచిది. అల్లాగే చూడవచ్చు—కొన్ని పెద్దసైజు కుక్కలనే 50 రూపాయిలకు కొనిఇయ్యగలను. కావాలంటే అంతకన్నా డబుల్ సైజువు కూడా ఉన్నాయి. పాతికకే దొరకవచ్చును. అన్నట్టు ఓ సంగతి మర్చిపోయాము...మీకు బాగా పసిపిల్లలు కావాలా, లేక ఈనుముదిరిన కుక్కలు కావాలా? ఆడకుక్కా, మగకుక్కా?"

బ్రెష్నిడీర్‌కు తల దిమ్మెత్తిపోయింది "అదంతా నువ్వే ఏదో మంచిది చూడు. రేపు సాయంత్రం నేను మీయింటికి వస్తాను. అప్పటికి కొనటంపడుతుందా?"

"మీ కెందుకు వచ్చేసెయ్యండి. తప్పకుండా తెచ్చిపెట్టాగా"—అన్నాడు పరమాయి. అని "అయితే ఓ చిన్నమాట—మరి నాకు కొంత అడ్వాన్సు ఇస్తేనేగాని కొనటంపడదు. ఓ ముప్ఫైరూపాయ లిప్పించండి."

బ్రెష్నిడీర్ ముప్ఫై రూపాయలూ ఇచ్చాడు. ఇద్దరూ మళ్లీ చెరిరెండు గ్లాసులూ పుచ్చుకొని బైటికి వచ్చారు.

(20 వ పేజీ చూడుడు)

పుదుచ్చేరి గోవా ప్రహసనం

పోథన్ జోసఫ్

అక్టోబరు 27 తేదీన ఒక ఫ్రెంచి 'క్రూయిజర్' (యుద్ధనావ) 'దుగో పీటూరిన్' పుదుచ్చేరినుంచి మాహేకు ఫ్రెంచిసైనికులను తీసుకువెళ్ళింది. సైనికులతో దిగిన కాప్టెను బోవోర్డేకు ఎక్కడా యుద్ధ సూచనలు కన్పించలేదు. అదే రోజున 'జాతీయ రక్షకసంఘా'ని కర్యక్షుడైన శ్రీ ఐ. కె. కుమారన్ ఇండియా ప్రభుత్వానికి టెలిగ్రాం ఇచ్చాడు—మాహేరగడలో జోక్యం కల్పించుకోవలసిందని. ఇలాంటి చిన్నవిదేశ వలసప్రాంతాలపై తుపాకులను బారుపెట్టి, వాటిని దేశంలో చేర్చాలని అంటే మనకు సరియైన చారిత్రక స్ఫూర్తి లేదన్నమాట.

హైదరాబాదును ఇండియన్ యూనియన్ అదుపులోకి తేవటానికి కారణాలు: (1) ఇండియను భూభాగంలో హైదరాబాదుకున్న స్థానపు విశిష్టత. (2) రజాకార్ల సవాలు. (3) పాకిస్తాన్‌తో గూడు పుఠాణీ. (4) అధిక సంఖ్యాకులను పీడించటం.

జాతీయంగానూ, ప్రాంతీయంగానూ, సంస్కృతిరీత్యాను పుదుచ్చేరీ, గోవా ప్రజలు మనకు చెందినవారే. ఇదేవిధంగా ఏడెను మనకు చెందదు. కాని కాంగ్రెసు తీర్మానాలను అండగా తీసుకొని ఇండియా ఏడెనును, దాని ఉప్పువ్యాపారమును తనపరంచేయమని ఆందోళన చేసింది. బర్మాప్రతినిధులు కాంగ్రెసు తీర్మానాలను బలపరిచారు. అరబ్బు షేకులకు తిరిగిచ్చివేయకుండా, బ్రిటను ఏడెనును తనవశం చేసుకుంది. విదేశ వలసప్రాంతాలు చారిత్రావశ్యకతబట్టి ఏర్పడినవిగాని బుద్ధిపూర్వకంగా ఓ పన్నాగం ప్రకారం ఏర్పడినవి కావు. గోవా మహమ్మదీయప్రాంతమై, రజాకార్ల గొడవ ఉండి అరేబియా సముద్రాని కావలి ప్రాంతాలపై పుకు మొగ్గిఉంటేభద్రతా కారణాలకై నేను కయ్యానికి కాలు దువ్వమనేవాడిని. హైదరాబాదుకు విరుగుడుగా పనిచేసిన "మేం ప్రవేశిస్తున్నాం" అనే మంత్రాన్ని మళ్లీ ప్రయోగించమని ప్రధానికి విజ్ఞప్తి చేసేవాడిని. పుదుచ్చేరి సంబంధించినంతవరకు, మనం దూప్లే, వాండివాష్‌లను జ్ఞప్తికి తెచ్చుకో నక్కర్లేదు. పుదుచ్చేరి ఫ్రెంచివారి కాపలాలో ఉంది.

కారన్‌వాలిస్ కాలంలో నెపోలియన్ దూతలు టిప్పుసుల్తాన్‌తో గూడు పురాణీ చేసినమాట నిజమే—ఉభయులూ కలసి బ్రిటిషు వారిని ఇండియాలోంచి గెంటేయాలని. కాని ప్రపంచచరిత్రలో ఒక ముఖ్య ఘట్టం ముగిసిన ఈ సందర్భంలో సైనిక ఆవశ్యకత అనే ధోరణిలో మనం మాటాడజాలం. ఉదాహరణకు చందర్‌నగరం ఫ్రెంచి సైన్యాలకు కేంద్రం కాగలదని భ్రమపడటం.

స్పెయిన్‌కు చెందిన జిబ్రాల్టరు విషయం: సంస్కృతిసంగతి అటుంచుదాం. ప్రాంతీయంగా జిబ్రాల్టరు స్పెయిన్‌ది కావాలిగాని, బ్రిటనుది కాగూడదు గదా. కాని ఫ్రాంకో పర్యవేక్షకుల సమక్షంలో ప్రజాభిప్రాయం తెలుసుకోవాలని ఎవరూ అనట్లేదు. ఎందుకంటే ఈ విమానయుగంలో జిబ్రాల్టరు ప్రమాదకరమైన పరిస్థితిగా లేదు. హాంగ్‌కాంగ్‌ను బ్రిటిషువాళ్లు వదలలేదు—బావమరదైన సన్-యత్-సేన్ పోతూపోతూ చేసిన ప్రకటనలో ఓ ప్రత్యేక అంశాన్ని ఎత్తిచూపించి చియాంగ్-కై-షేక్ వాదించినా.

ఈప్రాంతాలను మళ్లీ పూర్వస్థితికి తేవటం నిజంగా అవసరమా అనేదే ప్రశ్న. సీనులోని సోదరులకంటె పుదుచ్చేరిలో ఇండియనులు బాధసపీడన అనుభవిస్తున్నారా?

నిజం చెప్పాలంటే, ప్రజాభిప్రాయం తీసుకుంటే (ప్లెబిసైట్), అధికారంలో ఉన్న ప్రభుత్వానికే అనుకూలంగా ఉంటుంది. ఆప్రాంతంలోని ప్రభుత్వస్థానే నిష్పాక్షికమైన మూడోవారి పర్యవేక్షణ ఉంటే తప్ప, లేకపోతే వినోదంగా మారుతుంది. విదేశ వలస ప్రాంతాల విషయంలో ప్రజాభిప్రాయం తీసుకోవాలని ఇండియా ప్రభుత్వం చేసిన నిర్ణయం వాస్తవరంగానికి దూరంగా ఉండి సిద్ధాంత రీత్యా చేసిన నిర్ణయం. ఇండియాలోని కోటాను కోట్ల ప్రజల సంకల్పాలను, తెలుసుకో నేందుకుగాను 1946 లో ప్రజాభిప్రాయ విధానాన్ని అవలంబించిఉంటే, బ్రిటిషు ప్రభుత్వపు హఠాత్ నిష్క్రమణను కోరేవారు 100 కి 10 మంది కూడా ఉండే వారు కారు. హిందూస్థాన్ ఉండేది కాదు. పాకిస్తానూ ఉండేది కాదు.

ఇండియా, బర్మా, సిలన్ దేశాల్లో బ్రిటిష్ వారు ఈవిధానాన్ని అవలంబించకపోవటానికి కారణం, రాజకీయ ఆధిపత్యం మంచి పద్ధతి కాదని నిశ్చయించుకోవటమే. వ్యాపారపు అంకెలు చూస్తే, వారి విధానపు ఔచిత్యం సుబోధక మవుతుంది.

గడచిన జూన్ నెలలో హైదరాబాదులో ప్రజాభిప్రాయ విధానాన్ని అవలంబించిఉంటే, బాధ్యతాయుత ప్రభుత్వం కావాలనీ, హైదరాబాదు ఇండియాలో చేరాలని 100 కి ఒకరుకూడా ఓటుచేసేవారు కారు. ఎందుకంటె ప్రజాభిప్రాయం అసఫ్ జాహీరాజవంశానికి, ఏకచ్ఛత్రాధిపత్యానికి పూర్తిగా అనుకూలంగా ఉండేది.

పుదుచ్చేరి ఎన్నికల రోజున కాంగ్రెసు అధ్యక్షుడు ప్రజలకో సందేశం పంపాడు—పుదుచ్చేరి ఇండియాలో చేరవలసిందని ప్రోత్సహిస్తూ. కాని ప్రజలకు ఉత్సాహమేమీ కల్గలేదు. సందేశం విఫలమైందని మనం ఆశ్చర్యపడ నక్కరలేదు. ఇండియా ప్రభుత్వం తరఫున ప్రజాస్వామికపండితులు వచ్చి ఫ్రెంచి రిపబ్లికను ప్రభుత్వం జరిపే ఎన్నికల కార్యక్రమాన్ని పర్యవేక్షించాలనే మాట ఫ్రెంచిగవర్నరుకు నచ్చలేదు. ఇందుమూలంగా కాంగ్రెసు సంస్థ కొద్దిమంది పర్యవేక్షకులను ఫ్రెంచిప్రాంతాలకు ఉరికించింది. యూరపులో విప్లవాత్మకమైన ప్రజాస్వామ్యానికి మూలపురుషులైన ఫ్రెంచివారు తమ తర్వాత వచ్చినవారికంటె తమకే ఎక్కువ తెలుసు ననుకోటం వారికి సహజం.

పక్కనున్న ప్రాంతంలో రాక్షసపీడన, అరాజక ప్రమాదంఉంటే, ప్రభుత్వం ప్రత్యక్షచర్యనుగురించి ఆలోచించవచ్చు. కాని సలహా సంప్రదింపు తంత్రవిధానాలన్నిటినీ వినియోగించిన తర్వాతనే ఆ ఆలోచనకు రావాలి. చందర్‌నగరంలో కాపురముంటూ, కలకత్తాలో ఉద్యోగాలు చేసే గుమాస్తాలు జాతిహత్యావిధానమున్నదని ఫిర్యాదు చేయట్లేదు.

గోవాలో పోర్చుగీసువారు ఒక నావిక కేంద్రాన్ని నిర్మిస్తేనూ, లేదా పుదుచ్చేరిలో ఫ్రెంచివారు పెద్ద వైమానిక కేంద్రాన్ని స్థాపిస్తేనూ, ఇండియా కనిపెట్టి ఉండవలసిందే. గడచిన యుద్ధంలో పోర్చుగల్ దేశం పాల్గొనలేదు. గోవాలో రెండు జర్మను యుద్ధనావలు తలదాచుకున్నాయ్. బ్రిటిషువారు వాటిని స్వాధీనం చేసుకోవాలనుకునేవారే. కాని రాజకీయ మర్యాద అందుకు ఒప్పుకోదు. వారు చేయగలిగిందల్లా ఏమిటంటే, ప్రమాదం రాకుండా వాటిని ఓకంటితో కనిపెట్టిఉండటంమటుకే. గోవాలో జమీందారీ పరిస్థితులు, ఎప్పటివో శాసనాలు అమలులో ఉన్నాయని డాక్టరు రామ్మనోహర్ లోహియా ప్రభృతులు అంటారు. కాని ఓప్రత్యేక ప్రభుత్వ విధానమున్న దన్నంత మాత్రాన ఆ ప్రాంత వ్యవహారాల్లో ఆక్రమణోద్దేశ్యంతో జోక్యం కల్పించుకోవచ్చు అని అంతర్జాతీయ సంబంధాల్లో ఎక్కడా చెప్ప లేదు. అమానుషమైన అత్యాచారాలు, పడవల్లో దొంగవ్యాపారం, లేక బానిస వ్యాపారం, లేక శత్రువుల మనుష్యులకు ఆశ్రయమివ్వటం ఇలాంటి పరిస్థితులుంటే, విషయాన్ని ంకో దృష్ట్యా చూడాలి.

మోసెస్ నాటినుంచి, మతచ్యుతి కేసులకు, తిరుగుబాటుదార్లకు తలదాచుకోటానికి కొన్ని హక్కులుంటూ వచ్చినయ్. పుదుచ్చేరిలో ఆశ్రయం పొంది, శ్రీ అరవిందఘోష్ ఆ హక్కునుపయోగించుకున్నాడు. ఇండియా రాజకీయాల్లో గాంధీజీ ప్రభావం సన్నగిలి, ఫాసిస్టు నిరంకుశత్వం ఏదో ఒకరూపంలో తలెత్తితే, 'గెస్టపో' పోలీసు బూట్ల చప్పుడు వినకముందే పరిసరంలో ఉన్న ఏదో ఆశ్రయానికి పారిపోవాలని నామటుకు నేను అభిలషిస్తాను.

ఈ విదేశ వలసప్రాంతాలను ఇండియాలో చేర్చాలనే దీక్షకు కారణమేమిటి? ఇండియా అంతా ఒకేఒక అధికారంకింద సమైక్యంగా ఉండాలనే కోరిక. అది ప్పుడు బలీయమైన రాజకీయావశ్యకతగా లేదు; డాంజిగు నాజీ జర్మనీ కవసరమైనంతగా అట్టి అర్థికావశ్యకత లేదు. మొదటికార్యం మొదట అనే సూత్రం బట్టి, విదేశవలస ప్రాంతాలను స్వాధీనం చేసుకోవాలనే కోలాహలం అకాలం. అప్రస్తుతం. సమైక్యతను దోహదపరిచే శక్తులు వాటిపనిని అవి నెరవేర్చుకుంటయ్. అయితే హైదరాబాదులో అవలంబించిన 'పోలీసుచర్య'కంటె భిన్నంగా ఉంటుంది—ఈ సమైక్యతా పరిణామం.

తులాసా కబుర్లు:

"రంగుల రంజు"

శ్రీ జి. యస్. సూరి

పేకాటవాళ్ల పరిభాషలో ఒకేరంగు రాజా రాణీలను ఇస్తోకు లంటారు. రంగుమారిన జంటలు ఇస్తోకులుకావు. వాటికి ఓకులు కూడా ఉండవు. రంజు యావత్తూ రంగుమీదనే నడుస్తుంది.

ఈలాంటి అవస్థ చీట్లపేక ఇస్తోకులకు మాత్రమే సంప్రాప్తమవుతుందని అనుకోకూడదు. మనుష్యజంటల వ్యవహారం కూడ ఇట్లాగే తయారయింది. మారురంగు దంపతులు మారాముళ్లకు గురికావలసి వస్తున్నవి.

శ్వేతాంగనను వివాహమాడిన భారతీయుడొకడు ఆఫ్రికానుంచి సతీసమేతంగా ఇటీవల లండన్ చేరాడు. ఆ చీకటిఖండంలో అందులో ముఖ్యంగా దక్షిణాఫ్రికాలో తాను పడ్డ కడగండ్లను పత్రికావిలేఖరులకు ఏకరువు పెట్టాడు. భార్యాభర్తలు ఇద్దరూ ఒకే రైలుపెట్టెలో ప్రయాణం చేయటానికి వీలుపడేది కాదుట. సవర్ణుల పెట్టెలో తాను, అవర్ణులపెట్టెలో తన ఇల్లాలు కూర్చుంటేనేగాని అధికార్లు ఒప్పుకునే వాళ్లు కాదట. తెల్లవారి హోటళ్లలో అడుగు పెట్టటానికి నోచుకోలేదట. ఆఖరుకు బజారుకు పోతే రోడ్డుమీద ఆయన నిలబడి షాపులోకి భార్యను పంపవలసివచ్చిందట. మారురంగు భర్తను కట్టుకున్నందుకు ఆమెను చూసి అక్కడి వాళ్లు ఏవగించుకున్నారట.

ఇది జరిగిన కొద్దిరోజులకు పత్రికలలో మరొక వింతవార్త ప్రకటనయింది. ఆఫ్రికాలో అక్కడక్కడ చిన్నచిన్న నీగ్రోరాజ్యాలు ఈ నాటివరకూ మిగిలిఉన్నవి. వాటిలో ఒక నీగ్రో మహారాజు నిగనిగలాడే తన ముద్దుకుమారుణ్ణి ఉన్నత విద్యకు ఇంగ్లండు పంపించాడు. ఆ యువకుడికి చదువు అంటినా అంటకపోయినా, ఒక ఆంగ్లేయయువతినిమాత్రం భార్యగా అంట కట్టుకోగలిగాడు. ఈవిషయం నెమ్మదిగా వృద్ధ మహారాజుకు చారుల ద్వారా తెలిసింది. తారామండలంగా మండిపడ్డాడు. మహామంత్రులకు కబురుచేశాడు. రాజ్యాంగ నియమాలను, చట్టాలను తిరగవేసి, సింహాసనానికి తెల్లరాణి అర్హురాలు కాదని అమాత్యశేఖరులు నిర్ధారణచేశారు. యువరాజును తక్షణం లండనునుంచి తిరిగి రమ్మని ఫర్మానా జారీచేశారు మహారాజులుంగారు. ఇస్తోకును చీల్చటానికి విశ్వప్రయత్నాలూ జరిగితీరగలవని ఊహించవచ్చు. పాపం యువరాజు విడాకులకు ఒప్పుకుంటాడో, లేక విండర్సు ప్రభువును అనుసరిస్తాడో చూడవలసి ఉన్నది.

మొత్తంమీద రంగుసమస్య తీవ్రరూపం దాల్చేట్లు కనబడుతుంది. పూర్వం యుద్ధాలన్నీ కామినీకాంచనాలకోసం తటస్థించేవి. తరువాత మతంకోసం కొన్ని యుద్ధాలు జరిగినవి. ఆదర్శ ఆశయాలకోసలం ఐక్యరాజ్యసమితిలో సంఘర్షణాలు నిత్యచర్యగా పరిణమించినవి. ఇక రాబోయే మహాసంగ్రామాలు రంగుభేదాలవల్ల తారసిల్లేట్లు కనబడుతుంది. ఉన్నవాళ్లూ లేనివాళ్లూ ఢీకొనక తప్పదని విప్లవకారుడు మార్క్సు నూరేళ్లనాడు చెప్పాడు. ఈ సూత్రం భాగ్యంఉన్నవాళ్లకు లేనివాళ్లకేగాక రంగు ఉన్నవాళ్లకు లేనివాళ్లకు గూడ వర్తించేట్లు తోస్తుంది.

జపానుదేశంలో ఇటీవల యుద్ధనేరస్థుల విచారణ జరిగింది. ఒక్కొక్క మిత్రరాజ్యం ఒక్కొక్క జడ్జిని నియమించింది. ఇండియా తరఫున జస్టిస్‌పాల్‌గారు అక్కడికి హాజరైనారు. యుద్ధసమయంలో కార్యభారం నిర్వహించిన మంత్రులను, సేనానాయకులను, తదితర ఉద్యోగస్థులను బోనుఎక్కించారు. సాక్ష్యాలను బనాయించి అభియోగాలను విచారించారు. కారాగృహవాసం మొదలు ఉరిశిక్షల వరకు ముద్దాయిలకు విధించారు. ఈ తీర్పుకు కొద్దిమంది జడ్జీలుమాత్రం ఒప్పుకోలేదు. వారిలో జస్టిస్‌పాల్‌గారు ఒకరు. నిష్పాక్షికంగాచూస్తే ముద్దాయిలు ఎటువంటి నేరమూ చేయలేదన్నాడు ఆయన. శ్వేతజాతులు, అందులో ముఖ్యంగా ఆస్ట్రేలియావాళ్లు ఈమధ్య ప్రదర్శిస్తున్న దురతిశయము, రంగుజాతులవాళ్లమీద వారు చూపుతున్న నిరసన, జపానువారు యుద్ధంలో దిగటానికి దారితీసినవని కొట్టినట్లు చెప్పారు. ఇది నిర్హేతుకమైన ఆక్షేపణ అనటానికి అవకాశం కనబడదు. ఏది ఎట్లా ఉన్నా, రాబోయే సంఘటనలకు జపానుకాండ నాందీప్రస్తావన అనేందుకు అనుమానం ఉండనక్కరలేదు.

ఈ గొడవకు మూలకారణం బ్రహ్మదేవుడు. మానవులను అందరిని కాకులమాదిరి నల్లగానో, కొంగలమాదిరి తెల్లగానో సృష్టించినట్లయితే ఈ చిక్కు వచ్చేదే కాదు. అట్లా కాకుండా కేవలం తన విలాసంకోసం ఇన్నిరంగులకు ఇవకాశం ఇచ్చి, లేనిపోని దురవస్థలు మనకు తెచ్చిపెట్టాడు. అయితే శాస్త్రజ్ఞులుమాత్రం తప్పు బ్రహ్మదేవుడిది కాదంటారు. దీనికి కారకుడు సూర్యుడని నిరూపించారు. ఒకప్రయోగం ఇందుకు ఉదాహరించారు. గాడిపొయ్యిమీద అట్లుపోసే రేకువేసి, పొయ్యికి ఒకవైపున నిప్పు ఉంచమన్నారు. ఆ చివరనుంచి ఈ చివర వరకూ గంగ నురుగువలె రుబ్బిన పిండితో అట్లు పొయ్యమన్నారు. పావుగంట అయినతరువాత వాటిని పరీక్షించమన్నారు. ఒక్కొక్క అట్టుకు ఒక్కొక్క వర్ణం వచ్చిఉంటుంది చూసుకోమన్నారు. తెల్లని పచ్చిపిండి దోసెలు మొదలుకొని బొగ్గుగా మాడిన దోసెలవరకు సెగనుబట్టి తయారవుతాయన్నారు. అట్లాగే మనుష్యులు. దోసెలకు బదులు మానవులనూ, నిప్పుకు బదులు సూర్యుణ్ణి తీసుకుంటే, రంగుల రంజుకు కారణం బోధపడుతుం దన్నారు.

శీతోష్ణస్థితినిబట్టి శరీరచ్ఛాయ మారుతున్నట్లు మనం ఒప్పుకోక తప్పదు. మనదేశానికి బ్రతుకు తెరువులకోసం బయలుదేరివచ్చే శ్వేతముఖులను చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. వచ్చిన రోజున దంతపు బొమ్మలమాదిరి ఉంటారు. మర్నాడు కందినట్లవుతారు. కొంత కాలానికి కంద పిలకరంగుకు తిరుగుతారు. అంటిపట్టి పదేళ్లు ఇక్కడ ఉండేప్పటికి దాదాపు మనలాంటి కంచు విగ్రహాలుగా మారిపోతారు. అట్లాగే

(17 వ పేజీ చూడుడు)

భారతరాజకీయాలు :

రాజ్యాంగ ప్రణాళిక

ఇండియా రాజ్యాంగ ప్రణాళికను రచించటానికై రాజ్యాంగసభ నియమించిన సంఘపు సభ్యులు·

అధ్యక్షుడు : డా. బి. ఆర్. అంబేద్కర్.

సభ్యులు— శ్రీ యన్. గోపాలస్వామి అయ్యంగారు

,, శ్రీ అల్లాడి కృష్ణస్వామిఅయ్యర్

,, శ్రీ కె. యం. మున్షి

,, సయ్యద్ మహమ్మద్ సాదుల్లా

,, శ్రీ యన్. మాధవరావు

,, శ్రీ డి. పి. ఖైతాన్

సభ్యుల్లో మున్షీ తప్ప మిగిలినవా రందరూ జాతీయ, స్వాతంత్ర్యోద్యమమునకు ఎడంగా ఉన్నవారే. అయినా రాజ్యాంగ శాస్త్రమున ప్రవీణు లని వీరిని నియమించిరి. ఈ సంఘ సమావేశములకు సభ్యు లందరూ హాజరు కాలేదు. ప్రతి సమావేశమునకు తగినంతమంది సభ్యులు హాజరైరి. హాజరైనవారి సంపూర్ణామోదముతో గాని, లేక అధిక సంఖ్యాకుల ఆమోదముతో గాని నిర్ణయములు జరిగినవి. దేశపు భవిష్యత్తుకు, అభ్యుదయానికి, తగిన రాజ్యాంగాన్ని రచించవలసిన మహత్తరబాధ్యత ఉండికూడా, సభ్యులు అందరూ సమావేశాలకు హాజరవకపోవటం తగని పని.

ఈసంఘం రాజ్యాంగపు ముసాయిదాను రచించి గడచిన ఫిబ్రవరిలో రాజ్యాంగసభ అధ్యక్షుని కందించిది.

ముసాయిదా వివరములు:—

భాగములు	— 18
షెడ్యూలులు	— 8
క్లాజులు	—315.

ఈనెల 4 వ తేదీన రాజ్యాంగసభ సమావేశమైనది. ఇదే తుది సమావేశము. ఈ సమావేశములోనే రాజ్యాంగ ప్రణాళిక సభామోదం పొందేది. ఎనిమిదినెలల క్రితం తయారైన ఈ రాజ్యాంగ ముసాయిదాను గురించి సభ్యులమధ్య, ప్రజలమధ్య చర్చజరిగి, ముసాయిదాకు 3000 పైన సవరణలు ప్రతిపాదింపబడినవి. ఇంకో వేయి సవరణలు రాగలవని అనుకుంటున్నారు. ముసాయిదా, సవరణల చర్చ ముగిసి, సభామోదం పొందిన రాజ్యాంగప్రణాళిక ఈసంవత్సరంలోపు వెలువడే సూచనలు గోచరించ లేదు.

ఈ ముసాయిదాఉపోద్ఘాతములో ఇండియాను సంపూర్ణరాజ్యాధికారం కలిగిన ప్రజాస్వామిక రిపబ్లిక్ అని నిర్దేశించారు.

1947 జనవరి సమావేశంలో ఆమోదింపబడిన లక్ష్య నిర్వచన తీర్మానములో ఇండియాను సంపూర్ణ రాజ్యాధికారం కలిగి సర్వ స్వతంత్రమైన రిపబ్లిక్ గా నిర్దేశించారు. ఈ నిర్దేశంలోని 'సర్వస్వతంత్రమైన' అనే దానిస్థానే 'ప్రజాస్వామిక' అనేమాటను ప్రయోగించారు. ఈ మార్పు మంచిదే. కాని ఇప్పుడు కొందరు, లక్ష్య నిర్వచన తీర్మానంలోనూ, ముసాయిదాఉపోద్ఘాతంలోనూ పేర్కొనబడిన 'రిపబ్లిక్' స్థానే 'స్టేట్' అనే పదాన్ని వాడాలంటున్నారు. చాలా కొద్దిమంది మాత్రమే ఈ సూచనను చేస్తున్నా, 'రిపబ్లిక్' అనే మాటనే ఉంచాలని ప్రజలు స్పష్టంచేసి, మెలకువగా ఉండటం అవసరం.

సంస్థానాల్లో ఇంకా రాజులు, నామమాత్రంగా ఉన్నా, మొత్తం దేశం యొక్క ప్రభుత్వ నిర్మాణం రాజకుటుంబాలకు బంధితమైయుండక, రాజ్యాధికారకులైన ప్రజల వశమని 'రిపబ్లిక్' అనే పదంవలన సుస్పష్టమవుతుంది. 'స్టేట్' అనేమాట ఇంత స్పష్టంగా ఉండజాలదు. అమెరికాను 'యునైటెడ్ స్టేట్సు' అంటారుగదా అనవచ్చు. కాని అమెరికాలో రాజాలు, మహారాజాలు లేరు. కొబట్టి ప్రజాధికారంగురించిన అపోహకు ఆస్కారం లేదు. కాని మన పరిస్థితివేరు. ఇందుమూలంగా 'రిపబ్లిక్' అనేమాటనే ఆమోదించడం యుక్తం.

ఇప్పుడు క్లాజువారీ చర్చ జరుగుతోంది.

మొదటి క్లాజు '—ఇది దేశపు పేరుకు సంబంధించినది. ఈక్లాజులో వాడిన 'ఇండియా' అనే మాట స్థానే 'భారతవర్షం', 'హిందూస్థాన్', 'భారత్' అనే మాటలను సూచించారు. ఇందు గురించిన చర్చను వాయిదా వేశారు.

రెండవ క్లాజు :—ఇప్పుడు ఇండియన్ యూనియన్ లో లేని ప్రాంతాలు మున్ముందు యూనియన్ లో చేరా లనుకుంటే, పార్లమెంటు శాసనయుక్తంగానూ, తన నిబంధనల ప్రకారంగానూ వాటిని యూనియన్ లో చేర్చవచ్చు.

ఈ క్లాజుకు సూచించిన సవరణలు వీగిపోయి సభ్యుల ఆమోదం పొందింది.

మూడవ క్లాజు :—(1) ఉన్న ప్రాంతంలో ఒకభాగాన్ని విడదీసి కొత్తప్రాంతంగా నిర్మించుట, లేక ఉన్న రెండు, లేక ఇంకెక్కువ ప్రాంతాలను, లేక ప్రాంతభాగాలను ఒకే ప్రాంతంగా చేర్చుట; (2) ఏ ప్రాంతంయొక్క ప్రదేశాన్నైనా విస్తరించుట; (3) తగ్గించుట; (4) సరిహద్దులనైనా మార్పుచేయుట; (5) ఏ ప్రాంతపు పేరునైనా మార్చుట.

—ఈ ఏర్పాట్లను పార్లమెంటు శాసన ప్రకారంగా చేయవచ్చు.

అయితే దీనికి ఒకే షరతు ఉంది. పార్లమెంటు యొక్క ఏ సభలోకూడా గవర్నమెంటుతప్ప ఇంకెవ్వరూ దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టకూడదు. ఈ బిల్లుకు సంబంధించిన ప్రాంతపు శాసనసభ సభ్యుల్లో అధికసంఖ్యాకులీ విషయమై అధ్యక్షునికి విజ్ఞప్తిచేయాలి.

ఈ క్లాజు గురించి చర్చలు జరిగి, సవరణలు సూచింపబడినవి. అంబేద్కరు ఒక సవరణ ప్రతిపాదించాడు. ఈ మార్పులు ఇప్పటిరాష్ట్రాలకు సంబంధించినవైతే అధ్యక్షుడు ముందుగా ఆ రాష్ట్రపు శాసనసభయొక్క అభిప్రాయం తెలుసుకోవాలని; ఇప్పటి సంస్థానాలకు చెందితే ఆసంస్థానంయొక్క అంగీకారం ముందు పొందాలని. మిగతా వారి సవరణలు వీగిపోయి, ఈ సవరణే ఆమోదింపబడ్డది.

రాష్ట్రాలకు, సంస్థానాలకు తారతమ్యం ఉండకూడ దని, రాష్ట్రాలకంటె సంస్థానాలకెక్కువ హోదాలు ఉండకూడ దని, రాష్ట్రాల విషయంలో ఏ విధానం అవలంబిస్తే, ఆ విధానాన్నే సంస్థానాల విషయంలోనూ అవలంబించటం యుక్తమనీ విమర్శకులు హెచ్చరించారు. సమాధానం చెప్తూ అంబేద్కరు కొందరు సంస్థానాధిపతులకు 'రాజ్యాధికారపు హక్కు' (*Sovereignity*) ఉందని,ఆ హక్కును గౌరవించాలని అన్నారు. ఇప్పుడు సంస్థానాధిపతులకు, ఇండియా ప్రభుత్వానికి మధ్య నున్న ఒడంబడికల్లో అధిపతులకు ఇంకా కొన్ని ప్రత్యేక వసతులు ఇవ్వబడినయ్. కాని వీటిని రాజ్యాధికారపుహక్కుతో సమానంగా ఎంచటం వెనక్కుపోవటమేకాక, మళ్లీ అభిప్రాయ భేదాలకు, ఘర్షణలకు అవకాశం ఇచ్చినట్టు అవుతుంది. రాజులు నామమాత్రంగా మటుకే ఉన్నారని; యావత్తు అధికారం ప్రజలదేనని మఱచిపోకూడదు.

కొబట్టి ఉపోద్ఘాతంలో 'రిపబ్లిక్' అనే మాట బదులు 'స్టేటు' అని వాడితే, అధిపతుల, వారి చెలికాండ్ర భ్రమలకు అవకాశం ఇచ్చినట్టు అవుతుంది. 'రిపబ్లిక్' అనే మాటనే ఉంచాలి.

నాల్గవక్లాజు :—2, 3 క్లాజులకు సంబంధించినది. దీన్ని సభ ఆమోదించింది.

రాజ్యాంగం ముసాయిదా మొదటిభాగం గురించి చర్చ ముగిసి, క్లాజులు ఆమోదింపబడిన తర్వాత, 2,3 భాగాల చర్చను వాయిదావేసి 4 వ భాగపు చర్చ నారంభించారు. 2,3 భాగాలు పౌరసత్త్వపు హక్కులకు, ప్రాథమిక హక్కులకు సంబంధించినవి, వాటి విషయమై పలు అభిప్రాయభేదము లుండి, చర్చలు దీర్ఘముగా జరుగునని, తత్ఫలితంగా కాలహరణ మగునని ఆ భాగముల చర్చను ప్రస్తుతం వాయిదావేసి, ప్రభుత్వపరిపాలనావిధానానికి మార్గదర్శకమైన సూత్రాలకు సంబంధించిన 4 వ భాగంగురించి చర్చ మొదలుపెట్టారు.

ఈ భాగంలోని 28, 29, 30 క్లాజులు ఆమోదింపబడినయ్.

28 వ క్లాజు :—"సందర్భం మరోకవిధంగా ఉంటే తప్ప, ఈ భాగంలో కూడా 'స్టేటు' అనే మాటకు మూడవభాగంలో వాడిన 'స్టేటు' అనే మాట అర్థమే అర్థము."

29 వ క్లాజు :—ఈ భాగంలో పేర్కొన్న ఏర్పాట్లవిషయమై కోర్టులకు హక్కు లేదు. కాని ఇందు ఉదాహరించిన సూత్రములు దేశపరిపాలనకు మూలసూత్రములుగా ఉండవలెను. శాసనములు చేయునపుడు, ఈ సూత్రములను పాటించవలసిన విధి ప్రభుత్వమున కున్నది." ఈ క్లాజు గురించి చర్చ బాగా జరిగింది. ఈ సూత్రాలను నిర్దేశించినంతమాత్రాన చాలదు. వాటిని సరిగా ఆచరణలో పెట్టవలసినదిగా ప్రభుత్వాన్ని పురమాయించేందుకై కోర్టు (సుప్రీము)కు హక్కు ఉండాలి; అంటే ఈ సూత్రాలవిషయంలో కోర్టుకు అధికారం ఇవ్వాలి అని విమర్శకులు వాదించారు. కోర్టుకధికారం ఇవ్వటం ఆచరణయోగ్యం కాదని, ఈసూత్రాలను మంత్రులు అమలు జరపలేక పోతే, వారిని కోర్టు విచారించి, దండించటం సాధ్యమా అని ప్రతి విమర్శ. మొత్తంమీద పరిపాలనావిధానాన్ని ఈసూత్రాల ప్రకారం అవలంబించవలసిందని భవిష్యత్ ప్రభుత్వములను రాజ్యాంగప్రణాళిక ఆదేశిస్తుంది. కాని అందు గురించిన పెత్తనం కోర్టు కప్పగించటం వీలుపడదు అని మరికొంద రన్నారు. సవరణలు వీగిపోయి, క్లాజు ఆమోదింపబడింది.

30 వ క్లాజు :—"జాతీయ జీవితానికి సంబంధించిన సర్వవ్యవస్థలూ సాంఘిక, ఆర్థిక రాజకీయమైన న్యాయంతో మెలిగేట్టు చేయగలిగిన సాంఘిక వ్యవస్థను నిర్మించి, కాపాడి ప్రజలశ్రేయస్సును వృద్ధిపఱచటానికై ప్రభుత్వం పాటుపడవలెను."

ఈక్లాజునుగురించికూడా చర్చ జరిగింది. సోషలిస్టుపార్టీ ప్రతినిధి 'ప్రజాస్వామిక సోషలిస్టు వ్యవస్థను స్థాపించాలని ప్రతిపాదించాడు. సంఘ యాజమాన్యానికి అనువుగా ఉన్న పరిశ్రమలను ప్రభుత్వం వశంచేసుకోవాలని సూచించాడు. ఇలాగే కాంగ్రెసు ప్రతినిధి మోహన్ లాల్ గౌతమ్ కూడా మరోక సవరణను సూచించాడు. కాని రెండు సవరణలూ ఒకే మాదిరిగా ఉన్నవని అధ్యక్షుడు గౌతమ్ను ఉపసంహరించుకోమన్నాడు. ఈ సోషలిస్టు 'సవరణ' వీగిపోయింది. ప్రభుత్వం పాటుపడవలసిందని అంటే చాలదు, సాధించితీరాలి అని ఆదేశించాలి అని మరికొంద రన్నారు. కాని ఈ సూచనలు నెగ్గలేదు.

రాజకీయ ప్రజాస్వామ్యాన్ని స్థాపించటం లక్ష్యమైనట్లే, ఆర్థికప్రజాస్వామ్యాన్ని కూడా స్థాపించడమే రాజ్యాంగప్రణాళికయొక్క సంకల్పం. కాని ఈ ఆర్థిక ప్రజాస్వామ్యాని కిప్పుడే ఒక నిర్దిష్టస్వరూపము నేర్పరచుట యుక్తము కాదని, కేంద్ర రాష్ట్రప్రభుత్వాలకు లక్ష్యంగా ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని పేర్కొంటే చాలని డా. అంబేద్కర్ జవాబు చెప్పాడు. కాని రాజకీయ పరిపాలనా స్వరూపం ఎలాఉండాలో అని రాజ్యాంగ ముసాయిదాలో నిర్వచించినట్లే ఆర్థిక సాంఘిక నిర్మాణా లెలా ఉండవలసిందీ అని కూడా నిర్వచించవలసిన ఆవశ్యకత ఉంది. ఇదివరకుశతాబ్దాల్లోరాజ్యాంగరచనాసూత్రాలు, విధానం ఇప్పుడు చాలవు. ప్రజాస్వామ్యపు రాజకీయ స్వరూపాన్ని నిర్దేశించటం ప్రభుత్వ నిర్మాణానికి, భద్రతకు ఎంత అవసరమో, ప్రజాస్వామ్యపు ఆర్థిక నిర్మాణాన్ని నిర్దేశించటం అంత అవసరం. ఈ శతాబ్దంలో, పారిశ్రామిక విప్లవ ఫలితంగా, రాజకీయ నిర్మాణం, భద్రత ఆర్థిక నిర్మాణంమీద విశేషించి ఆధారపడి ఉంటున్నయ్. ఉండకతప్పదు. ఈ ప్రధాన విషయాన్ని నిర్లక్ష్యం చేయబట్టే పలుదేశాల్లో పరిపాలన రాజకీయంగా సౌష్ఠవంగా ఉన్నా, సాంఘిక అశాంతి తీవ్రమై రాజకీయ వ్యవస్థ ఆర్థికకల్లోలానికి గురైంది. మన రాజ్యాంగ నిర్మాత లీ విషయానికి తగిన ప్రాముఖ్యత ఇవ్వటం అవసరం. 31 వ క్లాజు ఈ విషయాలకు సంబంధించింది. దీన్ని గురించిన చర్చ ముఖ్యమైనది. ఇక చర్చించబోయే క్లాజు అదే.

భారతదేశంలోజీవనప్రమాణాలు

యునైటెడ్ కింగ్డం, యునైటెడ్ స్టేట్సు ఆఫ్ అమెరికా, కెనడా దేశాల్లో మామూలు ధరలు, ఆహారపదార్థాల ధరలు ఎలా వృద్ధిచెందుతున్నవీ చూస్తే, ఆ ప్రాంతాల్లో ధరల వృద్ధి కంటె, ఇండియాలోనే ధరల వృద్ధి తీవ్రతరంగా ఉన్నట్టు బోధపడుతుంది.

ఇండియాలో జీవనానికయ్యే ఖర్చు అమెరికాలోకంటె 110% ఎక్కువగానూ, కెనడాలోకంటె 150%, యునైటెడ్ కింగ్డంలోకంటె 80% ఎక్కువగానూ ఉంది.

'ఈ సందర్భంలో ఇంకోమాట : యునైటెడ్ కింగ్డం తనకు కావలసిన ఆహారములో 100 కి 60 పాళ్లు విదేశాలనుంచి దిగుమతిచేసుకుంటుంది. ఇండియా 100 కి 6 పాళ్లుమాత్రమే దిగుమతి చేసుకుంటోంది. కాని ఇంగ్లండులోకంటె ఇండియాలోనే ఆహారపదార్థాల ధరలు హెచ్చుగా పెరిగినయ్.

1939 సంవత్సరం ఆగస్టునెలలోని ధరలను ప్రమాణంగా తీసుకొని, ఈదేశాల్లో పరిస్థితి చూద్దాం.

ఇండియా:—	మామూలు ధరలు.	ఆహారపదార్థాల ధరలు.
1939 ఆగస్టు	100	100
1947 డిసెంబరు (కంట్రోలుండగా)	314.2	321.1
1948 జులై (కంట్రోలుతీశాక)	390.1	392.1
1948 అక్టోబరు (మూడవవారం)	382.3	391.0

యునైటెడ్ కింగ్డం:—		
1938	100.	100.†
1947 డిసెంబరు	200.6	176.4
1948 మార్చి	214.2	185.5
కెనడా:—		
1947 డిసెంబరు	143.5	130.7‡
1948 జూన్	151.9	134.7

అమెరికా:—	మామూలు ధరలు.	ధాన్యాల ధరలు.	ఆహార పదార్థాల ధరలు.
1927–29	100	100	100
1939 సెప్టెంబరు	77.4	60.7	71.9
1947 డిసెంబరు	182.1	252.2	207.2
1948 ఆగస్టు	182.6	179.1	212.0

మిగతా దేశాల్లోకంటె మన దేశంలో మామూలుధరలు, ముఖ్యంగా ఆహారపదార్థాల ధరలు తీవ్రంగా హెచ్చుపెరుగుతున్నట్లు స్పష్టం. ఈ ధరల తీవ్రతను అదుపులోకి తీసుకోరానిదే మన ఆర్థికపరిస్థితి కుదుటపడదు.

పారిశ్రామిక న్యాయసభ

యజమానులకు, కార్మికులకు మధ్య వచ్చే తగాదాలను పరిష్కరించేందుకుగాను ప్రభుత్వం పారిశ్రామిక న్యాయసభల నేర్పాటుచేసింది. ఇందుమూలంగా సమ్మెల అవసరం ఉండదని, ఉత్పత్తి కుంటుపడదని ఉద్దేశ్యం. మన రాష్ట్రంలో క్రోమ్ లెదర్ కంపెనీకి కార్మికు

(21 వ పేజీ చూడుడు)

† ఆహారపదార్థాలు, పొగాకు.

‡ కూరగాయలు, ఆహారపదార్థాలు, రబ్బరు.

స్తోత్రపాఠం

శ్రీ వావిలాల సోమయాజులు

ఓ విజ్ఞాని స్తోత్రపాఠాన్ని గురించి వ్రాస్తూ 'అది పెంపుడు జంతువువంటి' దన్నాడు. నిజమే. జంతువు ఎంత క్రూరమైనదైనా పెంపకానికి లొంగిపోతుంది; పాలించేవాళ్ల మానసిక స్థితిని అనుసరించి సహజక్రౌర్యాన్ని మరిచిపోయి, అలవాటుచేసినట్లు నడుస్తుంది. అందువల్లనే మహాకవులు శ్రీనాథాదులు ఋష్యాశ్రమాలల్లో 'కండూయనము చేయు గరటి శుండాదండపుష్కరమ్మున సింహపోతకంబు' ఇత్యాదులను దర్శించారు. స్తోత్రపాఠంకూడా శ్రోతకు మొదట ఎటువంటి భయంకర క్రూరమృగంగా గోచరించినా నిత్యమూ దానితో పరిచయం కలుగుతుంటే దాని దౌష్ట్యం కనిపించకపోవటమూ దానిమీద ప్రేమాభిమానాలు వెల్లివిరియటమూ జరుగుతుంది. స్తోత్రపాఠాలు సత్యస్వరూపాలుగా నిరూపితాలౌతుంటవి. వీటిని వినటానికి అలవాటుపడ్డ శ్రవస్సులు అప్రియవాక్యాలు సుసత్యాలైనా సరే వినలేవు. అవి అసత్యాలుగా తోచటంలో విశేషంకూడా ఉండదు. 'పసుగునాడు మాట పాటియై ధర చెల్లు, ఒక్కడాడు మాట ఎక్కదెందు?'

'ఎప్పటి కెయ్యది ప్రస్తుత మప్పటి కా మాటలాడి అన్యుల మనముల్ నొప్పింపక తా నొవ్వక తప్పించుక తిరుగువాడు ధన్యుడు' అని ఒక సుమతి అన్నాడు. లోకంలో జనసామాన్యం ఈ నీతిమార్గాన్నే అనుసరిస్తుంటుంది. అందువల్లనే లోకం విశేషంగా స్తుతిపాఠానికి చెవి ఒగ్గటం జరుగుతున్నది. కానీ ఒకమాటమాత్రం సత్యం. ఈ పనికి పూనుకున్న ప్రతివ్యక్తికీ దీని తత్వం తెలుసు ననుకోటం భ్రమ. స్తోత్రపాఠం ఒక కళ. కళకు విన్యాసవైభవం ప్రధానాంశం. అదే రీతిగా స్తోత్రపాఠానికీని. కళాకారుడు ప్రతిభను వ్యక్తీకరించటానికి ప్రతివస్తువునూ స్వీకరించడు. స్తోత్రపాఠకుడూ అంతే. స్తుతింపదలచుకున్న వ్యక్తిలోపాలజోలికి పోడు. మానవస్వభావానుభావనలో అతడు అందవేసిన చేయి. ఎంతటి సహనభావ మున్నవాడైనా 'లోపాలను వినలే'డని అతడికి తెలుసు. ఎటువంటి అధముడైనా, ఏవిధాన చూచినా 'నేను నిర్భాగ్యదామోదరుడ'నని నిశ్చయించుకున్న వెర్రినాగన్న అయినా, ఎప్పుడో ఒకప్పుడు నీవు ఇంద్రుడివి, చంద్రుడివి అని అనిపించుకుందామని కోరుకుంటాడనీ, అది జీతించిన రోగంలా అతనిలో ఉంటుందనీ అతడు గుర్తించాడు. ఆ రోగాన్ని సమయం కనిపెట్టి పూజాపురస్కారాలతో ఆవాహనచేసి తగిన చికిత్సచేసి వదలిపెడతాడు ప్రజ్ఞావంతుడైన స్తుతిపాఠకుడు.

స్తోత్రపాఠకళాతత్వం తెలిసిన మహానుభావుణ్ణి ఎవరైనా ప్రశ్నిస్తే 'ఆత్మస్తుతి వినటంకంటే మానవుడికి మరొక ఆత్మతృప్తి లే'దని సిద్ధాంతీకరిస్తాడు.

స్తుతిపాఠం వల్ల కొంత ప్రయోజనం ఉండి తీరాలి. ప్రయోజన రహితమైనదానిని ప్రపంచం ఎప్పుడూ ఆదరించదు. మిగిలిన ప్రయోజనాల మాట ఎట్లా ఉన్నా లోకంలో కీర్తి వ్యాపించటం సత్యం. ఆ కీర్తి నిత్యమైనది కావాలంటే అక్షరరూపాన్ని పొందాలి. కీర్తికాములు పుత్ర సంతానాలలో వారి కీర్తికాయానికి చిరస్థాయిత్వం కల్పిస్తారు. ఈకీర్తికాయం జంగమత్వాన్ని పొందాలంటే సాహిత్యకుని సహాయం అత్యవసరం. ఈ కారణం చేతనే కీర్తికాములకు సాహిత్యకులు ఆత్మబంధువులౌతుంటారు. అందులో కవితాకన్య 'అలంకరణజ్ఞుడు' కనుక కవిని స్వయంగా వరించింది. వారికి సాహిత్యకళాకౌశలం 'వెన్నతో బెట్టిన విద్య' ఈ రహస్యాన్ని గమనించి కీర్తి పిపాసులైన పూర్వరాజన్యులు విశేషంగా 'కవిసంగ్రహం' చేశారు. దీనికి మూల తత్వం స్తోత్రపాఠాభిమానమే నని మామతం. కవులుకూడా వారి పోషకులకు కీర్తికాయాన్ని శిల్పించి యుగయుగాల ఖ్యాతిని ఆపాదించారు. 'కవి సత్యరథానికి కట్టిన అశ్వం' అన్న శ్రుతి ప్రమాణాన్ని మరిచిపోయి పోషకులకు కేవలం కీర్తికాయనిర్మాతలుగా వ్యవహరిస్తూ వారి శబ్దచమత్కారాలతో, వాగ్వైచిత్రితో లోకాన్ని మభ్యపెట్టటం గమనించి ఋషితుల్యులైన మహాకవులూ, ద్రష్టలూ ఒకానొక కాలంలో 'కావ్యాలాపాంశ్చ వర్జయేత్' అని శాసించవలసివచ్చింది. అయితే కొందరు ఉత్తమశ్రేణి కవులు చారుచరిత్రా, ధర్మచరిత్రా లేని రాజులను చేరకపోవటమే కాకుండా సామాన్యరాజన్యులమీద ఏహ్యభావాన్ని ప్రకటిస్తూ 'బండిగురిజెందపూసల పేరులతో తృప్తిపొందే కిరాతకాంతలకు స్వర్ణకారునితో పని లేనట్లు చారుచరిత్ర లేని రాజులకు కవులతో పని ఏమున్నది?' అన్నారు. కేవలం స్తోత్రపాఠం చెయ్యలేని కవులుకూడా కవి ప్రభువుల వైభవం అన్యోన్యాశ్రయ మని 'మణినా వలయం, వలయేన మణి, ర్మణినా వలయేన విభాతి కరః, కవినాచ విభు, ర్విభునాచ కవిః, కవినా విభునాచ విభాతి సభా' అన్న పెద్దల అనుభవపూర్వకాలైన మాటలను గుర్తించి రాజసభలు చేరవలసివచ్చింది. కానీ వారు 'వంది మాగధ వైతాళికాది' స్తోత్ర పాఠక గణంలో చేరటానికి అంగీకరించలేదు. కొందరు కేవలం ముష్టికవులు 'ముష్టికి నష్టి లేదని' ప్రతి వాజమ్మ దగ్గరికీ పోయి ఒక ఆశుకవిత పారేస్తుండేవాళ్లు. భార్యాద్వయంతో—ఒకభార్యకు ఒకటే కన్ను—రెండవభార్య అంధురాలు—రాజ్యసింహాసన మెక్కిన ఒక ఏకాక్షిప్రభువును చూడబోయి ఒక ఘట్టు కవి స్తోత్రపాఠంలేని శుష్కప్రయోగాలతో పని జరగ దని 'అన్నాతిం గూడ హరుడవు, అన్నాతిం గూడకున్న నసుర గురుండౌ, దన్నా తిరుమలరాయా! కన్నొక్కటి లేదుగాని కంతుడ వయ్యా!' మనస్సును రంజింపజేసి పారితోషికం పుచ్చుకొని మరీ బయటపడ్డాడు.

కొన్ని సమయాలల్లో స్తోత్రపాఠకుడు స్తుతించేవారి ఉత్కర్షను నిరూపించటానికని తన్ను అల్పుణ్ణిగా నిరూపించుకుంటాడు. చౌడప్పవంటి వాచాప్రాగల్భ్యమున్న కవి తంజావూరు రఘునాథరాయల దగ్గర 'నేరుతునని మాటాడగ వారిజభవు నంతవాని వశమా? నీవెంత' అని చెప్పుకున్నాడు. ఈరీతిగా న్యూనతా భావాన్ని వెల్లడించటానికి స్తోత్రపాఠకుడి దగ్గిర ఎంతో ప్రాగల్భ్య ముండితీరాలి. 'అంతవాడినైన నేనే నిన్ను స్తుతిస్తున్నాను, నీవెంతవాడివో చూచుకో' అన్నట్లు కొన్ని సందర్భాలల్లో స్తోత్రపాఠకులు వారి ఆధిక్యాన్ని కూడా పలుకుతుంటారు. ఇటువంటివారు స్తోత్రపాఠకజాతిలో ఉద్దండులు.

'ఉదయం బస్తనగంబు సేతువు హిమవ్యూహంబునుం జుట్టిరా విదితంబైన మహిన్ మహాంధ్ర కవితా విద్యాబల ప్రౌఢి నీ కెదు రేరీ?' అని తెనాలి రామకృష్ణుడు చెప్పుకున్నాడు. సమర్థుడు కాబట్టి సరిపోయింది. అప్పుడప్పుడూ ఇటువంటి మాటలే సామాన్య కవులూ, స్తోత్రపాఠకులూ, ఇత్యాది మహానుభావులు చెప్పటం కద్దు. ఒక సామాన్యమైన జమీందారును మహాకవి తిక్కన ధర్మరాజును వర్ణించిన పద్ధతిలో 'ఎవ్వాని గుణలత లేడు వారాసుల కడపటి కొండపై కలయ బ్రాకు' అని కొందరు పద్యాలు చెబుతుంటారు. ఇటువంటి పెద్దమనుష్యులను 'ప్రజామోసం' క్రింద 'కీర్తిశేషు'లను చేయించవలసిన అవసరం ఉన్నా అటువంటివారిమీద 'సెబాసులు' వర్షించి దుశ్శాలువలు కప్పి పంపెస్తున్నది లోకం. అంటే దానికి అసత్యస్తుతిపాఠం అంటే ఎంత ఆసక్తో మనకు అర్థమౌతుంది. ఇటువంటి సందర్భాలు ఈ కటుకు ఇరవైయ్యో శతాబ్దిలోనే జరుగుతున్నవంటే కేవలం కీర్తికాములైన పూర్వరాజన్యులూ ప్రభువులూ కొంతవరకూ అప్రశస్తాలైనా నగ్నమైన అసత్యాలుకాని స్తుతులకు మురిసిపోయి 'సర్వబాధా పరిహారువులుగా' ఏ సంక్రాంతి పుణ్యకాలంలోనో, ఏ పెద్దల పుణ్యంకోసమోనని పేరుపెట్టి దేవమాతృకలు పండే ఖండ్రికలు దానం చేశారని మనం బాధపడట మెందుకు.

స్తుతిపాఠకులు పరస్తుతి పరాయణులు కాని పరమోసకులు కారు; అయితే పరవంచకు లని చెప్పక తప్పదు వీళ్ళవల్ల వినేవాళ్లు చెడిపోతుంటారు. వారిలో ఆత్మస్తుతిపరతను పెంపొందించేవాళ్లు వీళ్లే. స్తుతి పాఠకులు చేసే స్తోత్రాలకు మనం తగినవాళ్లమనే అభిప్రాయం నిగూఢంగానో, విస్పష్టంగానో లేకపోతే వారి పొగడ్తలు వినటమనేది జరగదు. ఈ అహంభావానికీ, ఆత్మవిశ్వాసానికీ మూలకారకులు స్తుతిపాఠకులు. వ్యక్తిగతాలైన లోపాలను కప్పిపుచ్చటం స్తోత్రపాఠానికి లక్షణం; అందువల్ల స్తోత్రపాఠకులను వ్యక్తిద్రోహులనుగానూ, రాజద్రోహులనుగానూ పరిగణించవలసి ఉంది. వాళ్లకు శిక్ష చెప్పించటం నీతి.

'స్తోత్రం పాఠం చేసేవాళ్లనూ, అదివిని నిజమేనని భ్రమపడేవాళ్లనూ ఇద్దరినీ చెడగొట్టే శక్తి దానిలో ఉంది' అని ఒక తాత్వికుడన్నాడు. ఈమాటలో ఎంతో సత్యం ఉంది. కొందరిలో వస్తుతః ఆత్మస్తుతి పరాయణత్వం లేకపోయినా ఇది కల్పించి పెంపొందిస్తుంది. కించిత్తైనా ఆత్మవిశ్వాసంలేకుండా అణగారిపోయే వాళ్లకు స్తుతి కొంత ఉపకరింపవచ్చు కూడాను. అందుకనే జాన్సన్ మహాశయుడు 'పొగడ్త పొందటం ఒక విధంగా మంచిదే' నన్నాడట. స్తోత్ర పాఠకుల మాటలు విన్న వ్యక్తులు కొందరు 'నన్నుగురించి లోకం ఈవిధంగా అనుకుంటున్నది కాబోలు; నేను ఈ ప్రజ్ఞ తప్పక సంపాదించి తీరాలి' అని మనస్వులై ఆ శక్తిసంపాదనకు పూనుకోనవచ్చు. అంటే ఈవిధంగా కొందరిలో నిద్రిస్తూ ఉన్న ప్రతిభాదేవిని మేల్కొల్పటానికి కూడా స్తోత్రపాఠం సాయపడవచ్చునన్నమాట.

ఆత్మ బంధువుల మధ్య స్తుతి పాఠాలు వినిపిస్తే లోకం సహించదు. అందులో సత్యమున్నా సరే. ఇది లోక లక్షణం. ఇటువంటి స్తుతులకు మూలకారణాలూ, మూలతత్వాలూ వెతుకుతారు ప్రజ. ఒకతండ్రిని కొడుకు ఏపాండిత్యానికో, లేక ప్రజ్ఞావైభవానికో మనస్సులో సహజంగా నమ్మి స్తుతించా డనుకుందాము. దానికి తండ్రి దంతా స్వార్జితము, ఎక్కడ అన్యాక్రాంతం చేసి పోతాడోనని వాడికి భయ ముండి అదే పనిగా తండ్రిని ఎప్పుడూ పొగిడి 'గుడ్ రికార్డు' ఏర్పరుచుకుంటున్నాడనే ప్రవాదం తప్పకుండా బయలుదేరుతుంది. తండ్రే కొడుకు గుణగణాలకు సంతోషించి నలుగురితో 'మా వాడు ఈకాలపువాడు కాడండోయ్' అంటే చాలు, వెంటనే ఆతండ్రికి కొడుకులంటే మానసికంగా ఏదో భయం ఉన్నదని నిశ్చయమై పోతుంది. లేకపోతే వాడు మేనగోడలిని చేసుకోనని మొరాయిస్తే భార్యచేతుల్లో ఏ తంటాలు వస్తుందోనని భయపడుతూ ఉండి ఉండాలె నని మరో ఆధునిక మానసిక శాస్త్రవేత్త అభిప్రాయమివ్వనూ వచ్చును. మామా అల్లుళ్ల మధ్య పరస్పరోత్కర్ష వినిపిస్తే ఆయన కుమార్తె అనాకారిఅనో, 'గ్రంథసాంగురాలనో' అపప్రథ కల్పితం కావటంలో ఆశ్చర్యం లేదు. భక్తిశ్రద్ధలు కలిగి గురు భావంతో అల్లుడు మామను 'చదువుకున్నవాడని అంటే చాలు' గుర్రుపుట్టుకోవచ్చే కొందరు తప్పకుండా ఉంటారు. వీ రిద్దరినీ జూచి 'శ్వశ్రు జామాతా కాంప్లెక్సు'ను సిద్ధంచేస్తాడు మరో మానసిక వేత్త. భార్యాభర్తలమధ్య స్తుతి వినిపించే టట్లయితే 'అన్యోన్యం ప్రేమించుకున్నవాళ్లు పొగడుకో'రన్న ఏ అన్యదేశీయ జిజ్ఞాసువు అభిప్రాయాన్నో ఆధారంగా తీసికొని 'అతగాడికి భార్యంటే ఏదో జంకుగానీ, అవినీతి సంబంధమైన భయంగానీ ఉండి ఉంటుంది. లేకపోతే అధమం అతని అవినీతికి అడ్డయినా వస్తూ ఉండి ఉండాలి' అని తీర్మానిస్తారు భార్య భర్తను పొగడిందా, ఇక లోకం ఎలా చెప్పుకుంటుందో ఊహించటానికి అలివికాదు. 'సామాన్యస్త్రీ భర్తను పొగడవలసిన అగత్యం లేదు; ఇది తాత్వికుల అభిప్రాయం; అందువలన ఆమె భర్తను పొగడుతూ ఉన్నదంటే విద్యాభిమానాన్ని నటిస్తూ ఉన్నదిగానీ అది సహజం కాదని నిశ్చయమై పోతుంది.

ఏ విధంగా చూచినా ఆత్మబంధువుల మధ్య స్తోత్రపాఠం ఆరోగ్యకర మైనది కాకపోవటమే కాకుండా, అతిప్రమాదకరాలైన ఫలాల్ని తెచ్చిపెట్టుతున్నట్లు కనిపిస్తుంది. ఒక స్నేహితబృందం పరస్పరమూ సందర్భం వచ్చినప్పుడు వారి గొప్పదనాన్ని చెప్పుకోవలసివస్తే, చెప్పక తప్పనిసరి అయిన సందర్భంలోనైనా సరే వారిని చూచి 'యజ్ఞాలల్లో ఆహ్వానితులైనట్లుగా దేవతలవలె హవిర్భాగాలను ఆరగించి ఇంద్రు డగ్నినీ, అగ్ని వరుణున్నీ, వరుణుడు యముణ్ణీ, యముడు వాయువునూ వెల్లడించుకొన్నట్లు' పరస్పర స్తోత్రాలు చేసుకొనే స్తుతిపాఠకకూటంగా పరిగణిస్తారు. అయితే లోకంలో అదీ తప్పదు; ఇదీ తప్పదు. లోకం ఇటువంటి ఊహలు చేయటానికి తగిన ఆధారశిఖరాలుగా నిలిచే వ్యక్తులూ, సమాజాలూ ఉన్నవి కూడాను.

కొందరు ఆత్మబంధువులకంటే, కొందరు సామితేయులకంటే ప్రేయసీప్రియులల్లో స్తోత్రపాఠాలు విశేషంగా వినిపిస్తూ ఉంటవి. వీరికంటే వాచాలురు ప్రపంచంలో ఎవరూ ఉండరని ప్రపంచవార్త. 'తా వలచినది రంభ, తా మునిగినది గంగ' అన్న సామెత ఊరికే పుట్టిందా? అందుకనే మహాకవి ఉన్మత్తుడూ, ప్రియుడూ, కవీ ఏకకోటిలోవా రన్నాడు. అయితే ప్రియాప్రియుల మధ్యస్తోత్రపాఠాలకు 'రంగుహొరంగుల' ప్రణయంపు మేలిముసుగు ఒకటి ఉంటుంది. ఒక ప్రేమికుడు ప్రియనుగురించి 'నీవు గంధర్వలోక మధుర సుషమా సుధాగానరేఖ' వన్నా, ఆమె 'నీవు కంతుడవో, జయంతుడవో' అన్నా ఉత్తమోత్తమ కవితోక్తుల క్రింద మన్నించి లోకం వారి అనురాగాన్ని ఆర్ద్రహృదయంతో పరిగణిస్తున్నది—అది ధర్మేతరమైనా సరే. ఈ లోకలక్షణానికి వెరగుపడి తనలో నవ్వుకుంటున్నది ధార్మికలోకం.

అర్థానికీ స్తుతికీ అవినాభావసంబంధమున్నది. '. ఆతండు వదాన్యు డతండు మహాకులీను డాతండు కళావిదుం డతడు ధన్యు డతండు మనోజ్ఞమూర్తి, యెవ్వండు భవత్కృపాకలన వైభవలక్ష్మికి బాత్రమిందిరా!' అని కవి చెప్పనే చెప్పాడు. ఇక ధనికుడిమీద స్తోత్రపాఠపుష్పవృష్టి కురియటంలో ఆశ్చర్య మేముంది? ఒక చిత్రంమాత్రం గోచరిస్తున్నది. కేవలం ధనికుడు విశేషంగా స్తుతించేవాళ్లంటే విసుక్కుంటాడు; అంతేకాదు అసహ్యించుకుంటాడు; అజ్ఞానినిగా భావిస్తాడు. అతనికి స్తోత్రపాఠం మీద మనస్సులేక కాదు; 'అతి సర్వత్రవర్జయేత్' అనే శ్రుతిప్రమాణంమీద అసక్తి కాదు. ఏ కొంటెకొనంగిఅయినా స్తోత్రపాఠకుడుగా వచ్చి, సంతృప్తిపొందక తన 'బ్రతుబండారం' బయటపెడతాడేమోననే భయంవల్ల. శత్రువులున్న మరికొందరు ధనికులు ఎవరైన పెట్టుబడి పెట్టి ఆ లక్ష్మీప్రియుని 'ధనేతర జ్యేష్టాదేవి' కనికరించిన క్రమాన్ని బయటపెట్టిస్తారేమోననే భయంవల్ల కూడా విశేషస్తుతులకు అంగీకరించకపోవటమూ కనిపిస్తున్నది. అందువల్ల ధనికులదగ్గిరకు స్తోత్రపాఠానికి వెళ్ల దలచుకున్నవారు ఈ విషయంలో జాగరూకత వహించవలసి ఉంటుందని మా మనవి.

స్తుతిపాఠం చెడ్డదని ముక్తకంఠంతో మహాత్మాగాంధీవంటి మహాపురుషులు కారణజన్ములుగా పుట్టి నిరూపించ ప్రయత్నించినా ఆనాణానికి చెలామణీ తీసివెయ్యలేరు ఇది మహత్తర సత్యం. భూతవర్తమానాలల్లో దీనికి చెల్లుబాటు కనిపిస్తున్నప్పుడు వర్తమానంలో రూపాంతరం పొందితే పొందవచ్చునుగాని నశిస్తుం దనుకోటం పొరబాటు. అయితే లోకంలో కొంతమందికి స్తోత్రపాఠమంటే సవేమిరా గిట్టదని వింటుంటాము. సూక్ష్మంగా ఆలోచిస్తే అది సర్వాబద్ధమని అవగతమౌతుంది. అటువంటివారిని ఏవిధంగా

(20 వ పేజీ చూడుడు)

కథానిక:

సత్యాగ్రహం

శ్రీ పంతుల శ్రీరామశాస్త్రి

కావాలన్న నాడు స్నేహితులు దొరకడం ఎంత కష్టమో, అక్కరలేని నాడు వాళ్లను ఒదిలించుకోవడమూ అంతకష్టమే. మధ్యాహ్నం ఆఫీసులో ఉండగా తన ఆప్తమిత్రుడు రామ్మూర్తి దగ్గరనుండి వచ్చిన ఉత్తరం చదివినప్పటినుండీ, కామేశ్వరరావుమనసు మనసులో లేదు. ఎలాగయితేనేం రెండుగోంటలక్రితమే నిశ్చయమయిన సినిమాప్రోగ్రాముకు కడుపునొప్పి మిషతో తప్పించుకొని, రాత్రిఎనిమిదిగంటలకి తనగదిలో లోపలగడియ వేసుకొని, ఇకను తెల్లవారేవరకూ ఏవిధంగా ఆలోచించినా బాధ లేదని ధైర్యం చెప్పుకొని, మధ్యాహ్నంనుండి జేబులోంచి లోపలికి గుచ్చుకుంటూ ఉన్న ఉత్తరాన్ని తీసి మరోకమారు చదువుకున్నాడు కామేశ్వరరావు.

కామేశ్వరరావు కేవలం గుమాస్తా మాత్రుడే కాదు. బి. యే. పాసయేడుకూడాను. పాసయిన మర్నాడే స్వశక్తిని ఆధారం చేసుకొని, గవర్నమెంటులో కలక్టరేటులో ఉద్యోగం సంపాదించ గలిగాడు. పైగా మామూలు లైపిస్టుపాటి చాకచక్యం సంపాదించి అంతతో తృప్తిపడక ఇటీవల షార్టుహేండుకూడా కృషి చేస్తున్నాడు. ఈసరికి పరీక్షకి పనికివచ్చేపాటు స్థితికి వచ్చి ఉండునుగాని, తనకి కొంచెం ఆఫీసులో పని ఎక్కువగా ఉండడమూ, కొన్నికొన్ని ముఖ్యమయిన ఉత్తరాలు వ్రాస్తూ ఉండడంవలన అట్టే తీరికలేక పోవడమూ—వీటి వల్లగాని, లేకపోతేనా......

అయితే తాను వ్రాస్తున్న ఉత్తరాలు వందలకి వందలూ ఉండకపోవచ్చును. కాని, అవి తనకు తీరుబాటు అనేదిలేకుండా చేస్తున్నాయనడంలో ఎటువంటి అతిశయోక్తీ లేదు. వారానికి ఒకటో, పదిరోజులకి ఒకటో, ఒక్కొక్కప్పుడు పదిహేనురోజులకి ఒకటిచొప్పున తాను ఉత్తరాలు వ్రాస్తున్నాడు—అదీ ఈ ఆరు నెలలే అయింది. అన్నికలిపి ఒకడజను కంటె ఎక్కువ వుండేవు. అయితే వాటిని, సంఖ్యనిబట్టి బరువుని బట్టీ లెక్కిస్తే ఎలాగ? వాటిలో ఒక్కొక్క దాని గురించి తాను ఎంతగా ఆలోచించాడు కాదు. ఒక్కొక్కప్పుడు ఒకే ఉత్తరాన్ని ఎన్నోమార్లు సాపుత్రవ్రాసేవాడుకదా! పైగా వాటిలో తన ఇంటరుమీడియట్ బియే చదివే రోజుల *Modern Poetry* లోవీ, షేక్సిపియరు నాటకంలోవీ ఎన్నెన్ని ఉదాహరణలు నింపేవాడు కాదు. ఇక ఉత్తరం రాసిన దగ్గరనుండి దానికి జవాబు వచ్చేదాకా తోచకపోవడంలో ఏమీ విశేషం లేదు కదా.

అయితే సుమారు నెలరోజులనుండి తాను ఉత్తరాలు రాయడమేగాని, అటునించి ప్రత్యుత్తరాలు లేకపోవడంతో, మరీ ఉండబట్టక ఆప్తమిత్రుడు రామ్మూర్తికి రాసేడు. ఏ భోగట్టా కనుక్కొని వెంటనే రాయమని. తన ఉత్తరం అందిన మర్నాడే రామ్మూర్తి రాసేడు. దాంతో మరేమిటి, కుండెడుపాలలో మజ్జిగబొట్టు పడ్డట్టయింది--ఊహు, అతనికి తృప్తిగలుగలేదు, విరిగిపోయిన పెరుగు కొంత అనుభవయోగ్యంగా ఉంటుంది. తన పరిస్థితి, సీసాడు తేనెలో చెమ్చాడు విషం కలిపి నట్లయిందనుకొని, ఆత్మాగ్రహంతో దబ్‌దబ్‌మని చప్పుడు చేస్తూ గదిలో అటూ ఇటూ పచారుచేయసాగాడు. అతని కాళ్లు చప్పుడు చేస్తున్న సంగతిని అతని మనస్సు ఏవిధానకనిపెట్టిందో ఊహించడం కష్టమే. ఏమయినా అంతవేగంలో గుర్తించడం అన్నది మంచిపనే అయింది. లేకుంటే అతని మనసుకి మాత్రం తెలీదా ఏమిటి, ఇంటి ముసలమ్మ, 'ఏమిటి నాయనా కిందవాళ్ల నిద్రమాట దేవుడెఱుగును, ఇవాళీ మేడ కూలదోసెయ్యాలని ఉందా ఏమిటి? అంటూ ఎత్తుకొని, అంతకు పది సంవత్సరాలక్రితంనుండి ఆ గదిలో ఉన్నవాళ్ల చరిత్ర అంతా ఏకరువుపెట్టడమూ—మధ్యను దగ్గువచ్చి ఆగిపోవాలి తప్ప ఆవిడధోరణి ఆపడంగాని, మరల్చడంగాని బ్రహ్మతరమా! ఇవాళ ఇంకా అదృష్టం బాగుంది. లేకుంటే ఈ దరిద్రానికి తోడు మరోక గోలకూడా వచ్చిపడును—అనుకొంటూ మెమ్మదిగా కిటికీదగ్గరకి వెళ్లి నిలబడ్డాడు కామేశ్వరరావు.

ఆకాశంమీద పెద్దపెద్ద మేఘాలు లేవు, అక్కడక్కడ ఒకటీ రెండూ చుక్కలుకూడా కనిపిస్తున్నాయి. కాని నడి ఆకాశపు చినుకులు, వాటికి లెక్కేమిటి, అలా పడుతూనే ఉంటాయి. తన కిదంతా ఎందుకు, తన ఆలోచన ముఖ్యం అనుకొని కామేశ్వరరావు బాగా ఒక క్రమాన్ననుసరించి ఆలోచించాలనుకొంటూ ఉండగా జలజల మని పెద్దజల్లు వచ్చింది. ఇలా వేగవ చప్పుడుతో జల్లు పడుతూ ఉంటే, తన ఆలోచన ఏమి సాగుతుందని, కిటికీ తలుపులు చేరవేసి, వెళ్లి కుర్చీలో కూర్చొని తన సత్యాగ్రహము సబబయినదా కాదా అన్న మీమాంసలో పడ్డాడు కామేశ్వరరావు.

రామ్మూర్తి ఉత్తరంలో అనుమానానికి ఏమీ సావకాశం లేదు. "వాళ్లు వేరె ప్రయత్నంలో ఉన్నట్టున్నారు. పెళ్లియత్నాలేమో జరుగుతూనేఉన్నాయి. కాని నీకు తెలియకపోవడాన్ని బట్టి చూస్తే నేను విన్నమాటలు నిజమే అనుకోవలసివస్తున్నది. మా ఆవిడతో సంభాషణలోకూడా, ఎవరో యమ్. ఏ. చదువుతున్న కుఱ్ఱవాణ్ణిగురించి చాలా ప్రశంస జరగడమూ, చివరికి ఆకుఱ్ఱవాడికే తమ కాంతాన్ని ఇచ్చే అభిప్రాయంతో ఉన్నట్లుగా చెప్పడమూ జరిగింది. ఇట్టి పరిస్థితిలో నేను స్వయంగా వెంకట్రామయ్యగారితో మాట్లాడడంవల్ల, ఎక్కువ ప్రయోజనం ఉంటుం దనిపించదు—కాక నీవు అంతగా కావాలంటే ఆయనతో ముఖసంగా మాట్లాడుతాను—కాని, ఫలితం ఉండదు. ఈవిషయంలో నువ్వు ఆశ పెట్టుకోకపోవడమే మంచిదనిపిస్తున్నది. మరి ఒకటి రెండు మంచి సంబంధాలు వచ్చే టట్లున్నాయి. అందుచేత నువ్వేమీ కించపడనక్కరలేదు—నేను మళ్లీ నీకు రాస్తాను—" ఈ ధోరణిలో ఉంది రామ్మూర్తిలేఖ. తానేమిటో మహా ఆతృతపడిపోతున్నట్లుగా రామ్మూర్తికూడా అనుకొంటున్నాడు—నిజానికి వాళ్లే అతృతపడవలసింది. తాను మంచివాడుగనుక ఇన్నాళ్లు ఆగి ఉన్నాడు—లేకపోతే ఈసరికి ఇంకొక సంబంధం నిశ్చయం చేసుకొని ఉండడూ? ఈమధ్యను ఎంతమంది పిల్లలతండ్రులు తన దగ్గరకు వచ్చేరు కారు.

రాకేం, వస్తారు, తన కేం తక్కువ—బి. యే. పాసయేడు సగౌరవంగా ఉద్యోగం చేసుకొంటున్నాడు. అంతే కాదు, రేపొద్దున్న ఏ గెజెటెడ్ ఆఫీసరో అవడంకూడా అంత ఊహించడానికి వీల్లేని విషయం కాదు పైగా తన కేం. రూపానికి లోటా? మర్యాదకు లోటా? ప్రవర్తనలో హెచ్చు తగ్గులున్నాయా? ఇటువంటి తాను డెబ్భయిరూపాయిల స్కూలుమాష్టరి జీతంతో (అంటె పైని దమ్మిడీకూడా రాని రాబడితో) పెద్ద కుటుంబభారాన్ని ఈదుకొని వస్తున్న వెంకట్రామయ్యగారి అమ్మాయిని చేసుకొందు ఇష్టపడడంలో తన ఔదార్యం కొంత లేకపోలేదు—కావాలంటే తనకు ఆ మాత్రం ఈమాత్రం ఒక వెయ్యిరూపాయిల కట్నంకూడా లభించగలదు. అటువంటివన్నీ ఒదులుకొని తాను కాంతాన్ని పెళ్ళిచేసుకోబోవడము విశేషం కాదూ? తానయితే స్నేహితులవద్ద కట్నం పుచ్చుకోనని భీష్మించినమాట వాస్తవమే, కాని, నిజంగా తనకి. అటువంటి ఉద్దేశమే ఉంటే ఈ మాట ఏమాత్రం అడ్డుతుంది; అంతగా కావాలంటే, రూపాయిల రూపంగానే ఎందుకు, వేరే విధంగా రాబట్టవచ్చును. నిజానికి తనలో సంస్కారవాంఛన, ఔదార్యమూ లేకపోలేదు. ఎవడో శాస్త్రిలాటి అపనమ్మకస్థుడు వాళ్లమ్మాయిని చూసిన దగ్గరనుండీ, వీడికి ఎలాగయినా పెళ్లయితే చాలు ననిపించిందిరా, అందుకే అన్నిటికీ ఒప్పుకొన్నాడుగాని, లేకపోతే వీ డేమిటి, కట్నం ఒదులుకోవడం ఏమిటి' అనవచ్చును. అంతమాత్రంలో తనకు మునిగిపోయిం దేమిటి? తన అంతరాత్మ తనకి తెలుసును, అది నిబ్బరపడగలదు. అయితే సామాన్యంగా ఉన్న చిక్కేమిటంటే, ఈ బాహ్యేత్మ తాత్కాలిక దృష్టితో ఎలా ప్రబోధిస్తే అందుకు అనువుగానే అంతరాత్మకూడా తాళంవేస్తుంది. పాపం కామేశ్వరరావుకూడా జనసామాన్యంలో ఒకడే కదా!

కాంతం (వెంకట్రామయ్యగారి అమ్మాయి) చక్కటిదే, మంచిదే, తెలివయినదే. ఆమెను పెళ్లిచేసుకోవడంలో ఎటువంటి తెలివితక్కువా లేదు. శాస్త్రి చెప్పినట్లు ఏ ఇతర పరిస్థితులనూ వ్యవహారాలనూ కూడా ఆలోచించకుండా కేవలం ఆ అమ్మాయి సాహచర్యంకోసమే ఎంత త్యాగం చేసినా చేయవచ్చును. ఇంతకీ పెళ్లి చేసుకోవడంలో సంపాదనేగాని, త్యాగం ఏమీ లేదుకదా! అంతా బాగానే జరిగిఉండును.

కాని ఇటీవల సరోజినిని తెలిసిన దగ్గరనుండీ అతని మనస్సు డోలాయమానంగా ఉంది. ఎన్నోమార్లు 'కొన్ని కారణాలవలన నా మనస్సు మార్చుకోనవలసి వచ్చినది; మీ సంబంధము చేసుకోలేనని వ్రాయడమునకు విచారిస్తున్నాను' అని వెంకట్రామయ్యగారికి ఉత్తరం రాయాలని కూడా అనిపించింది సరోజినికి లెక్కలు చెప్తున్నప్పుడు, ఊరికినే చెల్లెలుకి లెక్కలు చెప్తున్నాడనే కాదు, వాళ్లక్కయ్యకికూడా తనమీద మంచి అభిప్రాయమే ఉంది. ఆవిడ సాభిప్రాయంగా రెండుమూడుమార్లు తన పెళ్లి సంబంధంగురించి కాబోయే అత్తవారి స్థితిగతులనుగూర్చి అడిగిందికూడాను. నిజానికి తానే తెలివితక్కువవాడు, అటువంటి సావకాశాలను వదులుకొన్నాడు. అయితే ఇప్పుడు మాత్రం మించిపోయిం దేమిటి, సరోజినికి పెళ్లిసంబంధం ఏదీ నిశ్చయం కాలేదు.

ఇటువంటి సావకాశాలు ఉండికూడా తాను తనమాటకి కట్టుబడిఉండగా వెంకట్రామయ్యగారు చాపకింది నీరులాగ వేరె ప్రయత్నాలు చెయ్యడం ఎంత దురన్యాయం? ముందుగానే ముహూర్తం ఎప్పుడు నిశ్చయించిందీ తెలియజెయ్యకపోతే తాను తరవాత శెలవుకి చికాకు పడవలసి వస్తుందని తాను రాసిన ఉత్తరానికి జవాబు లేకపోవడంతో ఏమిటో, ఏమిటో అనుకొన్నాడుగాని, ఇంతలాటిమోసం జరుగుతుం దని ఊహించనయినా లేదే. కానీ ఇందుమూలంగా నష్టపడిం దెవళ్ళు? వాళ్లకే ముందుముందు తెలిసివస్తుంది. కాంతం ఎంత మంచిది, చక్కటి దీ. అయినా సరోజనితో సాటా? ఆ తెలివితేటలు, ఆచలాకీతనమూ! అబ్బోఅ వెక్కడ! వాళ్లక్కయ్య లేడీడాక్టరుగా ఉంది. ఈమె కూడా ఏమీ తక్కువది కాదు. ఎలాగో ఇంటర్మీడియేటు పరీక్షపోయింది కాని. అంతా బాగానే ఉంది. ఇది తనకు అనుకోకుండా వచ్చిన అదృష్టవశమే అని ఆగ్రహావేశంలో కామేశ్వరరావు తృప్తి పడడానికి ప్రయత్నించాడు.

సరే, ఇక తన ప్రయత్నాలలో తానుంటాడు; కాని, ఇప్పుడు ఏమిటి చెయ్యడం? తనఆగ్రహాన్ని ఏ విధంగా వెలార్చడం?—ఏముంది—మాంచి ఘాటుగా ఉత్తరంరాయాలి. అంతే. అయితే అలాగని వెఱ్ఱికోపం ఎత్తినట్టుగా రాయకూడదు. మంచి గమ్మత్తయిన మాటలతో వెటకారంగా రాయాలి. ఇప్పుడు తెలియదు వాళ్లకి తనని పోగొట్టుకోవడంలోని నష్టం. ముందు ముందు తెలిసివస్తుంది. అనుకుంటూ ఉత్తరం రాయడానికి ఉపక్రమించేడు. కాని, అప్పట్లో ఎన్నిమార్లు రాసినా తృప్తికరంగా తోచలేదు. రేపు ఆఫీసులోసుపని చాలా తక్కువగా ఉంది కదా? అక్కడే రాసి వెంటనే పోస్టుచేయించవచ్చును. ఇప్పుడు రాసినా రేపటి పోస్టులోనే కదా వెళ్తుంది. అని సమాధానపడి అప్పటిమట్టుకు పడుకొన్నాడు.

అన్నిరకాల ఉద్రేకాలలోకీ అతి త్వరలో వచ్చేదీ, అంతకంటే త్వరగా చల్లారిపోయేదీ ఆగ్రహమే. పాపం కామేశ్వరరావుకి నిన్నరాత్రి ఉన్న ఆగ్రహమూ, నిబ్బరమూ, ఇది తన మేలుకే వచ్చిందన్న సంతోషావేశమూ ఇవాళ ఆఫీసులో లేవు. నిన్నరాత్రి ఆగ్రహావేశంలో కనిపించినంతగా అందుబాటులో సరోజిని కనిపించలేదు. మొత్తంమీద తనకి ఏదో నష్టం కలిగినట్టే ఉంది. వెంటనే ఉత్తరం రాయాలని పించలేదు. అంత ముఖ్యమయినవి కాకపోయినా, ఏవేవో ఆఫీసు కాగితాలు తీసి కొంతసేపు రాశాడు. కొంతసేపు కాస్త తనని తాను మరచిపోవాలని, తక్కిన గుమాస్తాలతో బాతాఖానీ కొట్టేడు. కాని, ఏదో విధగా తోచి, రెండు గంటలవేళప్పుడు ఉత్తరం రాయడం ఆరంభించేడు. మొదట తీసిన ఎఱ్ఱరంగు కాగితం నచ్చలేదు. శుభ్రమయిన తెల్లకాగితం తీసి, కుదురుగా అక్షరాలు చెక్కుతూ మొదలు పెట్టాడు. కఠినంగా వెటకారంగా (తనకీ మనస్సులో బాధగా ఉంటేనేం) రాస్తున్నప్పుడు దస్తూరీఅయినా కాస్త కుదురుగా ఉండకపోతే ఎలాగ? ఇంకా నాలుగుపంక్తులయినా రాసేడో లేదో, ఆఫీసు బంట్రోతు ఉత్తరాలు తెచ్చి ఇచ్చేడు. 'అన్నీ ఆఫీసుఉత్తరాలేనా?' అంటూ ఉండగానే తన స్వంతఉత్తరం కనబంది. వెంకట్రామయ్యగారి దస్తూరీయే, సందేహం లేదు.

తన ఆగ్రహం కేవలం నిరర్థకమేమో, రామ్మూర్తి పొరపాటు పడ్డాడేమో, అంత నిశ్చయంగా రాశేడుమరి, ఏమో అతని భార్య సరిగా తెలుకోలేక పోయి ఉండవచ్చును. ఇంతకీ నిన్న రామ్మూర్తి ఉత్తరం అందగానే గాని, రాత్రిగాని, ఇవాళ ఉదయం ఆఫీసులో గానీ, తాను ఉత్తరం రాసి పోస్టుచేయకపోవడం మంచిదే అయింది. అంతా ఇక్కడివరకూ బాగానే ఉంది. బహుశః ముహూర్తం గురించీ, తను సెలవుపెట్టడంగురించీ రాసిఉంటారు. ఎవళ్లో కిట్టనివాళ్లు పుట్టించిన మాటలను బట్టి రామ్మూర్తి వ్రాసి ఉండవచ్చును......ఇలాగ కవరు చించి ఉత్తరం బైటికి తీసి చదివే కొద్దిసేపటిలోనూ అతని మనస్సు అనేకవిధాల మెరిసింది.


కాని, కవరుకదా. అని అందులో అట్టే సంగతులు లేవు. పదే పంక్తులున్నాయి. చదువుతుండగా అతనికి ఒళ్లు మొచ్చెమటలూ పోసింది. నిన్నరాత్రి ఆగ్రహం ఇనుమడించిన ఉద్ధృతితో విజృంభించింది. తాను రాయదలచిన ఉత్తరం ఎందుకు రాసి పోస్టు చెయ్యలేదా అని విరమాలు కొనసాగేడు,

హుం—పెద్దబాబు పిలుస్తున్నాడుట. వాడిమొగం వాడికేం పోయింది; ఎప్పుడూ పిలుస్తూనే ఉంటాడు. కింది గుమాస్తాలంటే రక్తంమాంసం లేనిబైబొమ్మిపన్నకంటె కనాకష్టమనికాబోలు అతగాడి ఉద్దేశం—పైపు మిషనయినా ఒకమారు ఒకే కాగితం పైపు చెయ్యవచ్చును. (కావాలంటే కాపీలుమాత్రమే వస్తాయి) గాని, గుమాస్తా అంటేమాత్రం అలాక్కాదు. ఒకమారే అన్ని కాయితాలూ ఆన్సరు చేయగలిగి ఉండాలి. అవతల ఆఫీసరు కాస్త ఆర్భాటం చేసే సరికల్లా ఇవతల చిన్నగుమాస్తాల మీద విరుచుకు పడడమే.

అదృష్టవశాత్తూ కొత్తగా ఏదీ బండపని తగిలించలేదు. పాతకాగితంగురించే అడిగాడు. అదీ సరీగా సమయానికి జ్ఞాపకం ఉండడమూ విశేషమే. అమ్మయ్య, మళ్లీ తన సీటులో కూర్చున్నాడు.


(21 వ పేజీ చూడుడు)

వార్తా చిత్రాలు



ఢిల్లీలోని కాశ్మీర్ సమాజంవారు గత ఆదివారంనాడు ప్రధానామాత్యుడు నెహ్రూ 60వ జన్మదినోత్సవం జరిపిరి. కాశ్మీర్ మిఠాయి, పండ్లు సభికులకు పంచిపెట్టిరి. సర్దార్ పటేల్, గోపాలస్వామి అయ్యంగార్, కాశ్మీర్ సమాజ ప్రధాన కార్యదర్శి అలీమహ్మద్ తరీక్ గారలు పాల్గొనిరి. ఛలోక్తులు విసురుతూ హాజరైనవారిని ప్రధానామాత్యుడు నెహ్రూ నవ్వించుచున్నాడు.






నవంబరు 1 వ తేదీన భారతసైనికులు దుండగులపై దాడి ప్రారంభించినపుడు జోజిలాలో మంచు విపరీతముగా పడుతూ ఉండెను. చెన్నరాష్ట్ర సాపర్సు శత్రుఘరంగుల కాల్పులను సైతం లక్ష్యం చేయక మంచుకొండలను నిర్మూలించి సైనిక వాహనముల రాకపోకలకు వీలుగా రహదార్లను వేశారు.



కాశ్మీర్ రంగంలో భారతీయవైద్యులు సైనికులకేగాక పౌరులకూ చి
ఉంటుంది. గురెజ్ కు ఉత్తరమున ఒక గ్రామంలో బాలికకు చికిత్స




గత యుద్ధంలో యూరప్ గడ్డపై మిత్రరాజ్య సైన్యాలు విమానాలద్వారా సైనికులను ఆర్న్‌హీమ్‌లో దించినవి. ఆనాడు మృతినొందిన వీరుల నాల్గవ వార్షికోత్సవము ఆర్న్‌హీమ్‌లో జరిపారు. ఒక డచ్చి బాలుడు "వీర శిలలపై" పుష్పమాలిక లుంచుతూన్న దృశ్యం.



లజపతిరాయ్ వర్ధంతి ఉత్సవం: న్యూఢిల్లీలో జరిగినసభకు అధ్యక్షత
సర్దార్ వల్లభాయ్‌పటేలు




రునానక్ జన్మదినసందర్భంలో ఢిల్లీలో మంగళవారంనాడు
పండిట్ నెహ్రూకు సిక్కుల సైనిక మర్యాద.




భారతప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 60 వ జన్మదినోత్సవమునాడు (నవంబరు 14) 400 మంది బాలబాలికలు,
అనేకమంది ఢిల్లీ పౌరులు వచ్చి వారిని అభినందించిరి.

పురాణయుగజంతువుల అస్థిపంజర
స్వరూపాలను లండన్ మ్యూజి
యమ్‌లో పురావస్తుకుల చారిత్రక
ఆధారంతో నిర్మించి
ప్రదర్శిస్తున్నారు. →







...త్స చేయవలసి వస్తూ
చేస్తున్న దృశ్యం.



బళ్లారిజిల్లా కలెక్టరు కె. ఎన్. అనంతరామన్ (ఐ. సి. యస్.)గారి సతి శ్రీమతి పార్వతి
అనంతరామన్‌గారు రాయదుర్గలో ప్రసూతిభవనమునకు ఇటీవల శంకుస్థాపన జరిపినారు.



హించిన నూతన రాష్ట్రపతి డా॥ పట్టాభిగారు, సభలో ఉపన్యసించిన
పట్టాపట్టాలు' వేసుకొని నిల్చున్నారు.



ఇండియా-వెస్టుఇండీస్ క్రికెట్ టెస్టు పందెంలో, వెస్టుఇండీస్ ఆటగాళ్లు
రంగంలోకి ప్రవేశిస్తున్న దృశ్యం.



మైనం రాజు

ఆధారం: శ్రీమతి శోవనాదేవి వ్రాసిన 'The Wax-Prince'

శ్రీ ఓగేటి శివరామకృష్ణ

కొన్నిరోజుల క్రితం ఒక రాజ్యాన్ని ఒక రాజు పరిపాలిస్తూ యుండేవాడు. తరువాత తన రాజ్యానికి వచ్చే సంతతి పిల్ల లెవ్వరూ లేకపోటంవల్ల రాజున కది విచారం కల్గించింది.

'నా అంత దయ కలిగి, నా అల్లా రాజ్యమేలి, నా పేరూ, నా ప్రతిష్ఠా నిలిపేవా రెవరవుతారు? మా పూర్వుల కీర్తి ఎవరు నిలుపుతారు? మా పితృలకు నాకు తర్పణములు యెవరు వదలుతారు?'—ఈ విధమైన మాటలు బాధలో అనుకొన్నాడు రాజు. అందుకు బాధకూడా పడసాగాడు. ఆ విధమైన చింతనతో రాజు నాటి నుండి కృశించి, నీరసస్థితి పొందసాగాడు.

ఒక దినం రాజు రోజూకన్న హీన స్థితిలో కన్పించసాగాడు. అది రాణీ గమనించి మొదటిమారుగా భర్తను ఈ విధంగా ఉండుటకు కారణ మడిగింది:

'రాజా......మీ రీ విధంగా మానసికంగా బాధపడటం రోజూ చూస్తూనే యున్నా. అది...రాజ్యవిషయములవల్ల ననుకొన్నా. అది యీమారు పొరపాటయి ఉంటుంది. ఈ రోజున మీరు మానసికంగా బాగా కృశించి బాధపడుతున్నారు. అసలు విషయం యేమయిఉంటుంది? మీ రలా విచారపడుతున్నందుకు గల కారణ మేమిటో నాకు తెల్పండి. మీరు పడుతున్న బాధకు తగిన చికిత్సచేసే సాధనం నావద్ద ఉండిఉంటే ఉండిఉండవచ్చు... చిట్టచివరకు...సుఖము వచ్చినా, దుఃఖము వచ్చినా మన మిరువురం సమానంగా పంచుకొనాలి" అని.

నిట్టూర్పు విడుస్తూ రాజిలా గన్నాడు: "రాణీ, నే చాలా విచారంగాను, మానసికమైన బాధతోనూ బాధపడుతున్నా. నిన్ను గూడా కారణంచెప్పి బాధపరచటం యెందుకూ?"

రాణి తిరిగి కారణం చెప్పవలసిందని రాజును బాధించింది. రాజు కారణం చెప్పడం తప్పనిసరి యైంది. రాజు యీవిధంగా రాణీతో చెప్పాడు:

"ఓ రాణీ...నే ముసలివాడి నయిపోతున్నా. నన్ను బాధపరుచుతున్నది, నా తరువాత నా రాజ్యాన్ని, నా సింహాసనాన్ని ఎక్కేవారుసు డెవరా అనే ఆలోచన? ముందు...నా సింహాసనం యెక్కే దెవరు? నా పూర్వీకుల గ తేమిటి? మనకు తర్పణాలు వదలేవారు లేక మనం, నరకలోకంలోనికి పాతుకొనిపోవలసివస్తుంది."

రాణీ, రాజుబాధనంతా అర్థము చేసుకొంది. దానికంతకూ, యింతవరకూ వారసత్వమును పొందే కుఱ్ఱవానిని కనని తనది తప్పని ఆమె చింతించింది. అతడు యింకో రాజకుమార్తెను వివాహం చేసుకొన్నయెడల...సవితికీ, తనకూ వచ్చు దెబ్బలాటలు తప్ప వేరేమీ ఉండదు. ఈ విధంగా ఆమె ఆలోచించుకొన్నది. అందుకనే సవతిని తాను పొందుటకు భయపడిన దామె.

ఒకవేళ, చేసుకొనబోయే రాణీగారికి కుమారుడు జన్మించినయెడల, అతని తల్లే రాజభవనమంతటా మార్మోగుతుంది. తన పేరు...తన సంగతీ యెవరికీ అవసర ముండదు.

అందువల్ల ఆమె తన దాసీని పిలచి...దానితో మంతనము చేసింది... మంతనము ఫలించటంవల్ల, రాజుతో నవ్వుతూ రాణీ యీలా జవాబిచ్చింది: "అదే నా...మిమ్మల్ని పీడించుతున్న బాధ...ఓ రాజా!... మీ బుఱ్ఱను వృదా ఆలోచనలతో 'పాడుచేసుకోకండి. నే నతిత్వరలో మీ కొక వారసుణ్ణి అందిస్తా."

ఆ మాటలు విన్న రాజు అప్పుడే ఫలితమును పొందినట్లుగా ఆనందింపసాగాడు. ఆనందంతో ముందుకూ, వెనుకకూ నడుచుతూ 'మంచి రాణివి... ఇంతకాలంవరకూ యీ వార్త యెందుకు దాచి ఉంచావ్?' అన్నాడు.

రాణి రాజువైపు ముఖంపెట్టి యీ విధంగా జవాబిచ్చింది: "ఓ రాజా... నే దాన్ని చెప్పలేదని నన్ను అనవసరంగా నిష్ఠూర మాడవద్దు. యీవార్త మీకు తెలియపరుస్తే, మీరు అసౌఖ్యపడతా రని నే నొక కల కన్నా."

'ఏమిటి...నన్ను అసౌఖ్యవంతుణ్ణి చేస్తుందా? రాణీ, నాతో వేళాకోళము లాడుతున్నావ్...'

'మీతోనా......వేళాకోళము లాడటం? కలలో యెవరో కన్పడి, చక్కటి యువరాజును కంటానని, కాని తమరు చూస్తే బిడ్డ మరణిస్తాడనీ చెప్పాడు'—రాణీ చెప్పింది.

అయినప్పటికీ రాజు ఆనందపడ్డాడు. తన వారసుడు లేచి, తన వంశగౌరవం నిలుపుతాడనే యుద్దేశంతో. ఈ సంగతి, తన రాజ్యస్థానములోనికి వెళ్ళి అందరితోనూ చెప్పాడు.

దేశమంతటా ఆనందంతో ఉత్సవాలు చేస్తున్నారు. తన స్నేహితురాలితో యిదివరకే రాణీ ఆలోచన పన్ని సిద్ధంగా ఉంది. ఆమె రాజునకీ విధంగా పిలిచి చెప్పింది: 'ఓ రాజా! నీకు కొంతకాలంలో వారసుడు పుడతాడు. నువ్వు ఒకవేళ శిశువువైపు చూచినట్లయితే మొదటికే మోసం వస్తుంది. అందువల్ల, నే వంటరిగా ఉండుటకు, యీ రాజభవనమునకు దూరముగా, ఒక గృహాన్ని కట్టించు. నువ్వు వెంటనే నే నిక్కడనుంచి కదలి నూతనభవనంలో అడుగు పెట్టడానికి ప్రయత్నాలు చెయ్యాలి.'

దానిమీద, రాజు వీలుగా రాణికి భవనం కట్టించిపెట్టాడు.

రోజులు గడిచినాక ఒక దినం, రాణీ యువరాజు పుట్టినాడని వర్తమానం పంపించింది.

శిశువును చూద్దామనేయుద్దేశం లేకపోవటంవల్ల, రాణికి బహుమానంగా బంగారునాణాలు పంపించాడు.

రాజు పంపించిన ఆ బంగారునాణెమునను రాణి పూర్తిగా ఉపయోగపరచింది. అందులో కొంత భాగం రాణీగారివల్ల దాసీది సంపాదించుకొంది. ఆ దాసీది కొంతకాలం క్రితం ఒక శిశువును, కనింది. ఆకారణంచే తన శిశువును రాణీగారి భవంతికి తీసుకొనిరా మొదలిడింది.

రాజు, రాణిని కలుసుకొన్న సమయంలో, ఆ దాసీ, పిల్లవాని చెవులు నులుపుచూ, ఏడిచేటట్లు చూచేది. తరువాత ఆమె జోలపాటలు పాడుతూ ఊరుకొనపెట్ట ప్రయత్నించుచున్నట్లుగా నాటకమాడేది. ఆ ఏడ్చుచున్నది తన కుమారుడే అని ఆ తెలివితక్కువ రాజనుకొనుచుండుటవలన, అసలు సంగతి యెవరివల్లా బయటపడలేదు.

అయిదో వత్సరం వచ్చినతరువాత రాజు ఒక గురువును, అవబోయే రాజునకు విద్య గరపుటకు పంపించినాడు. అతడిని గూడా రాణి ధనం చూపి వలలో వేసుకొనకల్గింది.

గురువునకు యేమి చేయడానికీ తోచింది కాదు. తాను నిజం బయటపెట్టి రాజానుగ్రహం సంపాదించుకొనవచ్చనే ఆలోచన అతనికి ఒకమారు తట్టింది.

వెంటనే, తానీ సంగతి రాజుతో చెప్పినప్పటికీ రాజు తన మాట నమ్మక, రాణీ మాటనే ఆధారము చేసుకొంటాడనీ, తానావిధంగా అనినందుకు కోపంతో, తనకు మరణదండన విధించుతాడనీ అతనికి తెలుసు. ఒకవైపు రాణీకి తాను అనుకూలముగా ఉండినట్లయితే, అంతా తనకు అనుకూలంగా ఉంటుంది. అంతా తన్ను గౌరవంతో చూస్తారు. నెలనెలా తనకు రావలసిన జీతం వచ్చుతూయుంటుంది. అప్పుడప్పుడు బహుమతులు గూడా తాను సంపాదించుకొంటూవుండొచ్చు, ఆలా కాకుండా నిజం బయటపడవేసినట్లయితే ప్రాణముల కోసం ... దేశమును విడిచి పారిపోవటానికయినా వీలుండదు.

ఆ విధంగా తన మనస్సులో ననుకొని, ఆ గురువు రాణీగారి యుద్దేశములకు వీలుగా తాను నడుచుకొనవలయునని నిశ్చయించుకొన్నాడు. ఇతర విద్యార్థులు తనకు చేసి చూపిన వస్తువులలో మంచివి యేరి, అవి రాజు యెదుట పెట్టి...వాటిద్వారా మంచి బహుమతులు పొందుచూ ఉండేవాడు.

తన కుమారుడు పెద్దవాడవుతున్నాడు...తాను స్వర్గం పొందుతానని...ఆలోచనలో ఆనందం పొందుచూ, పిల్లవానికి వివాహం చేయ...ఆలోచన చేస్తున్నాడు. కొన్ని రోజులకు పెండ్లిచేసే దినం నిర్ణయించబడింది. దేశమంతటా అనేక ఉత్సవాలు జరుగుతున్నాయి. అంతా ఎంతో ఆనందం పొందుతున్నారు రాబోయే భవితవ్యాన్ని ఆలోచించుకొని. ఒకరుతప్ప—అదే రాణి...ఆమె విచారపడటానికి యేదో కారణం గోచరించుతూయుంది.

నిజం బయటపడుతుందని ఆమె భయపడసాగింది. ఈ అపాయము నుండి తప్పించుకొనటం యేలాగో ఆమెకు అర్థమవటంలేదు. ఏమి చేయడానికీ ఆమెకు తోచటంలేదు. మరొకమారు దాసీసహాయం ఆమె పొందవలసివచ్చింది. ఆమె ఒక మైనపు రాజాకారాన్ని తయారుచేయించింది. ఆ ప్రతిమ, జీవించి ఉండినట్లుగా... అన్నికళలూ ఉట్టిపడేటట్లుగా తయారు చేయబడింది.

అన్నీ సిద్ధముచేయుట అయిపోయిన తరువాత, ఆ కొయ్యరాజును పల్లకీలో పెట్టేసమయంలో రాణీ యీలా గంది:

యువరాజును పల్లకీలో ఉంచా. వివాహగృహం సమీపించేవరకూ తలుపుతీయకుండా, జాగ్రత్తగా తీసుకొనివెళ్ళండి. ఒకవేళ మీరు పల్లకీ తలుపు తెరచినట్లయితే యేం జరగాలో అది జరుగుతుంది. యువరాజు బలహీనుడై కృశించుతాడు.

రాణి చెప్పిన ప్రకారం, రాజు నడుచుకొనడానికి యిష్టపడ్డాడు. వివాహగృహానికి ఎంతో హడావిడితో బయలుదేరాడు. మార్గమధ్యంలో, వారు ఒక నదిఒడ్డున విశ్రాంతి తీసుకొందామనే యుద్దేశంతో ఆగారు. పల్లకీగూడా దింపబడింది. పల్లకీ తలుపులు వారగా, గాలి వచ్చిపోడానికి వీలుగా ఉండేటట్లుగా వేసియున్నాయి. ఆలాటి సమయంలో ఒకపాము, నదినుండి బయలుదేరివచ్చి పల్లకీలోనికి వచ్చి, ఆ లక్క-

(17 వ పేజీ చూడుడు)

పిల్లల కథ:

"యముడు నవ్వాడు"

అనువాదం: శ్రీ నేమాని వీరభద్రరావు.

[దక్కను కాలేజీ ప్రిన్సిపాలుగారగు ప్రొఫెసర్ బెయిన్ గారికి, ప్లేగువ్యాధితో మరణశయ్యమీద నున్న ఒక బ్రాహ్మణోత్తముడు అందజేసిన సంస్కృతప్రాతప్రతిలోని నీతిబోధకమైన కథ.]

ఒక చిన్న పల్లెటూర్లో ఒక బ్రాహ్మణుడు తన కుటుంబంతో సుఖంగా కాలం గడుపుతున్నాడు. తెలిసో తెలియకో అతడు క్షమించరాని పాపపు పని ఒకటి చేశాడు. అతనిచే గురువుగా భావింపబడే ఒక వ్యక్తి "నీవు నీ మిగిలిన జీవితమంతా పవిత్రమైన గంగానదిలో స్నానం చేస్తూ గడిపితేగాని, నీ పాపాలు పోవు. యముడు నిన్ను క్షమించడు" అని సలహా యిచ్చేడు. వెంటనే ఆ బ్రాహ్మణుడు సంసారం అంతా పెద్ద కుమారునకు వప్పగించి గంగానది కోసం బయలు దేరాడు. కొన్ని రోజులు ప్రయాణం చేశాక, అతని కొక కొండవాగు కనిపించింది. "సందేహం లేదు. యిదే గంగానది ఐవుంటుంది" అనుకున్నాడు. ఆ ప్రవాహం ఒడ్డునే నివసిస్తూ, ప్రతిదినం అందులో స్నానం చేస్తూ ఐదు సంవత్సరాల దీర్ఘకాలం గడిపేడు.

ఒక దినం ఆ మార్గం వెంబడి ఒక శివభక్తుడు ప్రయాణం చేస్తూ, బ్రాహ్మణ్ణి కలుసుకొని సంగతంతా తెలుసుకొని "బిడ్డా, నీ పాపం పోగొట్టుకోడానికి యీ మలిన ప్రవాహం ఎక్కడ దొరికింది. గంగానది యిది కాదు" అనేసరికి "అయ్యా, యిది గంగానది కాదా!" అని ఆశ్చర్యంగా అడిగేసరికి "బిడ్డా, నేను ముసలివాణ్ణి అవటం ఎంత నిజమో, యిది గంగానది కాకపోవటం కూడా అంతే నిజం. ఏ దొంగముండా వాడో యిది గంగానది అని చెప్పినిన్ను మోసగించి వుండాలి. గంగానది యిక్కడికి వందలకొలది మైళ్ల దూరంలో వుంది. చిన్నరాళ్ల గుట్టకీ, మేరుపర్వతానికీ ఎంత భేద ముందో, యీ మురుగు ప్రవాహానికీ, గంగానదికీ అంత తేడా వుంది" అన్నాడు.

"అయ్యా, నీ కెంతైనా కృతజ్ఞుణ్ణి" అని నమస్కరించి తిరిగి గంగానది కోసం ప్రయాణం సాగించ నారంభించేడు. కొన్నాళ్లకు ఒక పెద్దనది ఒడ్డుకు వచ్చేడు. వెడల్పుగా కనపడటంతోనే, బహుశా యిదే గంగానదై వుంటుంది అని అక్కడ ఐదు సంవత్సరాల కాలం గడిపేడు. దైవవశాత్తు, ఒక దినం కపాలికుడనే మరియొక శివభక్తుడు వచ్చి "బిడ్డా, యీ నది ఒడ్డున ఎందుకు యీ విధంగా నీ జీవితకాలం వృధా చేస్తావు. గంగానది పవిత్రతకు యిది ఎంత మాత్రం సాటి రాదు." అని సలహా యిచ్చేడు. బ్రాహ్మణుడు మరింత ఆశ్చర్యంతో "అయ్యా, యిది నిజంగా గంగానది కాదా?" అన్నాడు. "బిడ్డా, సింహానికీ, నక్కకీ ఎంత తేడా వుందో గంగానదికీ, దీనికీ అంత వ్యత్యాసం వుంది" అన్నాడు. బ్రాహ్మణుడు దుఃఖిస్తూ "అయ్యా, మీ కెంతైనా ఋణస్థుణ్ణి. మన కలయిక నిజంగా దైవికం." అని నమస్కరించి తిరిగి ప్రయాణం సాగిస్తూ కొంతకాలానికి నర్మదానది ఒడ్డుకు వచ్చి "యిది నిజంగా గంగానది ఐవుంటుంది." అని సంతోషం పట్టలేక అక్కడ ఐదు సంవత్సరాల కాలం గడిపేడు. ఒక దినం ఒక బ్రాహ్మణుడు తనవలెనే వుదయాన స్నానంచేసి నదిలోకి రెండు మూడు పువ్వులు భక్తితో విసరటం చూశాడు. వెంటనే అతని దగ్గరకు వెళ్లి "అయ్యా, ఈ నదిపే రేమి" టని ప్రశ్నించాడు. "యిదేమయ్యా, పవిత్రమైన నర్మదానదిని ఎరుగవా!" అని ఆశ్చర్యంతో అడిగేసరికి బ్రాహ్మణుడు ఒక్క నిట్టూర్పు విడిచి "సరి. నీ మూలంగానైనా నిజం తెలిసింది." అనుకుంటూ తిరిగి గంగానదికై బయలు దేరాడు. కాని వయస్సు బాగా మళ్లింది. మనిషి నీరసించి పోయాడు. నిరంతర నిష్ఠ అతనిని క్రుంగదీసింది. ఒకనాటి ఎండకి ఆ ముసలివ్యక్తి తాళజాలక జ్వరంకూడా తెచ్చుకున్నాడు. అయినా ఎలాగో రాత్రింబగళ్లు నడిచినడిచి 'యింక నడువలేను' అన్న పరిస్థితికి వచ్చేక ఒకచోట పడిపోయినా, తిరిగి లేచి ఒక రాళ్ల గుట్ట దగ్గరకు చేరుకున్నాడు. ఆ గుట్ట ప్రక్కనుంచే గంగానది ప్రవహిస్తూంది. అనేకమంది భక్తులు స్నానం చేస్తూన్నారు. మన యాత్రికునికి ప్రవహించే నది గంగానది అని తెలిసింది. కాని కదలలేడు. యింత దూరంవచ్చి స్నానం చెయ్యలేని స్థితిలో వున్నాడు. సంతోషం పట్టలేక "ఓ గంగామ తల్లీ, జీవితమంతా నీ అన్వేషణలో గడిపేను. యిక నీ దర్శనమైనది గనుక శాంతంగా చనిపోతాను!" అని అరచి ప్రాణాలు విడిచేడు.

బ్రాహ్మణుడు మరో ప్రపంచంలో యముని ఎదుట నిలబడ్డాడు. యముడు బ్రాహ్మణ్ణి చూపి "చిత్రగుప్తా, ఇతని నేరా లేమి"టని ప్రశ్నించేడు.

"అయ్యా, యితడు క్షమించరాని పాప మొకటి చేశాడుగాని, పదిహేను సంవత్సరాలు గంగానదిలో స్నానమాచరించిన భాగ్యశాలి" అని చెప్పేసరికి బ్రాహ్మణునికి చాలా ఆశ్చర్యమైంది. వెంటనే యమునితో "ప్రభూ, మీరు పొరబడితిరి. గంగానది ఒడ్డు చేరగలిగితిని గాని, స్నానంచేసే భాగ్యం లభించలేదు" అని ఎరుకపర్చేడు. యముడు నవ్వేడు. యముని నవ్వుకు అర్థమేమిటి? చిత్రగుప్తుడు పొరపాటు పడడు. యముడు న్యాయం తప్పడు.

కాబట్టి గంగానది ఒడ్డున వుండి అందులోనే స్నానం చేస్తూన్నప్పటికీ మనస్సు వేరుగా వుండి అపవిత్రమైనదైతే, నిజమైన ఫలితంరాదు. యీ బ్రాహ్మణుడు కేవలం గంగానదిలో స్నానం చెయ్యకపోయినా అతని మనస్సు "గంగానదిలో స్నానం చేస్తున్నాను. యిదే పవిత్రమైనది" అని భావించింది.

కనుక అతనికి గంగానదిలో స్నానం చేసిన ఫలితం దక్కింది. దేవతలు హృదయాన్నే పరీక్షిస్తారుగాని, యింద్రియములచే చేయబడిన చేష్టలబట్టి తీర్పు నివ్వరు.

బాలగేయాలు



కోలాటంపాటలు

శ్రీమతి పర్చ సీతాదేవి

(సంపాదకురాలు)

౧

ఆవాలు మిరియాలు కావట్లో బోసి
నే బోదు నెల్లూరు సోమన్న జూడా
సోమన్న రేకుల్లు సోద్యమ్ములాయె
అందులో ఒక రేకు గద్దె కట్టింది
గద్దెమీద కూర్చున్న కాంత లెవ్వారూ
రాజ్యాలు యేలేటి రాజు లెవ్వారూ
గద్దెమీద కూర్చున్న కాంత సీతమ్మా
రాజ్యాలు యేలేటి రాజు రామయ్యా.

౨

నెమలి పోయెనమ్మా నెమలి
కనగల రాజ్యానికీ
కనగ లారగించీ నెమలి
చెరువు నీళ్లు త్రాగ
చెరువు నీళ్లు త్రాగీ నెమలి
చెంగలించి కూసె
గులాల గుండెక్కి నెమలి
గుబ్బున పడ దూకె.

3

గోపమ్మ వాకిటా గుమ్మడీ పూసింది
గంప తేవే చెంచితా
ఆడుతూ పాడుతూ గంప తెచ్చేవఱకు
భళ్లునా తెల్లవారే.
ఏ మమ్మ గోపమ్మ యేశోద నందనుడు
ఎంత దుండగుడమ్మ మీవాడు
మావాడు కాదమ్మ మరి యెవ్వరో కాని
మందలో నున్నాడు మావాడు.
పందిట్లో మాపిల్ల పగడాలు గుచ్చంగ
పందెమేసీ పోయె మీవాడు ॥ మావాడు కాదమ్మ ॥
సందూన మాపిల్ల స్నానమూ చేయంగ
చీరె లెత్తుకుపోయె మీవాడు ॥ మావాడు కాదమ్మ ॥
గొల్లభామా లంత చల్లలమ్మా బోవ
చిల్లపెంకూ లేసె మీవాడు ॥ మావాడు కాదమ్మ ॥
వాకిట్లో మాపిల్ల వజ్రాలు గుచ్చంగ
వరుసలాడీ పోయె మీవాడు ॥ మావాడు కాదమ్మ ॥
పెరటిలో మాపిల్ల పిడకలూ చేయంగ
పెల్లవేసీ పోయె మీవాడు ॥ మావాడు కాదమ్మ ॥
కంసలోరీపిల్ల కాసులూ గుచ్చంగ
కన్ను గీటీ పోయె మీవాడు ॥ మావాడు కాదమ్మ ॥

తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

అన్నమాచార్యుల రచన: (సం పు. ౨; ప ౨౨3)

3

గౌళరాగం - జంపెతాళం

[వెంకటమఖి చెప్పిన ౧౯ ఘనరాగాలలో ఇదొకటి. (చ. ప్ర. అను. పు ౫. ప ౪౦.) మాలవగౌళమేళమందు పుట్టినది శు. రి, అం. గా, శు. మ, శు. ధ, కా.ని స్వరములు గలది. ఇప్పటి వ్యవహారంలో 'స రి మ,ప ని సే - సే ని ప మ రి గా మ రి స' అని ఔడవ వక్రముగా నిలిచినది. ధైవతప్రయోగం లేదు. వెంకటమఖి 'ధైవతోజ్ఝిత' అన్నాడు. (చ. ప్ర; రాగప్ర. ప. ౯౭.) మరి అనుబంధరాగలక్షణశ్లోకాలలో 'సదా వక్రితి గాంధారః' అనియు కలదు. (పు. రా. ప. ౧౧.) సంగీతసారామృతములో తులజా మహారాజు ఈ రాగంలో ధైవతం లేదని చెప్పినాడుగాని అత డిచ్చిన ఒక ప్రబంధోదాహరణము తునకలో 'ని ని ని ధ మ మ మ గ సా మ మ మ ని ధ' ఇత్యాదిగా ఋషభపంచమాలు లేక సధైవత ప్రయోగ మున్నది! సోమనాథుని లక్ష్యలక్షణములు రెండును దీనిని అల్పనిషాదముగల సప్తస్వరసంపూర్ణరాగముగా జూపుచున్నవి. ధ ప సా, ని సే ధ ప-ఇట్టి ప్రయోగాలే అత డెక్కువగా వాడినాడు. (రా. వి. పు ౧౧౨-౧౫3) ఇప్పటి వాడుకలో నిషాదము ప్రబలస్వరము, కాని షడ్జముతో చాలా చేరికగానే నడుచును. ధైవతము శుద్ధముగా వర్జ్యమైనది. మధ్యమస్వరమును కంపితాందోళితాదిగమకాలు లేక శుద్ధంగా దీర్ఘంగా ప్రయోగించుట, ప ప్ల మ మ రి రి, గ మ రి రి స, ని ని స ని ని స ని రి రి. ౼ఇత్యాదిగా స్ఫురితప్రత్యాహతములతో జంటస్వరములను వాడుట ఈ రాగమును చక్కగా స్ఫురింపజేయును.

తాళమును అరజంపె, లేక కుజుజంపె అను పేర ఐదైదుమాత్రల మొత్తముగా గ్రహించి రెండు మూడుగా పంచుకొని రెండుచాపులు వేయుట ప్రాచీనపద్ధతి; ఈ తాళముగల పదములు నడిచే వేగములో తాళలక్షణప్రకారం ఒక మిశ్రలఘువు, అనుద్రుతం, ద్రుతం లెక్కపెట్టి వేయుట చాలా చిక్కుగనుక, కొందరు దీనిని ౨-౧-౨ గా భావించి మూడుదెబ్బలుగా నిర్వహింతురు నిజంగా అది మత్స్యచాపు. ఆధునికులు మరికొందరు దీనిని త్ర్యశ్రరూపకముగా గ్రహ్యించి ౧ ద్రుతం, ఒక లఘువుగా వేసి చూపుదురు.]

[పల్లవి]

(౧) సీ ని స రి రి స నీ సా ,
నీ కు స రి యే రి

(౨) సీ ని స రి రి స ని ప ప నీ
నీ కు స రి యే రి

(3) స రి స స రి గ మ రీ స
నీ కు స రి యే రీ

(౪) సీ ని స రి స రి ప మ గ మ రి మ రి రి స స
నీ కు స రి యే రి

(౫) ని ప ని స స ని స రి స రీ, । స రి మ రీ ని స రి సా
నీ కు స రి యే రి ని ఖి ల లో క ము ల లో

(౨) స రి గ మా రి గ మ రి రి స స
ని ఖి ల లో క ము ల లో

(3) స రి మ ప నీ, ప మ రి మ రి రి స స
ని ఖి ల లో క ము ల లో

(౪) స రి మ ప నీ సే రి సే ని ప మ రి గ మ రి రి స
ని ఖి ల లో క ము ల లో

(౬) స ని పా నీ స రి ప మ గ మ రి మ రి మ ప ని । సే ని సే రి సే రి సే రి సే ని సే ని ప మ రి మ రి రి స స ॥
నీ కు స రి యే రీ ని ఖి ల లో క ము ల లో

[అనుపల్లవి]

(౧) రీ మా మ ప ని సా సే । సా ని ప మ ప ప మ మ రి మ రి రి స స
కా కా సు రు ని న ట్ల కా చి తి వి నీ వు

(౨) రీ పా మ ప-ని సా రి సే నీ సే । సా సే ని ప ని సే రి సే ని ప మ రి మ రి రి స స (నీకుసరి)
కా కా సు రు ని న ట్ల గా చి తి వి నీ వు

[చరణం]

(౧) ప ప మ మ మ రి మ పా । , ప ని పా , , ప మ మ
హ రి ప ర మ పూ రు షా అ చ్యు తా నం త

(౨) ప ని ప మ మ మ ప మ రీ మ పా । , ప ని సే రి నీ పా , ని ప మ మా మ
హ రి ప ర మ పూ రు షా అ చ్యు తా నం త

ప మ రి రి స ని స రి సా । స రి మా రి మ పా , , ,
క రి వ ర ద ము ర హ రా క రు ణా ని ధీ

(౧) ప మ మ పా ని ని ని సే సే । రీ రీ మ రీ సే ని ని ని సే సే
ధ ర ణి యా క స ము బ లి త ల యు మూ డ డు గు ల ను

(౨) ప మ ప నీ సే సే రి సే రి । సే రి మ మ రి సే ని ని ని సే రి సే ని
ధ ర ణి యా క స ము బ లి త ల యు మూ డ డు గు ల ను

ప సే సే సా సే ని సే రి సే ని పా మ । రి మ రి మ ప ని సా , ని ప ప మ మ రి మ రి రి స స ॥
ప ర గ నై కొ న్న ట్టి బ లు డ వు నీ వు (నీకు)

ఇట్లే ఈ క్రింది చరణములు

(౨) మాధవా భూధరా - మధుసూదనా కృష్ణ
శ్రీధరా శ్రీపతీ - శ్రీనివాసా
శోధించి జలధులు - చొచ్చి చదువులు దెచ్చి
ఆ ధాత కిచ్చితివి - అధికుడవు నీవు ॥

(3) వామనా కేశవా - వాసుదేవ ముకుంద
రామ గోవింద చ - క్రకరాంబుజా
ఆ మహిమ శ్రీ వెంక - టాద్రి మీదట నెక్కి
కామితఫలము లిచ్చు - ఘనుడవు నీవు ॥

ముద్రితపాఠములు : ధరయాకసము, నైకొన్నయట్టి.

కొండవీటి జిల్లా

నాడు - నేడు

శ్రీ కాకుమాను వెంకటరత్నం

కొలది శతాబ్దములక్రిందట నే, ఆంధ్ర దేశమున కాయువుపట్టుగా వెలయు కొండవీడును, ముఖ్యపట్టణముగ జేసికొని సుస్థిరమైన రాజ్యపాలన యొనరించిన రెడ్డిరాజులచరిత్ర భావి భాషా రాష్ట్రనిమగ్నులగు మన ఆంధ్రప్రజానీకము మరి యొక పరి మదితలంచుట కాశ్చర్యమాంతయు సంఘటిల్ల కారణముకాజాలదు. అనుదిన మాబాలగోపాలము గాన మొనర్చు 'నీతిసూక్తుల పద్యములు' ఈ రెడ్డిరాజులలో ప్రసిద్ధుడై, చరిత్ర ప్రసిద్ధినొందిన 'వేమన'వే యని చెప్పుట గూడ ననవసరము. నాటి ఆంధ్రదేశమున మధ్యభాగమున రాజకీయముగను, నైతికముగను, సువర్ణాక్షరములు లిఖించుకొనిన రెడ్డిరాజుల ప్రాచీన గాథ స్ఫురింపజేసికొనుట, శిథిలశిలావశిష్టమైన చరిత్రదృశ్యములు మరల రూపొందజేసికొనుట, విజ్ఞానవికాసములకు, మార్గాన్వేషణములుగ దోహద మీయకను పోజాలవు.

పురాతన గాథ

కొండవీటి రెడ్డిరాజులు, సామంతరాజులందఱి యందున, శక్తిసామర్థ్యములు ప్రబలి యుండి యుండుటయే గాక, సుగమమైన ప్రజాపాలన నెఱపిన కారణముగా, వారి సమీపమున నున్న కొండపల్లి గజపతులును, హైదరాబాదు నవాబును గూడ లొంగియుండెడివా రనియు, అందువలన నే 'కొండవీటిసామ్రాజ్య'మని పేరు పొందినట్లు వినయముగాని, వీరియందు యితర రాజ్యములు కబళింపవలె ననెడి అత్యాశ అణుమాత్రము పొడగట్టియుండియున్నట్లు చూపట్ట దని యిచ్చట ప్రజలు చెప్పికొను నిజపరిస్థితులవలన తెలియనగుచున్నది.

విచిత్ర గాథ

మన కొండవీటి రెడ్డిరాజుల రాజ్యపాలనను, భుజబలపరాక్రమముల నిచ్చగింపక, హైదరాబాద్ నవాబు, ఒక ఆంగ్లేయదొరయు కలసి, వారిని హతమార్చిన విషయమును తలంచు ప్రతి మానవుడు శోచనీయుడగు ననుట సత్యవిదూరము కానేరదు.

శత్రువులగువారు, ఒక బ్రాహ్మణుని చేరదీసి బహూకరణ నొసంగెదమని ఆశగొల్పిన, నాతి డది అతి సులభ మని పలికి, రెడ్డిరాజులతో సంప్రతించి ఒక దేవాలయము నిర్మించుటయు, అందు అంతర్భాగమున ఒక బావిని కత్తులతో నిర్మించి, పూర్తియైన పిమ్మట అందరూ దేవుని దర్శింపవలె ననుటయు, వా రట్లు దేవుని చూచుట కపేక్షించి బాలవృద్ధాదులందరూ, వెనువెంట జనుచు ఆ బావియందు ప్రాణములు గోల్పోవుటయు, పిమ్మట కొంతసేపటికి లోనికివెళ్లినవారు బయటకు రాకుండుటచే, కుట్ర తెలిసికొనినట్లును తెలియనగుచున్నది.

ఆ తరువాత దుర్మార్గులగు ఆ ముగ్వురూ పశ్చాత్తాపము నొందుటయు, వెనువెంటనే ప్రాణములను గోల్పోయినట్లు, మొదలగు విచిత్రసంఘటనలు జరిగినవిధముగా యిచ్చటి వారు చెప్పుచుందురు.

చూడదగిన విశేషములు

గుంటూరునకు సమీపమార్గమున నున్న ఈ ప్రాచీన పర్వత పంక్తిని ప్రతి ఆంధ్రుడును చూచి రెడ్డిరాజుల పురాతన గాథ వేనోళ్ళ వినిపింపజేయుట ఆంధ్రుల ముఖ్యకర్తవ్యమునై యున్నది.

కొండ పైభాగమున శిథిల రూపమున నున్న రామాలయము, నాగదేవతలాలయములు, గజశాల, ముత్యాలశాల (రెడ్డిరాజుల కచ్చేరీశాల) ఆయుధశాల, ధనాగారము, వెదుళ్ల చెరువు మొదలగు విశేషములు పురాతన నామములతో కాననగును. మరియు, నచ్చటచ్చట ఓషధీవృక్షములు సుమపరిమళము వెదజల్లుచు, చూడవచ్చినవారికి మనోరంజనము కలిగించును. కోట బురుజులు మింటిని మంటిని యేకము గావించున ట్లాశ్చర్యము నిచ్చుచు యుద్ధసమయమున సేనలు వీనిపైనుండి శత్రువుల రాకను గుర్తించుటకు మిక్కిలి వీలు గావించుచుండును.

బాలానందం

(14 వ పేజీ తరువాయి)

రాజును చూచి అందులోనికి దూరి, దానికి ప్రాణము పొందేట్లుగా చేసింది.

ఇది యేమీ గమనించకుండానే పెళ్లివారి పరివారం ముందుకు సాగి పెళ్లివారింటి ముందుకు వచ్చింది. ఎంతోమంది పెండ్లి చూడటానికని వచ్చారు. పెండ్లికుమారునికి స్వాగత మిచ్చుదామనే యుద్దేశంతో పల్లకీ తలుపుదగ్గరకు వచ్చాడు పెండ్లి కుమార్తె తండ్రి.

తలుపు తీయబడింది. ఏమాశ్చర్యం! ఒక యువరాజు లోనించి బయటకు వచ్చాడు. యువరాజు అందం వర్ణించటం కష్టం. యువరాజు అక్కడ యున్న ప్రతీవారివయిపూ ఒకమారు తిరిగి, చిరునవ్వు విసిరి ముందునకు పోయి, పెద్దలకు వందన మాచరించాడు. మొదటిమారుగా రాజు గూడా కుమారుని చూచాడు. రాణీ మాటలు మరచిపోయి, కుమారుని దగ్గరకు లాగుకొని గాఢాలింగనము చేసుకొన్నాడు.

కొంతకాలము గడిచిం తరువాత, కొడుకునకు యేదో ఆపద వాటిల్లుతుందని అతడు గ్రహించాడు...కాని అది చాలాదూరము తీసుకొనిపోయింది.

పెళ్లి హంగామా లేకుండా శాంతముగా జరిగిపోయింది. మరునాడు రాజు తన భార్యతో తిరిగి, తమ పట్టణం ప్రయాణమయ్యాడు.

పెళ్లివారు తిరిగి వచ్చుతున్నారన్న సంగతి విని రాణీ భయపడసాగింది. తాను దాచిన...అసత్యం యీ దినం తేలిపోతుందని భయపడింది. రాజు తనను కోపంతో దూషించునా డని ఆమె తలచింది.

ఏమి చేయుటకూ తోచక, ఆమె మంచము మీదకు పోయి, పరుంది...

రాణీ పరున్నచోటికి యువరాజు, తన భార్యతోసహా వచ్చి, తల్లి నిద్రించటం గమనించి, ఆమె పాదముల మట్టి తీసుకొని తమ తలమీద వయిచుకొన్నారు. ఆ సమయంలో రాణీ...సగం సగం కన్నులు తెరచి చూచింది...ఆశ్చర్యం! తన లక్క కుమారుడయిన యువరాజూ, అతని భార్యా తన యెదురుగుండా నిల్చుని ఉన్నారు.

ఆమె సంతోషంతో వారిరువురునీ కౌగలించుకొంది. ఇది అంతా నాటకమా అని ఆమెకు ఆలోచన కలిగింది. తన లక్క రాజు యే మాంత్రికుని వల్ల రక్తమాంసములతో జీవం కలిగియుంటాడని ఆమె తలచింది.

ఆమె ఆనందం చూపించటానికి అది సమయం గాక పోయింది. ఆ జంట నాశీర్వదించి, యువరాణిని రాజభవనములోనికి ఆహ్వానించింది.

కుమారుని విషయం... ఆమెకు ఆశ్చర్యకరంగా కన్పించటం వల్లనో, అతడంటే భయం కల్గటం వల్లనో, అతనివయిపు చూడటానికి భయపడింది.

ఒక దినం యువరాణి రాణీని యీలా అడిగింది: "ఓ రాణీ ... నే నీ యింటిలో అందరివిషయం తెలుసుకోవాలని యిష్టపడుతున్నా".

యువరాణీ మాటలు రాణినిగూడా తన కోరికలు తీర్చుకొన వచ్చునని చెప్పాయి. ఈ లక్కరాజు తర్వాత వృత్తాంతము తెలుసుకొన వచ్చునని ఆమె అనుకొంది. అందువల్ల యీలా జవాబు నిచ్చింది! "ఓ యువరాణీ!.. నేనా విషయాల్లో చాలా విసిగిఉన్నా. నాచేత చెప్పించి, తిరిగి నన్ను విసిగింపచెయ్యకు. అవసర మయితే నీ భర్త నడుగు. అతడే చెబుతాడు".

ఒక సాయంకాలం, యువరాజూ, యువరాణీ నదిగట్టున, పల్లకీ వదలి నడుస్తున్నారు.

యువరాణీ 'మీ చరిత్ర చెప్పవలసిం'దని ప్రార్థించింది.

"ఓ రాణీ... అంత ఆదుర్దా ఆ విషయంలో పొందకు?" యువరాజామెను మేల్కొలిపి, తిరిగి యీలాగన్నాడు: "ఇంకోవిషయ మేదయినా సరే, అడుగు...ఈ విషయాన్ని గురించి మాత్రం నన్ను ప్రశ్నించకు."

ఆడవారికి కుతూహలత ఉండటం సహజం. అందులోనూ చెప్పగూడని సంగతంటే మరింత పీకుతారు. అందువల్ల 'మీరెవరో, మీచరిత్ర మేమిటో చెప్పవల్సిం'దని తిరిగి బాధించింది.

రాజు నదిలోనికి దిగి ఆమెను తిరిగి తన ఆదుర్దా ఆపుకోవలసిందని కోరుతూ "రాణీ! నే నెవరినో తెలుసుకొనడానికి ప్రయత్నించకు. నీ తెలివే... నీ సుఖాన్ని దూరం చేస్తుందని గ్రహించుకో" అన్నాడు.

అతడీలా అనే లోపుగా పాదములు తోకగా మారిపోయాయి. కాని, పాదము లావిధంగా మారిన సంగతి యువరాణీ తెలుసుకొనలేదు. అందువల్ల తిరిగి చెప్పవలసిందని బలవంతం చేసింది.

"రాణీ, యింకా నే నెవరినో తెలుసుకోవాలని యుద్దేశ పడుతున్నావా?" అన్నాడు.

అనుచూండగానే... ఆ తోక... నడుమువరకూ పాకుచుకు వచ్చింది. ఇంకా లోతు నీటిలోనికి పోతూ... "ఓ రాణీ...ఇంకా నే నెవరో తెలుసుకోవాలని ఉందా?" అని ప్రశ్నించాడు.

ఇది హాస్యాని కంటున్నదనుకొని రాణీ చెప్పవలసిందని తిరిగి బలవంతం చేసింది. ఈ మారు బుజములవరకూ తోక తయారయింది.

చివరిసారిగా, ఆ రాజు..."రాణీ నే నెవరో యింకా తెలుసుకోనాలని ఉందా?' అని ప్రశ్నించాడు...

'అవును, మీరు నన్ను నిజంగా ప్రేమించుతున్నట్లయితే యిన్ని మార్లడగక జవాబు చెప్పితీరాలి' అన్నది...

వెంటనే ఆ రాజు, పాము రూపం పొందాడు. నదివరదల్లో కొట్టుకొంటూ...ముందుకు పోయి, మాయమయిపోయింది!

భర్త పాము రూపం పొందిన విషయం, యువరాణిచూచి, నదిలో పడి చనిపోవబోయింది. కాని ఒక దయగల ముసలి స్త్రీ-నీటిని తీసుకొనివచ్చుటకోసం-వెళ్లిన ఆమెవల్ల రక్షింపబడింది. జరిగిపోయిన కథంతా ఆమెకు...ఒక చెడ్డ కలవలె గోచరించింది. మామగారి గృహానికి భర్త లేకుండా వెళ్లుట యిష్టం లేక, ఆ ముసలిస్త్రీవద్దనే ఉండ నిశ్చయించింది.

యువరాజూ, యువరాణీ, తిరిగి రాజభవనము రాకపోవటంచేత, రాజు వారి విషయంలో ఎంతో తాపత్రయం పడసాగాడు. (అతడు రాణి ఆజ్ఞ ప్రకారం...తప్పుడుపని చేశాడు)...ఏదో ఆపద వారికి సంభవించియుంటుంది.

చిట్టచివరకు ఎంతో హడావిడిగా... వెతకుట సాగింది. కాని ప్రయోజనం శూన్యమయింది. రాజునకు భయమావహించింది. రాణీరాజుతో యీ విధంగా అంది: "మీతో నే నందుకనే చెప్పా. నా ఆజ్ఞ ఉల్లంఘించి మీరు బిడ్డను చూచారు. ఏదో ఆపద అతనికి, అతని భార్యకూ సంభవించియుంటుంది" అని.

కాలం గడచింది. ఒక తమాషా సంగతి ముసలిస్త్రీ గ్రహించింది. ప్రతీ సాయంకాలమూ ఒక పెద్దపాము, నది వొడ్డునకువచ్చి, రాణీతో ఆటలాడుతూ యుండేది. ఆ పాము ఆమె నేమీ చేసేది కాదు...ఆమె ఆ పామునకు పాలూ, ఆహారమూ యిచ్చి కాపాడేది.

ఈ ఆశ్చర్యకరవిషయం ప్రతీవారి నోటినుంచీ ప్రాకి, రాజుగారినిగూడా చేరింది. ఒక సాయంకాలం రాజు తెలియకుండా ఆ ముసలిస్త్రీగృహమునకు చేరి, ఒక చెట్టుచాటున పొంచి ఉన్నాడు.

రాణీ, జ్వరమువల్ల గదిలో బాధపడుతూ నిద్రపోతుంది. మంచము ప్రక్కనే ఒక ముసలిస్త్రీ కూర్చుని ఉంది. కొంచెంసేపు అది గమనించిన తరువాత, యువరాజు పాము పరుగులు వేసుకొనుచూ, నదివైపు నుండీ, తన స్నేహితురాలు కనపడక వెతుకుకొనుచూ, గదియంతా పచారు చేయ సాగింది.

దగ్గరలో యెవరూ లేరనే యుద్దేశంతో, అన్ని వైపులూ చూచి, ఆ పాము...తన పైతొడుగును తీసి వేసింది...ఆశ్చర్యం! లోనుంచి మైనపు యువరాజు బయటపడి యువరాణి గదిలోనికి వెళ్లాడు.

అంతా గమనించుతున్న రాజు వచ్చి ఆ...తొడుగును అంటించివేశాడు.

తరువాత యువరాజున్న గదిలోనికి వెళ్లి అతగాణ్ణి కౌగలించుకొని, ఆనందంతో తన కోడలూ, ఆ ముసలమ్మలతో, తిరిగి తనరాజ్యం చేరి, కుమారునికి పట్టాభిషేకం చేసి, తాను వానప్రస్థాశ్రమం స్వీకరించాడు. ముసలమ్మ చిరకాలం ఆ దంపతులను కాపాడుతూ తన జీవితం గడిపింది.

ఈ కొండక్రిందిభాగమున రెడ్డిరాజులు దివ్యపథ మొందిన దేవాలయమును క్రీడావినోదమొనరించిన రాతిగుండ్లును మఱికొన్ని యాటస్థలములును చూడనగియున్నవి.

పురాతనమున పరివారము వసించిన ఈకొండ క్రింది ప్రదేశమున నేడు ఒక కుగ్రామమును, దానిచుట్టు శిథిలములైన కోట ప్రాకారములు, కందకములు, వీటి కావల నంటియుండు సెలయేరులు చూడ సొంపుగ కన్పట్టుచుండును. పాశ్చాత్యదేశపు పర్వతాగ్రముల నున్న ప్రకృతిశోభ మన ఈ పర్వతములమీద నుండ దనుట కేవలము అవివేకము కాదా! కాలప్రభావమునుబట్టి గదా జీర్ణమైనదియు కోటి ప్రభలుగ విరాజిల్లుట.

నాటి రెడ్డిరాజుల కాలమున మహోన్నతస్థితి నొందిన ఈ కొండవీటి సామ్రాజ్యము, నేటి మన ప్రధాని రెడ్డియారుగారి ప్రభుత్వమున ప్రావృత ప్రాచీన దశను, మరల చరిత్రప్రసిద్ధిగ రూపొందజేసిన, ప్రజాభీష్టమునకు, సర్వదా సంస్మరణీయుడుగ పాత్రుడు కాగలడు కదా!

"రంగుల రంజు"

(8 వ పేజీ తరువాయి)

మనదేశస్థులు వాళ్ల దేశంలో ఎక్కువ కాలం గడిపితే నలుపువిరిగి వన్నెవస్తున్నది.

అటువంటప్పుడు ఈ వర్ణవిభేదాలకు కారణం ఏమిటి? అనేది మరో విషయం. శ్వేతముఖులకు నల్లవాళ్లను చూస్తే పైత్యంకలుగుతుందంటే ఏదో ఒకవిధంగా సమాధానం చెప్పుకోవచ్చు. కాని మనలోకూడ ఈలాంటి వికారం ఉండడం దురూహ్యంగా ఉంటుంది. గుండెమీద చెయ్యవేసుకొని ఇటువంటి సంకుచితభావం మనలో లేదని చెప్పటానికి ఎవ్వడూ సాహసించడు. పిల్లో, పిల్లవాడో కొంచెం నలుపని ఎన్ని సంబంధాలు తప్పిపోవటంలేదు? బంగారం వంటి శరీరకాంతి గల స్త్రీని వర్ణించి ఎందరు కవులు శోషపడిపోలేదు? ఆ రచనలను చదివి ఎందరు గుటకలు మింగి కవిసన్మానాలు చేయలేదు? ఎఱ్ఱని వధువులకోసం పత్రికలలో ప్రకటనలను ఎన్నింటిని మనం చూడడంలేదు? నల్లని మగడికి తెల్లని భార్య ఉంటే 'కాకిముక్కున గట్టిరే దొండపండు' అని ఎందరు వేళాకోళం చేయటం లేదు?

అందాకా ఎందుకు? పిల్లల విషయంలో కన్న తల్లిదండ్రులు ఈ మనోవికారానికి తావియ్యటం లేదని నిక్కచ్చిగా చెప్పగలమంటారా? చామనచాయబిడ్డ పక్కనే ఉన్నాడని కొంచెమైనా మనసుకు తెచ్చుకోక, బంతిపువ్వువంటి మరొక బిడ్డ ఎండలో తిరిగితే పెంకుమాదిరి ముఖం అయిందని ఎందరు గగ్గోలు పెట్టటంలేదు? నిబంగా, శ్రీరాముడు నీలమేఘశ్యాముడు కాకపోతే వనవాసం చేయమని, కైకనుమించిన భార్య చెప్పినా, దశరథుడు వినేవాడా? ఒక్కనాటికీ వినడు. ఆఖరుకు నల్లమేక తప్ప యజ్ఞపశువుగా ఉండేందుకు వీలు లేదుట! ఆర్యులు గాని నల్లజాతివాండ్లంతా కిష్కింధాపురిఅగ్రహారీకులుట; జాంబవంతులుట; దానవులుట!

ఈ వికారం పోవాలంటే కొన్నిమార్పులు జరిగితీరాలి. నల్లగుడ్డలను దుఃఖసూచకంగా ఉపయోగించకూడదు. నల్లవాళ్లను బొగ్గులలో రామచిలకలనగూడదు. మోసకారి వ్యాపారస్థులను బ్లాక్‌మార్కెటీర్లు అని పిలవగూడదు. ఎఱ్ఱవాళ్లకోసం పెండ్లి ప్రకటనలను నిషేధించాలి. పసిమి ఉన్నవాళ్లు నలుపు కలిసిన ఫేస్‌పౌడర్లను మాత్రమే వాడేట్లు శాసించాలి. బంగారుఛాయకు బాజాలుకొట్టే రచనలను బహిష్కరించాలి. ఈ విధంగా ఉపక్రమిస్తేతప్ప అంతర్వ్యధాలు అణగిపోవు. జాతిపోరాటాలు సమసిపోవు.

నీలాలు

శ్రీ యామర్తి గోపాలరావు

"పూర్వం బలాసురుడనే రాక్షసుడుండేవాడు. వాని నేత్రాలు నీలకాంతులతో విజృంభిస్తుండేవి. కాలక్రమాన అవి సింహళంలో పడ్డాయి. ప్రవాహ వేగాన అవి కొట్టుకొనివచ్చి, ఆ పరిసరప్రాంతాల్లో ఉండిపోయినవి. కాని, ఈ నేత్రాల్లోనుంచి ఇంద్రనీలరేఖలు జనించాయి. అందులోనుంచి, బలరాముని వస్త్రం, ఖడ్గం, తుమ్మెద, హరి శరీరం, హరుని కంఠాన్ని పోలినటువంటి నీల కాంతిగల రత్నాలేర్పడ్డాయి" అని చిన్ననాడు మా గురువర్యులు, సందర్భవశాత్తు చెప్పారు. చిన్నతనంలో, రంగువస్తువులను చూస్తున్నా, లేక ఎవరన్నా చెప్తున్నా చాల ఆసక్తి ఉంటుంది. అందువల్లనే, ఏది మరిచిపోయినా, మా పంతులు గారు నీలాలనుగురించి చెప్పిన విషయంమాత్రం మరచిపోలేదు. మీరు దీనిని నమ్మకపోవచ్చు. కాని ఈనాడు అధికంగా నీలాలు సింహళంల్లో దొరుకుతున్నది. వీటినే పాశ్చాత్యులు 'సెప్పైరుస్' (*Sapphires*) అంటున్నారు. ఇవి కురువింద జాతికి చెందిన కిరణభేద్యాలైన నీలవర్ణపు స్ఫటికాలు. ఇవి కెంపులకన్నా పొడుగ్గా స్ఫటికత్వాన్ని చెందుతవి. నీలాలు పద్మరాగాలకన్న మిక్కిలి కఠినమైనవి. వజ్రాలతర్వాత మిక్కిలి కఠినమైనవి ఇవే. నీలాలు వర్ణవిభేదాలతో లభిస్తవి. అసలు నీలవర్ణంలోనే అనంత వైవిధ్యం ఉన్నది. ఘోషయాత్రాఘట్టాన మహాకవి ఎఱ్ఱాప్రగడ నీలకాంతులతో ఒప్పిన గోగణంలోని అనంత విభేదాన్ని "కాదంబి, కాలేయ, కాదంబినీనీల, జాల, తమాలికాసన్నిభము" లని నీలవర్ణ వైవిధ్యాన్ని నిరూపించాడు. ఆ వర్ణ విభేదాన్ననుసరించే ఇంద్రనీలాలనీ, మహానీలాలనీ, నీలమణులనీ, ప్రాచీనులు వ్యవహరించారు. ఇంద్రనీలాలు తలవంద్రుకలవలెను, నెమలికంఠమునందుగల నీలకాంతివలెనూ మెరుస్తుంటాయి. వీటిని, ఇంద్రుడు ధరించుటవల్ల గొప్పవైభవం వచ్చిందని ప్రతీతి. అందువల్ల వీనికి పేరు వచ్చింది. మహానీలాలు భూమిమీద ఉంచితే, ఆ ప్రదేశమంతా, వెదురు పువ్వు విచ్చినప్పుడు ఏవిధంగాఐతే పచ్చగా ఉంటుందో, అదేమాదిరి ప్రకాశిస్తుంది. ముప్పాతిక రంగు గల్గిన మహానీలాన్ని ధరించినవారికి శుభములు కల్గుతవి. నీలమణులకు సగమే రంగు. విష్ణుక్రాంత పుష్పాల ఛాయతో ప్రకాశవంతంగాను, మనోహరంగాను కనిపిస్తవి.

విశేషంగా స్ఫటికాల్లో నీలపురంగు అతుకు లతుకులుగా ఉంటుంది. కాని రత్నాన్ని చెక్కేవాడి పనితనాన్నిబట్టి దట్టంగా రంగు ఉన్నభాగం, మిగిలిన భాగాని కంతటికీ వ్యాప్తి చెందేలాగున చేయవచ్చు. కెంపులమాదిరి వీటికీ 'స్ఫటికాక్షం' ఉంటుంది (*Crystal axis*). వీటిని ఈ అక్షంద్వారా పరిశీలించినపుడు గరిష్ఠ వర్ణాన్ని ప్రదర్శిస్తాయి. కనుక నీలాలను కోసేటప్పుడు, వాటి అక్షాలు చూసే వాళ్ల కళ్ల కెదురుగా ఉండేటట్టు కోస్తారు.

సహజంగా ఇది షడ్భుజి (*Hexagon*) ఆకారంలో స్ఫటికత్వం చెందుతుంది. ఈ స్ఫటికాలను 'డైక్రోస్కోపు'తో పరీక్షిస్తే రెండు ప్రతిబింబాలు కనిపిస్తాయి. ఒకటి ఇంద్రనీలవర్ణంలోనూ, రెండవది లేత నీలిరంగులోనూ ఉంటాయి. ఈరత్నానికిగల నీలిరంగు, క్రోమియం ఇనుము లేక టైటానియముల భస్మంవల్ల ఏర్పడిందని శాస్త్రజ్ఞు లూహించారు. అత్యధిక ఉష్ణోగ్రతలవద్ద, ఇవి తమ సహజమైన వర్ణాన్ని కోలుపోతాయి. కెంపులమాదిరి చల్లార్చినపుడు తిరిగి తొలివర్ణాన్ని గ్రహించలేవు. నీలమణులను రేడియం ధాతువువద్దకు జేర్చిన, అవి తొలుత ఆకుపచ్చగాను, తదుపరి పసుపుపచ్చగాను మారుతా యని ఒక శాస్త్రజ్ఞుడు అభిప్రాయపడుచున్నాడు.

కలుషము, మందకాంతి, గీరలు, బ్రద్దలు, సందులు, గువ్వరాలు, సొగసులేకుండుట మొదలైనవి సాధారణంగా మణుల్లో ఉండే దోషాలు. ఈ దోషాలనే, నీలాల్లో, త్రాసము, భిన్నము, పటలము, పాషాణగర్భము, మృద్గర్భము, రక్తబిందువు లని అంటారు. స్ఫటికాల్లో పగిలిన చిత్తు కనిపిస్తే, 'త్రాసము'అనే దోషం ఉన్నట్లుగా గ్రహించవలెను. దీన్ని ఎట్టివారు ధరించినా పోరు అధికం. కొన్ని నీలాలు తమ సహజమైన కాంతిని పైకి రానీయవు. అట్టివాటికి 'భిన్న' మను దోషం ఉంటుంది వీటిని ఉపయోగిస్తే బంధునాశనం గల్గుతుంది. గర్భంలో పగుళ్లు ఉన్నదానికి, 'పటలము'అనే దోషం ఉంటుంది. ఇట్టివాటిని వాడినట్లయితే, 'ఆ వ్యక్తుల హృదయాలు ఎప్పుడూ, చికాకుగా ఉంటా' యని పెద్దలు చెప్పుతున్నారు. మణిలో ఇసుక కనిపిస్తే దానికి 'పాషాణగర్భం'అనే దోషం ఉన్నదంటారు. పుత్రనాశనం దీని ఫలితం. 'మృద్గర్భ'-మనే దోషంగల మణుల్లో మెత్తని మన్ను ఉంటుంది. దీన్ని ధరించిన వ్యక్తు లెప్పుడూ ఆపదలపాలవుతూ ఉంటారు. స్ఫటికాల పైన, నెత్తురు చుక్కల మాదిరి మచ్చలు ఉన్నట్లయితే, దానికి రక్తబిందు వనే దోషముంటుంది. చేతితో తాకకూడదు. దీనిని ధరించిన వారి వంశం ఏడాదిలో నాశన మౌతుంది.

ఇవే కాకుండా, ఈ మణులకు మలిన, విచ్ఛాయ, కుక్షిర, కరంజి, వాలుకాస్పర్శనం అనే ఐదు సామాన్య దోషాలున్నాయి. తనకున్న సహజమైన మెరుగు, వెలుగు లేకుండా ఆరిపోయిన దీపంమాదిరిగా ఉండేమణికి, 'మలిన' దోషం ఉంటుంది. కొన్ని నీలాలు, సహజ కాంతులతో కాకుండా, మరొక కాంతితో ప్రకాశించే నీలాలకు 'విచ్ఛాయ' అనే దోషముంటుంది. తెలిసినవాళ్లు ఎవ్వరూ వీటిని వాడరు. నీలాన్ని చేతిలో ఉంచి చూచినప్పుడు ధవళకాంతి కనిపిస్తే 'కుక్షి'అనే దోషం దానికి ఉన్నట్టు. అందువల్ల జ్ఞానులు దానిని ధరించరు. చేతిలో పెట్టుకొని, పరీక్షించినపుడు, అడుగునగాని, పైనగాని నల్లని ఉలవగింజలమాదిరి కనిపిస్తే అది 'కరంజి'దోష మంటారు. దీన్ని ఉపయోగిస్తే కలహాలు వస్తవి. నీలాల్లో ఏటివంటి నెరసులు ఉన్నట్లయితే, దీనికి వాలుకా(ఇసుక) స్పర్శ దోష ముంటుంది. వీటిని ధరించినవారికి మేలు తొలగిపోతుంది.

ఈ మణులకు అధిపతి శని. మనోహరములైన, సహజమైన పరిశుద్ధ కాంతులతో ప్రకాశించే నీలాన్ని ధరించినవారికి, అతడు ఐశ్వర్యాలని కలుగజేస్తాడు. మృత్యుభయం తొలగిపోతుంది, అందువల్లనే—

"మాణిక్యం తరణేర్మధ్యే
ప్రాచ్యాం వజ్రం,భృగో ర్విధోః
ఆగ్నేయం మౌక్తికం, యామ్యాం
ప్రవాళం, మృగస్యచ
గోమేధం రాక్షసో, రాహోర్వాః
పశ్చిమే నీలకం శనేః........"

ఈరీతిగా మిగిలిన నవరత్నాలతోపాటు, శని గ్రహ ప్రతికై, పశ్చిమాన్న నీలాన్ని ఉంచి' అంగరాగ్యభరణాన్ని నిర్మించి ధరించినవారికి సకలన్నీ తొలగిపోతవి.

గతి వ్యాసాల్లో వివరించినట్లు, ప్రపంచంలో కల్లా రత్నాలని ఉత్పత్తి చేయటంలో, 'సింహళం' పేరు మోసిన కాలు. ఈదేశం రత్నమయం. ఇచ్చట నీలాలు ఇతర రత్నాలతోపాటు, రత్ననిలయమైన, స్థానికంగా 'ఇల్లామ్' అని పిలువబడే భూమినుండి సంపాదిస్తారు. ఇది సింహళదేశ లోయల్లో సుమారు 6 మొదలు 30 అడుగుల లోతువరకూ ఆవరించుకొని ఉంటుంది. ఈ 'ఇల్లామ్'ను సంపాదించే విధానాన్ని, ఖనిజ శాస్త్రవేత్త లీవిధంగా వివరించారు

"ఇది దరిదాపు 30 అడుగుల లోతున ఉంటుంది. ఆలోతున కందకాలు త్రవ్వేటప్పుడు, మధ్యలో నున్న నీటిపొర అడ్డుతగిలి, అవి జలమయాలు ఐపోతూ ఉంటవి. అందువల్ల ఇల్లామ్‌ను, నీటితోసహా పైకి జొక్కానలతో లాగి శుభ్రపరచి, అందులోనుండి రత్నాలను సంపాదిస్తారు. ఒకవేళ, ఈ 'ఇల్లామ్' భూగర్భంలోని నీటిపొర పైభాగంలోనే లభించేటట్లయితే, దీనిని వేరుపరచటం మరింత సులభం.



బొంబై గవర్నర్ సర్ మహారాజ సింగ్ గారితో కలసి క్రికెట్ పోటీని తిలకించుచున్న గవర్నర్ జనరల్ రాజాజీ.

ఇది 'మొరపభూమి'లో లభిస్తే, కందకాలు త్రవ్వేటప్పుడు మట్టి అండలు విరిగిపడకుండా, చుట్టూ కర్రకూర్పు జేసుకుంటూ త్రవ్వుతారు. ఈ పద్ధతుల్లో సంపాదించిన 'ఇల్లామ్'ను దగ్గర నున్న కాలువల్లోకి తీసికొనివెళ్లి ప్రత్యేకమైన బుట్టల్లో కడిగి, రత్నాలను వేరుపరుస్తారు.

మిగిలిన రత్నాలతోపాటు, బాల్గుడా, రక్వానా, రత్నపురం మొదలైన ప్రాంతాల్లో నీలాల ఉత్పత్తి అధికం. ఇక్కడ లభించే నీలాలు సాధారణంగా 'భస్మనీలవర్ణం'లో ఉంటాయి. వీటిని కుంభాకారంలో సానపెట్టినపుడు, షట్కిరణనక్షత్రకాంతిని ప్రకాశింపజేస్తవి కాబట్టి వీటికి నక్షత్రనీలా (*Star Sapphires*) పేరు వచ్చింది.

నీలాలను ఉత్పత్తి చేయటంలో, కాశ్మీరు సంస్థానమూ ప్రసిద్ధి పొందింది. సూమ్‌జమ్ (*Soomjam*) వద్దనున్న నీలపుగనులు సముద్రమట్టానికి షుమారు 14,800 అడుగులమొదలు 14,950 అడుగుల ఎత్తున ఉండి దాదాపు రెండున్నర మైళ్ల పొడుగున ఆవరించుకొని ఉంటాయి. ఇక్కడ నిట్రమైన వాలుల్లో కందకాలు తీయించి, అందులోని గట్టి పదార్థాన్ని బయటికి తీస్తారు. ఈ ముడి పదార్థంలో కావలసిన, నీలమణి సంబంధమైన ఖనిజం నూటికి ఐదుపాళ్లుమాత్రమే ఉంటుంది. ఈ సంస్థానంలోని గనులు, అత్యున్నతస్థానంలో ఉండటంవల్ల, సంవత్సరానికి రెండుమాసాలు మాత్రమే ఈ పరిశ్రమ సాగుతుంది. కనుక ఈ రెండుమాసాలులోనే వీలైనంత ఖనిజాన్ని సంపాదించటానికి ప్రయత్నాలు చేస్తారు. ఈ సంస్థానంలో ఇంకా ఎన్నో గనులు భూగర్భంలో ఉండిపోయాయని, శాస్త్రజ్ఞులు అంచనా వేశారు. ఈ కాశ్మీర నీలాలు ఎక్కువగా ఆకాశవర్ణాలు. స్వాభావిక స్థితిలో, నీలస్ఫటికాలకు పైభాగాన్న, 'కియొలిన్' అనే ఖనిజపు సన్నని పొర ఉంటుంది.

భారతదేశంలో బీహారురాష్ట్రం, మాంభూమ్‌జిల్లాలోని, సాల్బనీ గ్రామంవద్ద, కియనైటుతో కలిసిన నీలమణి ఖనిజం లభిస్తుంది. ఈ గ్రామాని కిరువైపులా, మూడుమైళ్ల దూరం వరకూ, రెండుమూడడుగుల మందాన, ఈ సిరలున్నట్లుగా తెలుస్తుంది

ఒర్మాలోనూ నీలాలు లభిస్తవి. మిక్కిలిగా సున్నపురాయితో దొరుకుతవి. ఇవి ఒండ్రుమట్టిలోనూ లభిస్తవి. సయాంలోని నీలాలకు ఇసుక, రేగడిమట్టి నిలయస్థానం. ఇవి కెంపులతోపాటు, ఛాంట్‌బన్, కోట్‌రాష్ట్రాల్లో లభ్యమౌతాయి. సయామ్‌నందు లభించే నీలాలు, పరావర్తనమైన కాంతికి, నలుపుగా కనిపించే అంత ముదురురంగుగా ఉంటవి.

ఆస్ట్రేలియా, యునైటెడ్ స్టేట్సు, మాంటెనా, నార్తుకరోలినా, న్యూసౌత్‌వేల్సు, మెడగాస్కర్ మొదలైనవి కూడా నీలాలను ఉత్పత్తిచేసే దేశాలు. మాంటెనాలోని నీలాలు క్రీ. శ. 1865 కు పూర్వంనుంచి కూడ ఎక్కువ పరిమాణంలో ఉత్పత్తి చేసేవారు. గుండ్రని నీలస్ఫటికాలు, గార్నెటు మొదలైన ఖనిజాలతోపాటు లభిస్తుంది. మెడగాస్కర్‌లోని నీలాలు మంచి దట్టమైన రంగును కల్గిఉంటాయి. ఇవి గుండ్రని ఆకారంలో స్ఫటికత్వాన్ని చెందుతవి.

నీలాలను కృత్రిమంగా తయారుచేయటం, కెంపులు మొదలైనవాటంత సులభసాధ్యమైన పని కాదు. వేడిచేసినప్పుడు నీలవర్ణం నిలవకపోవటమే కారణం. సుప్రసిద్ధ శాస్త్రజ్ఞుడు, 'డెవిలీ' కృత్రిమంగా కెంపులను తయారుచేసేటప్పుడు, వాటిలో నీలపుమరకలు ఏర్పడినట్లు తెలిసికొన్నాడు. అవి క్రోమియం భస్మంవల్లనే నని మొదట్లో తలపోశాడు. కాని క్రోమియం భస్మంతో, నీలి రాళ్లను తయారుచేద్దామని ఎన్నిసార్లు ప్రయత్నించినా ఆ ఆశ నిరాశ అయింది. నీలిగాజు తయారుచేయటాని కుపయోగపడే, కోబాల్టిక్ భస్మంవల్ల కూడ సాధ్యపడలేదు. క్యాల్షియం భస్మం కలపటంవల్ల నీలాలు ఏర్పడినప్పటికీ, అవి మేలిరకపు రాళ్లు కాకపోవటమే లోటు. అంతటితో పరిశోధన లాగిపోయినవి.

తిరిగి 1909 లో వెర్న్యూల్ (*Verneuil*) లెవిన్ (*Levin*) అను ఇద్దరు శాస్త్రజ్ఞులు పునఃప్రారంభం చేశారు. వీరు ఈ మణుల్లో ఇనుము టైటానియం భస్మాల ఉనికివల్ల నీలి రంగు వచ్చిందని తలపోశారు. టైటానియం అనే ధాతువు భూభాగంలో ఎక్కువగా ఉంటుంది. ఈ ధాతువుయొక్క భస్మాలు, తెలుపునుండి నీలం ధూమ్రవర్ణాలకూగల వివిధరంగుల్లోనూ ఉంటవి. మొట్టమొదట, కురువిందంతోపాటు ఇనుము, టైటానియం భస్మాలను ద్రవీభూతం చేసినపుడు, అనుకొన్న నీలాలు లభించకపోగా ముదురు గులాబీ రంగురాళ్లు తయారైనవి. కాని చివరకు ద్రవీభూతం చేసేటటువంటి మిశ్రమంలో గనుక, ఇనుపభస్మాన్ని ఎక్కువ కలిపినప్పుడు నీలమణులు ఏర్పడ్డాయి. ఈ నీలమణులను సహజమణులనుండి గుర్తుపట్టటమనేది గొప్ప నేర్పరులకుకూడ సులభసాధ్యం కాలేదు. వీటి నిప్పుడు గడియారాలలో జ్యూయెల్సుగానూ, శాస్త్రపరిశోధన కుపయుక్తమయ్యేసున్నిత సాధనాలలోనూ ఉపయోగిస్తున్నారు.

అనాదికాలంనుంచీ సింహళం, కాశ్మీరులలో నీలాలు అనంతంగా లభ్యమౌతుండేవి. నేడు నీలాలను ఉత్పత్తి చేయటంలో ప్రాముఖ్యత వహించినవి ఈ రెండు దేశాలే. ఇది నవరత్నాల్లో ఒకటి కావటాన్న సనాతనులూ, అధునాతనులూ దీన్ని ఒక విశిష్టవస్తువుగా పరిగణించి, అలంకరణలో ఉపయోగిస్తున్నారు. ముఖ్యమైన సహజగుణాలు కఠినత్వం, సొగసుతనం, వీటికీ గుణాలుండటంవల్ల ప్రాచీనకవులు తమతమ సాహిత్యగ్రంథాల్లో పెక్కుచోట్ల వర్ణించారు. ఈ కఠినత్వధర్మంవల్ల వీనికి పెక్కు ప్రయోజనాలున్నవి. వీటితో ఏవస్తువుచేసినా సొగసుగా ఉంటుంది. విలువగల ఏవస్తువులో ఈ మణులను పొదిగినా చాల అందంగా ఉంటుంది. అందంనుండి ఆనందాన్ని పొందటమే మానవజీవితలక్ష్యం.

గ్రామ స్వయంపరిపాలనా విధానము

శ్రీ మండూరి పార్వతీశం

మనదేశంలో ఆర్థికదుస్థితి ఎంతవరకు ప్రబలిందో మన కందరికీ తెలిసిన విషయమే. ఈ ఆర్థికదుస్థితి మనకు కొన్ని శతాబ్దాలనుంచి పెరుగుతూవచ్చింది. గత యుద్ధంవలన ఇంకా హెచ్చింది. అంతేగాని ఈ యుద్ధంవలన ఒక్కసారిగా వచ్చిపడలేదు. ఈ యుద్ధకారణంగా నోట్లచెలామణి ఎక్కువయింది. ఉత్పత్తులు తగ్గటంవలన దిగుమతులు సరిగా లేనందున వస్తువుల ధరలు నాలుగైదురెట్లు పెరిగిపోయాయి. దీనితో ప్రజలు అనేకకష్టాలు పడవలసివచ్చింది. 1939వ సంవత్సరానికి పూర్వం ధరలు చాలా తక్కువగా ఉండేవి. కావలసినంత సరకు బజారునిండా ఉండేది. అయితే దరిద్రం అప్పుడూ అనుభవించాం. రూపాయికి 10 శేర్ల బియ్యం ఇస్తూఉంటే ఆ రూపాయి లేక అల్లాడిపోయాం. ఒక్కచీర రూపాయిన్నర అంటే కొనలేకపోయాం. బీదజనులు, సామాన్యప్రజ ఇప్పటివలనే అప్పుడుకూడా తిండికి, గుడ్డకు బాధపడ్డారు. దేశంలో దరిద్రదేవత తాండవమాడుతూనే వుంది.

ఈ యుద్ధంచేత కలిగిన అధికనోట్ల చెలామణి తగ్గినంతమాత్రంచేత, కంట్రోళ్లు అమలుజరిపినంతమాత్రంచేత, యుద్ధంరోజులలో కంటికి కనుపడని వస్తువులు దొరికినంతమాత్రంచేత దేశంలోని దారిద్ర్యం నశించదు.

అసలు మన ఈ ఆర్థికదుస్థితికి మూలకారణాలేమిటో ఆలోచిద్దాం. భారతదేశంలో పదిపండ్రెండు శతాబ్దాలకుపూర్వం రాజులు పరస్పరం తమలోతాము కలహించుకుంటూ యుద్ధాలతో సిరిసంపదలను నాశనం చెయ్యడం మొదలుపెట్టారు. భోగలాలసులైన రాజులు పరిపాలనా వ్యవస్థను నాశనంచేస్తూ వచ్చారు. వీటితో గ్రామాలలోను పట్టణాలలోను ఉంటూవచ్చిన ప్రజాపరిపాలనా విధానాలు అడుగంటిపోయాయి. నిరంకుశ ప్రభుత్వాలు ఏర్పడి ప్రజాపరిపాలనకు స్వస్తిచెప్పి ప్రజలను పీడించడం మొదలుపెట్టారు. ఈ ప్రభుత్వాలు బలహీనమైనవై, ప్రజామోదము లేనివై నిరంతరము కల్లోలములతోను పరరాజుల దండయాత్రలతోను అడుగంటిపోయేవి. ఈ విధంగా పాత ప్రభుత్వాలు పోయి క్రొత్తప్రభుత్వాలు ఏర్పడడం జరుగుతూ ఉండేవి. ఇటువంటి సమయములో విదేశరాజులు మన దేశం మీద దండయాత్రలు జేసి దేశమును ఆక్రమించుకొని, మన సిరిసంపదలను తమ దేశాలకు తరలించుకొనిపోయెడివారు. మన స్వదేశరాజులు తమలోతాము కలహించుకొని ఈ పరరాజుల సహాయాన్నికూడా అర్థించేవారు. దీనితో దేశము యొక్క పరిస్థితి తారుమారైపోయింది. దేశం అల్లకల్లోలమైపోయింది. ఆర్థికసంపద క్షీణించింది. ఇటువంటి పరిస్థితులలో తెల్లజాతివారు వర్తకానికి మనదేశం రావడం, దానితోపాటు మెల్లగా రాజ్యమంతా ఆక్రమించుకోవడం జరిగింది. భారతదేశంలో ఏ చిన్నభాగాలు తప్ప దేశం అంతా బ్రిటిషువారి పరిపాలనలోకి వచ్చింది. వీరు మనదేశంలో నిరంకుశ ప్రభుత్వమును సాగించి, ధనికవాదమును అమలుపరిచి, ద్విజాతి సిద్ధాంతమును పెంచి, పెద్దది జేసి దేశమును దారిద్ర్యావస్థలో ముంచి మన దేశమును మన కప్పగించిపోయారు. వీరి హయాములో కొనవూపిరితోనున్న గ్రామ స్వయంపరిపాలనా విధానాన్ని నామరూపములు లేకుండ జేసివేశారు. స్వదేశవృత్తులన్నిటిని నాశనముజేసి కొనవూపిరితో వదలిపెట్టారు. రత్నగర్భమైన మన భారతదేశానికి ఈ ఆర్థికదుస్థితి పట్టడానికివే మూలకారణాలు. మన స్వదేశీవృత్తులకు, మన పాడిపంటలకు ఉనికిపట్టు గ్రామసీమ.

ఎప్పుడైతే గ్రామాలలో ప్రజాపరిపాలన నశించిందో ఆనాడే మన వృత్తులన్నియు దెబ్బతిన్నాయి. పశుసంపద క్షీణించింది. వ్యవసాయం దెబ్బతిన్నది. మనదేశంలో చిరకాలమునుంచి రాజులు, చక్రవర్తులుంటున్నప్పటికీ గ్రామాలలో ప్రజాపరిపాలన ఉండేది. ప్రజలు తమతమ వృత్తులను స్వేచ్ఛగా జేసుకొని సుఖంగా జీవించేవారు.

భారతదేశంలోని జనాభాలో అధికసంఖ్యాకులు గ్రామాలలోనే ఉన్నారు. ఆహారఉత్పత్తి తదితర ఉత్పత్తులు ఎక్కువగా గ్రామాలలోనే జరుగుతూవున్నది. పెద్దఫ్యాక్టరీలు కర్మాగారాలలో ఉత్పత్తులు పట్టణాలనుంచి లభిస్తూ ఉన్నవి. మానవజీవితానికి నిత్యము అవసరమయ్యే ఉత్పత్తులు గ్రామాలనుంచే లభిస్తూ ఉన్నవి. ఇంత ఉత్పత్తిజేసే గ్రామాలలో ఎప్పుడైతే ప్రజాపరిపాలన పోయిందో ఆనాడే మన దేశంలో ఉత్పత్తులు క్షీణించాయి. చేతివృత్తులు పడిపోయాయి. ఆర్థికసంపద నశించింది.

తిరిగి మన గ్రామాలలోను, పట్టణములలోను ప్రజాపరిపాలన నెలకొల్పవలసియున్నది. ఈ ప్రజాపరిపాలన ఏవిధంగా నెలకొల్పవలెనో తెలుసుకుందాం.

రాష్ట్రశాసనసభ ఎన్నికలు కేంద్ర శాసనసభ ఎన్నికలు వయోజన వోటింగు మీద రాబోయే రాజ్యాంగ నిర్ణయ ప్రకారం జరుగుతుంది. ఈ ఎన్నికలలో వివిధ రాజకీయపక్షములవారు, స్వతంత్ర అభ్యర్థులు పాల్గొంటారు. గ్రామాలలోకూడ ఎన్నికలు వయోజన వోటింగు మీద జరగవచ్చు. కాని ఈ ఎన్నికలలో రాజకీయపక్షములుగాని స్వతంత్ర అభ్యర్థులుగాని పాల్గొనరాదు. ఏనాడైతే రైతు తన రైతు సోదరుల తరఫున ఎన్నుకోబడతాడో, ఏనాడైతే వడ్రంగి తనవడ్రంగి సోదరుల తరఫున ఎన్నుకోబడతాడో ఆనాడే నిజమైన స్వరాజ్యం మనదేశానికి వచ్చినట్లవుతుంది. ఆనాడే గ్రామ స్వరాజ్యం పూర్వపు ఔన్నత్యంతో విరాజిల్లుతుంది. గ్రామపంచాయతీలలోను మునిసిపాలిటీలలోను రాజకీయపక్షముల వారికిగాని స్వతంత్రులకు గాని జోక్యం లేకుండా ఉండాలి. ప్రస్తుతం పంచాయితి బోర్డులకు మునిసిపాలిటీలకు వార్డులవారిగా సభ్యులను ఎన్నుకొనేవిధానమును రద్దుజేసి వృత్తులవారిగా ప్రతినిధులను ఎన్నుకోవాలి. ఏ వృత్తివారికి ప్రతినిధిగా నిలబడదలచుకున్నాడో ఆ వ్యక్తి ఆ వృత్తిజేస్తూ ఉండాలి. అంగవికలుడుగా ఉండకూడదు. అతనికి ప్రాంతీయ భాషలో బాగా చదువను వ్రాయ గలశక్తి ఉండాలి. 25 ఏండ్ల వయస్సు కు పైబడినవాడుగా ఉండాలి. గ్రామంలో ఎన్ని ముఖ్యవృత్తులు ఉన్నవో అంతమంది ప్రతినిధులుండాలి. సాధారణంగా గ్రామాలలో అన్ని రకముల వృత్తులవారు ఉండరు. ఎక్కువగా వ్యవసాయదారులు, మిగిలిన వృత్తులవారు కొద్దిమంది మాత్రమే ఉంటారు. ఒక్కొక్క వృత్తికి రెండుమూడు కుటుంబాలు ఉంటాయి. పెద్దగ్రామాలయితే ప్రతివృత్తికీ అధికముగానే ఉంటారు. అలాగే పట్టణాలలో అన్నిరకముల వృత్తులవారుంటారు. ఆయా గ్రామాలలో ఒక్కొక్కవృత్తికి ఒక కుటుంబమువారున్నను సరే, ఆ వృత్తికి ప్రతినిధిగా ఆకుటుంబములోని వారు నిలబడవలసినదే. ఈవిధంగా వృత్తులవారీగానే ప్రతినిధులను పంచాయితీలకు ఎన్నుకుంటే ఆ గ్రామం స్వయంపోషక మవుతుంది. వ్యవసాయం, కూలీలు మొదలగు వృత్తులవారికి ప్రతినిధులు ఇద్దరు ముగ్గురు నలుగురువరకూ ఉండవచ్చు.

గ్రామపంచాయితీలు ప్రతి 1500 మంది జనాభాగల గ్రామానికి ఉండవలెను. 1500 మంది కన్న తక్కువగల గ్రామముంటే సమీపములోనున్న పంచాయితితో కలుపవచ్చు; లేక రెండు మూడు చిన్నగ్రామాలు సమీపములో ఉంటే వాటిని కలిపి ఒక పంచాయితీగా చేయవచ్చు. అందులో అనుకూలంగా నున్న గ్రామంలో పంచాయితీఆఫీసు పెట్టుకొనవచ్చు. అధ్యక్షపదవి ఒక్కొక్క గ్రామానికి వరుసగా లభించవలెను. ప్రతి 5 వేల జనాభాకు స్త్రీలకు ఒక స్థానము ఇవ్వవలెను. స్త్రీలు స్త్రీ అభ్యర్థినే ఎన్నుకొనేటట్లు చేయుట చాలా మంచిది. ఈ వృత్తులవారీగా ఎన్నుకోబడ్డ ప్రతినిధులంతా కలసి ఒక అధ్యక్షుణ్ణి ఒక ఉపాధ్యక్షుణ్ణికూడా ఎన్నుకుంటారు. ఈఅధ్యక్షపదవి ప్రతిసంవత్సరం ఒక్కొక్క వృత్తిప్రతినిధికి వరుసగా యివ్వాలి. మొదటి సంవత్సరం వ్యవసాయదారునికిస్తే రెండవ యేడు వడ్రంగికి, మూడవసంవత్సరం స్త్రీకి, నాల్గవసంవత్సరం ఉపాధ్యాయునికి, ఐదవసంవత్సరం చర్మకారునికి అధ్యక్షపదవి లభిస్తూ ఉండాలి. ఈ విధంగా ఒక్కొక్క వృత్తి వారికి వరుసగా అధ్యక్షస్థానం లభిస్తూ ఉంటే అన్ని వృత్తులవారికీ దేశంలో సమానగౌరవ ప్రపత్తులు ఉంటాయి. ఎక్కువ తక్కువలు కులమత విభేదాలు నశిస్తాయి. ప్రతి 5 సంవత్సరముల కొకసారి జనరలు ఎన్నికలు జరుగుచుండవలెను.

ఈ పంచాయితీసభవారికి ఆ గ్రామంలోని వర్తకం వ్యవసాయం మొదలగు అన్నివృత్తుల మీద అజమాయిషీ హక్కు ఉండాలి. ఆ గ్రామంలోని అన్నిరకముల నేరస్థులను పట్టుకొనే హక్కు, వారిని శిక్షించే హక్కు ఈ సభవారికి ఉండవలెను. గ్రామంలో వచ్చే వివిధ తగాయిదాలనుకూడా విచారించి తీర్పుచెప్పే హక్కుండవలెను. కూనీ, దొమ్మి మొదలగు నేరములను విచారించి ఆ తీర్పును మేజిస్ట్రేటు కోర్టులకు నివేదించవచ్చు. ఆ నేరస్థులను శిక్షించే హక్కుమాత్రం ఉండకూడదు. 300 రూ.ల వరకు దావాలను ఈ సభవారు విచారించి తీర్పు జెప్పవచ్చు. దీనిపై అప్పీలు జిల్లామునసబు కోర్టులో జేసుకోవచ్చు.

గ్రామసభలవారికి పన్నులను విధించే హక్కు ఉండవలెను. గ్రామకరణం, మునసబు ఈ సభల ఉద్యోగులుగానే ఉండవలెను. వీరు గ్రామసభవారు విధించిన పన్నులను వసూలుజేయవలెను. వీరుగాక గ్రామసభ ఆదాయాన్ననుసరించి ఒకరు లేక ఇద్దరు గుమస్తాలుండవలెను. ఇప్పుడు మేజర్ పంచాయితీలకు మునిసిపాలిటీలకు ఉంటున్న ఉద్యోగులంతా ఉండవలసినదే. పంచాయితీలకు ప్రభుత్వమిచ్చు గ్రాంటులుగాక ఆ గ్రామానికి అవసరమయ్యే కార్యాలయములను సంస్థలను నడుపుటకు అదనముగా ఆదాయము కావలసియున్నది. ఈ ఆదాయముకొరకు సభవారు ఈ దిగువవిధముగా పన్నులను విధించవచ్చును.

గ్రామపంచాయితీలవారు మేజర్ పంచాయితీలవలె ఇండ్లపన్ను తక్కువరేటులో విధించవచ్చు. ఆ పంచాయితీ లిమిట్సులో ఉత్పత్తి అయి అక్కడనుంచి ఎగుమతి అయ్యే సరకుల మీద ఎగుమతిపన్ను విధించవచ్చు. ఈ పంచాయితీలవారు వాటి లిమిట్సులో ఉత్పత్తిఅయి ఎగుమతిఅయ్యే సరకులమీదనే ఎగుమతిపన్ను విధించవలెను.

ఈ ఉత్పత్తులు ఆహార వాణిజ్యపంటలయినను ఏ కర్మాగారాలలోగాని, విడిగా వ్యక్తులు ఉత్పత్తిచేసిన వస్తువులయినను ముడిపదార్థములయినను సరె వాటిమీద ఎగుమతిపన్ను వేయవలయును. ఈ పన్ను ఉత్పత్తి జేసేవాని దగ్గర వసూలు జేయకూడదు. ఎగుమతిదారునిదగ్గరనుంచి వసూలుజేయవలెను. ఈ ఎగుమతిదారుడు పండించిన రైతయినను, కార్మికుడైనను వర్తకుడు అయినను సరే పన్ను వసూలు జేయవలెను. ఉత్పత్తిదారుడు ఉత్పత్తిజేసి అతనే ఎగుమతి జేస్తే ఎగుమతిదారుడుగూడా అతనే కాగలడు. అందుచే ఎగుమతి పన్ను ఎగుమతిజేసినవానిదగ్గర వసూలుజేసికొనుటకు పంచాయితీవారికి సర్వహక్కు లుండవలెను. ఈ ఎగుమతిపన్ను నెలకు నూరురూపాయిలు దాటిన వాటిమీదనే వసూలు జేయవలెను. ఈ ఎగుమతి పన్ను నూటికి ఒక రూపాయ వేయవచ్చును.

పన్నులు ఎగవేయకుండా చూసేబాధ్యత పంచాయితీవారిమీదనే గాక ఉత్పత్తిదారుని మీదకూడా వుండవలెను. ఉత్పత్తి ఎంతజరిగినదో, ఎంత ఎగుమతి అయినదో ప్రతినెల ఉత్పత్తిదారుడు గ్రామపంచాయితీవారికి నివేదించవలెను. ఎగుమతిదారుడు భిన్నమైన పేర్లతో వర్తకం సాగించి ఎగుమతిపన్ను ఎగవేయకుండ చూచుకొనవలెను. ఎగుమతిదారుడు ఏ గ్రామవాసియో ఆ గ్రామపంచాయితీవారు, ఏగ్రామంలో నిల్వజేసెనో ఆ గ్రామసభవారు (పంచాయితీవారు) కూడా ఎక్కడనుంచి ఎగుమతి జరుగుతున్నదో ఆ గ్రామ పంచాయితీవారికి సహాయపడుచుండవలెను. దిగుమతి పన్నులు విధించకూడదు. దిగుమతి పన్నులువేస్తే సామాన్యప్రజానీకమంతా బాధపడవలసివస్తుంది.

ఈ ఎగుమతిపన్నుతోను, ఇండ్లపన్నుతోను గ్రామపంచాయితీలు ఆ గ్రామాలకు ముఖ్యావసరమయ్యే కార్యాలయములను నడుపుకొనవచ్చును. ఈ ఎగుమతిపన్ను మేజర్ పంచాయితీలు, మునిసిపాలిటీలుగూడా విధించిన వాటికి తగిన ఆదాయము లభిస్తుంది. ఇప్పుడు నడపబడే కార్యాలయములకన్న అధికముగా నడపవచ్చు. ప్రజల జీవితావసరములను చాలాభాగము తీర్చవచ్చు.

భూమిశిస్తు వసూలుజేయుటకూడా ఈ గ్రామసభలవారి యాజమాన్యంక్రిందనే జరగాలి. అయితే భూమిశిస్తు రేట్లను నిర్ణయించే హక్కు రాష్ట్ర ప్రభుత్వములవారిదే. రాష్ట్ర ప్రభుత్వములు, కేంద్రప్రభుత్వమువారు విధించే రాబడి పన్ను మొదలగు పన్నులు వసూలుజేయుటలో కూడ ఈ పంచాయితీలవారు ప్రభుత్వమునకు తోడ్పడుచుండవలెను.

ఇప్పుడు ప్రస్తుతం వాడుకలోనున్న పంచాయితీలు, మేజర్ పంచాయితీలు, మునిసిపాలిటీల పేర్లను రద్దుజేసి, గ్రామసభలు, పట్టణసభలు, (*Village Councills and City Councills*) అని పిలిచిన చాలా బాగుంటుంది. నేను ఈ వ్యాసములో గ్రామపంచాయితీలు, గ్రామసభలు అనికూడా వాడినాను.

బాధ్యతగల వ్యక్తులు, స్వార్థపరులు గాని వారు, అధికారముకొరకు ప్రాకులాడనివారు ఈ సభలకు ప్రతినిధులుగా రావాలంటే ప్రతినిధులను వృత్తులవారీగానే ఎన్నుకొనవలెను. ఈ గ్రామసభలకు, పట్టణసభలకు ఒకేరకమైన అధికార ముండవలెను.

పదవీవ్యామోహపడితులు, అవకాశవాదులకు ఈ సభలలో స్థానము లేకుండా వుంటే ఈ కమీషనర్లకు, పంచాయతీ ఆఫీసర్లకు ఎక్కువ విశ్రమము లుండవు.

ప్రస్తుతం అమలులో ఉన్న డిస్ట్రిక్టుబోర్డులను రద్దుజేయవచ్చు. గ్రామసభలు పట్టణసభలు పైవిధంగా ఏర్పడడంతో ఈ డిస్ట్రిక్టుబోర్డులతో అంత అవసర ముండదు. ప్రస్తుతం ఈబోర్డులు నిర్వహించుచున్న సంస్థలను రాష్ట్రప్రభుత్వములే నిర్వహించవచ్చు. ప్రభుత్వమే నిర్వహిస్తే రాష్ట్రమంతా రహదారులు మొదలగు సౌకర్యములు ఒకేస్థాయిలో ఉండగలవు.

ప్రతిగ్రామసభ (పంచాయతీ) ఒక ప్రాథమిక పాఠశాల, ఒక వైద్యాలయం, ఋణముల నిచ్చుటకు ఒక కోపరేటివ్ బ్యాంకు, ఒక కోపరేటివ్ స్టోర్సు, ఒక గ్రంథాలయం, ఒక తపాలాఫీసు విధిగా నడపవలెను. గ్రామాన్ననుసరించి ఇంకా ఎక్కువ ఉండవచ్చును. వీటికయ్యే ఖర్చు ఆగ్రామసభయే భరించవలెను. ఒక తపాలాఫీసు ఖర్చుమాత్రం కేంద్రప్రభుత్వానిదే. ఇంకా పంచాయితీయొక్క ఆదాయాన్నిబట్టి ఎక్కువ సంస్థలను నడుపుకొనవచ్చును.

ఈగ్రామసభల ప్రతినిధులు ప్రతి 15 రోజుల కొకసారి సమావేశమవుతూ ఉండవలెను. సభ

నేటి ప్రపంచం

"నైర్రృతి ఆఫ్రికాను దక్షిణాఫ్రికా యూనియన్‌లో కలుపుకొని తీరుతాము. ఆరు నూరైనా నూరు ఆరైనా దాన్ని అంతర్జాతీయ ధర్మకర్తృత్వం కిందికి మార్చడానికి ఒప్పుకొనేదిలేదు. నైర్రృతి ఆఫ్రికాను అంతర్జాతీయ ధర్మకర్తృత్వం కిందికి మార్చడమే సంభవిస్తే, ఐక్యరాజ్యసమితినుంచి తప్పుకోనైనా తప్పు కుంటాముగాని చూస్తూ వూరుకోము" అని దక్షిణాఫ్రికాప్రధాని డా. మలాన్ హెచ్చరిక చేశాడని వార్త.

ఐక్యరాజ్యసమితి ధర్మకర్తృత్వ సంఘం నైర్రృతి ఆఫ్రికాసమస్యమీద ఇటీవల రెండు వారాలుగా విపరీతమైన తర్జన భర్జన చేసింది. భారతప్రతినిధివర్గనాయకురాలు శ్రీమతి విజయలక్ష్మి ప్రధానపాత్రను నిర్వహించిందిగాని, కొన్ని రాజ్యాలు తగినంత పట్టుదలను చూపక పోవడంవల్ల భారతప్రతినిధివర్గ కృషి పూర్తిగా ఫలించలేదు. నైర్రృతి ఆఫ్రికాను నాజీనియంత పద్ధతిలో కబళించివేయడానికి దక్షిణాఫ్రికా ప్రభుత్వం పన్నిన కుతంత్రాన్ని సమితి అరికట్ట లేక నిరుపయోగమైన ఒక తీర్మానాన్ని మాత్రం ఆమోదించి వూరుకున్నది.

"నైర్రృతి ఆఫ్రికాసమస్యపై ధర్మకర్తృత్వ సంఘ అభిప్రాయాలను సమితి గమనించింది. దక్షిణాఫ్రికాప్రభుత్వానికి ఈ కింది విషయాలు తెలియజేయవలసిందని ప్రధాన కార్యదర్శిని సమితి ఆదేశిస్తున్నది. 1946 డిసెంబరు 14 న, 1947నవంబరు 1 న నైర్రృతి ఆఫ్రికాను ధర్మకర్తృత్వం కిందికి మార్చడం అవసరమని చేసిన సిఫార్సులనే సమితి నేటికీ పునరుద్ఘాటిస్తున్నది. ఈ సిఫార్సులను దక్షిణాఫ్రికా ప్రభుత్వం పాటించనందుకు సమితి విచారాన్ని ప్రకటిస్తున్నది...నైర్రృతి ఆఫ్రికాకు తమకూ సన్నిహిత సంబంధాలను ఏర్పాటుచేసుకోవడమే తమ ఉద్దేశమనీ, దాన్ని కబళించమనీ దక్షిణాఫ్రికా ప్రతినిధి ఇస్తున్న హామీని సమితి దృష్టిలో వుంచుకుంటుంది...ఒక ఒప్పందానికి వచ్చేవరకూ ప్రతిసంవత్సరమూ నైర్రృతిఆఫ్రికా పరిపాలనను గురించి దక్షిణాఫ్రికా నివేదికలను సమర్పిస్తుండాలి. ధర్మకర్తృత్వ సంఘం ఈ వార్షిక నివేదికలను పరిశీలించి తన అభిప్రాయాలను సమితికి తెలుపుతుండాలి" అని మాత్రమే ఈ తీర్మానంలో వున్నది.

నైర్రృతి ఆఫ్రికాను తమ భూభాగంలో కలిపివేసుకోడానికి డా॥ మలాన్ ప్రభుత్వం సాగిస్తున్న కార్యకలాపాన్ని కట్టిపెట్టాలనీ, ఐక్యరాజ్యసమితి నైర్రృతి ఆఫ్రికా పరిస్థితిని పరిశీలించడానికి ప్రత్యేక విచారణ సంఘాన్ని పంపాలనీ భారత ప్రతినిధివర్గం ప్రతిపాదించిన సవరణ ధర్మకర్తృత్వ సంఘంలో 22 వోట్లు ప్రతికూలంగానూ, 21 వోట్లు అనుకూలంగానూ వచ్చి వీగిపోయింది. పదకొండు రాజ్యాల ప్రతినిధులు తటస్థంగా వుండి వోట్లే ఇవ్వలేదు.

భారతదేశ ప్రతినిధివర్గం ప్రతిపాదించిన సవరణలను చర్చ సందర్భంలో బలపరచిన ప్రబుద్ధులే కొందరు వోటింగులో పాల్గొనలేదు. "మా సవరణలు వీగిపోయినందుకు మేమేమీ లెక్క చేయడంలేదు. వీటిని బలపరుస్తామని మాటఇచ్చిన వారే వోటింగులో పాల్గొనలేదు. చాలామంది తటస్థంగాకూడా వుండిపోయినారు. నైర్రృతి ఆఫ్రికా భవిష్యత్తు విషయంలో భారతదేశం ఎంత ఆతృత కనబరుస్తున్నదో, ఈ తటస్థంగా వున్న దేశాలూ అంతే ఆతృత చూపుతున్నవని మాకు తెలుసు," అని శ్రీమతి విజయలక్ష్మి వ్యాఖ్యానించింది. ప్రజల స్వాతంత్ర్యం విషయంలోనూ, వర్ణజాతుల హక్కుల విషయం లోనూ సమితి అరకొర అందని పోకడ పొందని వైఖరిని అవలంబించి లాభం లేదని కూడా ఆమె హెచ్చరిక చేసింది.

మొత్తంమీద నైర్రృతిఆఫ్రికా సమస్యపై జరిగిన చర్చ సారాంశం ఫలితంగా ఐక్యరాజ్య సమితి దక్షిణాఫ్రికా మొండి వైఖరికి, ధిక్కార విధానానికి మరోకసారి లొంగిపోయిందనే స్పష్టంగా చెప్పవలసివుంటుంది. దక్షిణాఫ్రికా సమితినుండి వైదొలగుతుందేమోననే భయంకొద్దీ ధర్మకర్తృత్వసంఘం ఇంత నిరర్థక తీర్మానాన్ని చేసివుంటుంది. ఇందువల్ల సమితి అసామర్థ్యం ప్రపంచానికి మరోకసారి తేటతెల్లమైంది.

దక్షిణాఫ్రికా ప్రభుత్వం భారతీయ సమస్యపై ఎంత మొండిపట్టుదలను చూపుతున్నదో, నైర్రృతి ఆఫ్రికాను ధర్మకర్తృత్వాధిపత్యం కిందికి మార్చకుండా వుండడంలోనూ అంతే మంకు పట్టు పట్టుతున్నది. ఈసారి సమితి సర్వసభ్య సమావేశం వచ్చేలోపుగా నైర్రృతి ఆఫ్రికాను అంతర్లీనంచేసుకొని తీరుతుంది. బ్రిటన్, ఫ్రాన్సు, హాలెండు, మొదలైన సామ్రాజ్య దేశాలు దృఢవైఖరిని చూపనందువల్లనే వాటి అండ చూసుకునే దక్షిణాఫ్రికా ప్రభుత్వం ఈఫాసిస్టు ధోరణిలో ప్రవర్తిస్తున్నది. ఐక్యరాజ్యసమితి ఎంతటి ఉత్తమ ఆదర్శాలతో ఉద్భవించినప్పటికీ అది కొన్ని అగ్రరాజ్యాల చెప్పుచేతల క్రిందమాత్రమే పనిచేస్తున్నదని విస్పష్టమైంది.

* * *

పాలస్తీనాలో యూదు అరబ్ యుద్ధవిరమణను సాధించడానికి తాత్కాలిక మధ్యవర్తి రాల్ఫ్ బంచ్ కొత్తప్రతిపాదనలు చేశాడు. ఈ ప్రతిపాదనలప్రకారం దక్షిణ పాలస్తీనాలోని నెగెవ్ ప్రాంతానికి కేంద్రస్థానమైన బీర్ షిబా అరబ్ పట్టణమవుతుంది. ఇది ఒక ఈజిప్షన్ అధికారి పరిపాలనలో వుంటుంది. ఈపథకం ప్రకారం యూదు అరబ్ సేనలమధ్య కొంత తాటస్థ్య భూభాగం ఏర్పడుతుంది. శాంతికి భంగం రాకుండా క్రమమైన పద్ధతిలో ఉభయపక్షాల సైనికఉపసంహారానికి కూడా బంచ్ ప్రతిపాదనలు అవకాశం కలిగిస్తున్నవట.

బీర్ షిబా పట్టణాన్ని తాము కేవలం ఆయుధ బలంచేత ఆక్రమించామనీ, దాన్ని అరబ్బులకు వదలివేయడం అసంభవమనీ, రాల్ఫ్ బంచ్ ఈ విధంగా సంధి ప్రతిపాదనలుచేయడం చాలా ఆశ్చర్యకరంగా వున్నదనీ యూదుప్రభుత్వ విదేశశాఖ విమర్శించింది. వాస్తవానికి నెగెవ్ ప్రాంతమంతా యూదులు ఆయుధబలంచేత ఆక్రమించిందే. పైగా, ఈ ప్రాంతాన్ని ఐక్యరాజ్య సమితి 1947 నవంబరు 29 న ఆమోదించిన తీర్మానంద్వారా యూదుభూభాగంలోనే చేర్పించింది.

తాత్కాలిక మధ్యవర్తి ప్రతిపాదనలను అరబ్బులు బేషరతుగా ఆమోదించినా, కొన్ని షరతులు పెట్టందే యూదులు ఆమోదించేటట్లు లేరు. ఐక్యరాజ్యసమితి పరిశీలకులు దాదాపు 60 మంది మధ్యవర్తి ప్రతిపాదనల అమలుకై శ్రద్ధ వహించి పనిచేస్తున్నారు. నెగెవ్ ప్రాంతంలో ప్రధాన కూడలిఅయిన బీర్ షిబా కేంద్రాన్ని వదలివేసే ఉద్దేశం యూదులకు లేదు. పెద్దపెట్టున దండయాత్ర జరిపి దక్షిణ పాలస్తీనా అంతటినీ ఒక్క దెబ్బలో ఆక్రమించివేయాలని ఆరబ్ సేనలు—ముఖ్యంగా ఈజిప్షన్ సేనలు—పన్నిన వ్యూహం విఫలమైంది. వివిధ అరబ్ దేశాల బలాలు కలసి పనిచేసినా యుద్ధరంగంలో యూదుసేనల ధాటికి తట్టుకోలేకపోయినవి. యుద్ధంలో నేటికీ యూదులదే పైచెయ్యిగా వున్నది. యుద్ధంలో ఈ విజయాలు అరబ్ సేనలకే లభ్యమై వుంటే, తామాక్రమించిన ప్రాంతాన్ని ఖాళీచేయడానికి అరబ్ రాజ్యాలు సమ్మతించేవా అన్నది పెద్ద సందేహమే.

యుద్ధంలో విజయపరంపరను సాధిస్తున్నప్పటికీ, అరబ్ రాజ్యాలతో సంప్రతింపులద్వారా శాంతియుత పరిష్కారానికి ఇజ్రాయిల్ ప్రభుత్వం సిద్ధంగానే వున్నది. ఐతే, యూదులతో ముఖాముఖి చర్చలు జరిపితే, 'ఇజ్రాయిల్' రాజ్యస్థాపనను ఎక్కడ అంగీకరించినట్లవుతుందోనని అరబ్బులు భయపడుతున్నారు.

పాలస్తీనా భవిష్యత్తువిషయంలో వాస్తవానికి అరబ్ రాజ్యాలలోనే పెద్ద చీలిక ఏర్పడింది. సమితి చర్చలలో బ్రిటన్ అరబ్ రాజ్యాలనే బాహాటంగా బలపరచడంకూడా జరుగుతున్నది.

భద్రతామండలి పాలస్తీనా సమస్యను చర్చించి యూదు అరబ్ పక్షాలు తక్షణమే శాశ్వతశాంతి స్థాపనకై ప్రత్యక్ష సంప్రతింపులు జరుపుకోవాలని ఆదేశించింది. యూదు అరబ్ సేనలు సంఖ్యాబలాన్ని తగ్గించుకోవడం అవసరమనీ స్థిరపరిష్కారము చేసుకోవాలనీ కెనడా, బెల్జియం, ఫ్రాన్సుదేశాలు ప్రతిపాదించిన తీర్మానాన్ని మండలి ఆమోదిస్తూ ఈ ఆదేశాన్ని ఇచ్చింది ముఖాముఖి చర్చలకు తామేమాత్రం సమ్మతించేది లేదని ఈజిప్టు, సిరియా, లెబనాన్ దేశాలు వాదించినవి. యూదుసేనలు తమ పాత స్థానాలకు ఉపసంహారం సాగించేవరకు భద్రతామండలిఆదేశాన్ని పాటించజాలమని లెబనాన్ ప్రతినిధి స్పష్టపరిచాడు. పాలస్తీనా విభజన ఖాయపడినట్లేననీ, యూదురాజ్యాన్ని తుడిచివేయడం అసంభవమనీ సమితి వాదిస్తూంటే, విభజనను తామెన్నడూ ఆమోదించలేదనీ, యూదురాజ్యం ఒకటి వున్నంతవరకూ ప్రత్యక్ష రాయబారాలు అసంభవమనీ అరబ్ రాజ్యాలు ఖండితంగా చెబుతున్నవి.

అరబ్ పాలస్తీనా అంతటినీ ట్రాన్స్ జోర్డాన్‌కు కట్టపెట్టడం మంచిదని బ్రిటిష్ ప్రతినిధి సమితి రాజకీయ సంఘంలో మరొక ప్రతిపాదన చేశాడు. కీ॥ శే॥ బెర్నాడోట్ పథకాన్ని అమలుపరచడానికి త్రైరాజ్యరాయబారసంఘాన్ని నియమించాలనికూడా బ్రిటన్ సూచించింది. అరబ్ పాలస్తీనా స్వతంత్ర రాజ్యంగా మాత్రమే వుండాలిగాని, ట్రాన్స్ జోర్డాన్‌తో కలిపివేయడానికి వీల్లేదనీ, దాన్ని కలిపివేస్తే తమ పొరుగున తమకంటే ఎక్కువ శక్తిసామర్థ్యాలుగల అరబ్ దేశం ఏర్పడి, తమ భవిష్యత్తుకు ముప్పు వాటిల్లుతుందనీ యూదులు ఖండిస్తున్నారు.

పాలస్తీనా సమస్యపై సమితి సంఘాలన్నీ ఒక నిర్దిష్ట విధానాన్ని అనుసరించలేక కిందా మీదా పడుతుంటే, అధ్యక్షుఎన్నిక పూర్తి అయినప్పటికీ, అమెరికా ఈవిషయంలో ఇదమిత్థమని సూచన లేవీ చేయడం లేదు. కౌంట్ బెర్నాడోట్ ఇదివరలో ప్రతిపాదించిన సంధి పథకం పట్ల అమెరికావైఖరి ఇంతవరకూ స్పష్టపడనేలేదు.

ఇంతకూ యూదు అరబ్ పక్షాలు తాత్కాలిక మధ్యవర్తి ప్రతిపాదనలకు సంపూర్తిగా సమ్మతించక యథాప్రకారం యుద్ధమే కొనసాగిస్తే, తాడూ బొంగరమూ లేకుండా ఆట ఆడుతున్న ఐక్యరాజ్యసమితి ఏమిచేయగలదన్నదే సందేహం. శాంతిరక్షణకు వివిధదేశాల సైనిక, పోలీసు సహాయాన్ని కోరడానికి సమితి ప్రణాళిక సమ్మతిస్తున్నమాట నిజమే. కాని, ఈ విధంగా సమితి ఏదేశాల సైనిక సహాయాన్ని కోరుతుంది? రష్యా సహాయాన్ని కోరుతుందా? ఈ పరిస్థితులలో పాలస్తీనా సమస్యను ప్రపంచ శాంతికి భంగకరంగాని ధోరణిలో సమితి ఏవిధంగా పరిష్కరించగలదో ఊహించుకోవాల్సిందే.

ఐక్యరాజ్యసమితి ఇప్పటివరకూ ఏ అంతర్జాతీయసమస్యనూ యుక్తియుక్తంగాగాని, సామర్థ్యంతోగాని, సామరస్యంతోగాని పరిష్కరించలేకపోయిన దనడానికి పాలస్తీనాసమస్య మరొక ప్రబలనిదర్శనం.

వారు నిర్ణయించే నిర్ణయములన్నియు మూడింట రెండువోట్ల మెజారిటితోనే నెగ్గుతూ ఉండవలయును. ఈ గ్రామసభలలో x లుగు ప్రతిష్టంభన మొదలగున వన్నియు రాష్ట్రప్రభుత్వమే తీర్చవలయును. అధ్యక్షుడు సభానిర్ణయమునకు వ్యతిరేకముగా ప్రవర్తించినను, అధికారమును దుర్వినియోగము జేసినను, రాష్ట్రప్రభుత్వమే శిక్షించవలెను. (సశేషము)

పరమానందాయ్

(7 వ పేజీ తరువాయి)

పరమాయి ఇంటి కెళ్లాడు. ముల్లరమ్మ పరమాయిని చూసేటప్పటికి దెయ్యాన్ని చూసినట్లు కొయ్యబారి నిలబడిపోయింది. తర్వాత తేరుకొని, అతనికి ఉపచారాలు అన్నీ సక్రమంగా చేయటం మొదలుపెట్టింది. "మీ రిప్పట్లో మళ్లీ బైటపడి వస్తారనుకోలేదండయ్యా. అందుకనే మిమ్మల్ని చూసేటప్పటికి అల్లా కొయ్యబారి, పోయాను.

"మీరు లేనప్పుడు పోలీసులు వచ్చి ఇల్లంతా, గోలగోలచేసి పోయారండి. సోదా అని చెప్పి నానా హంగామా చేశారండి. ఆ నాడావుడిలోనే అ ఉన్న కుక్కలు పారిపోయాయండి." అంటూ క్షేమసమాచారాలు తెల్పింది ముల్లరమ్మ.

"అరిదేవుడా! ఈపోలీసులతో బలే చావొచ్చి పడ్డది ముల్లరమ్మా. ఇక కుక్కల బేరానికి మన దగ్గరకు ఎవరొస్తారు చెప్పు." అంటూ సావధానంగా అన్నాడు పరమాయి.

బ్రెష్నిడీర్ పరమాయి దగ్గిర ఐదారు కుక్కలదాకా కొన్నాడుగాని, అధికారులకు కావలసిన రహస్యం ఒక్కటీ కూడా కూపేతీయలేక పోయాడు. అప్పటి పోలీసు రికార్డు ఎవళ్లన్నా తిరగేస్తే, "కే—50 రూ" "వే—60 రూ" అంటూ పొడి అక్షరాలూ అంకెలూ కనబడ్తాయి. అవి పోలీసులకు కూపీలందిచ్చిన, దేశభక్తుల కిచ్చిన సొమ్ము అనుకొనేరు, కాదు—పరమాయి కిచ్చిన కుక్కల ధరలు. బ్రెష్నిడీర్ తర్వాత ఇంకో డిటెక్టివ్ కూడా పరమాయిపై పరిశోధన సాగించాడు. పరమాయికి మరినాల్లు కుక్కల బేరం వృద్ధి పొందింది. దాంతో పోలీసులు కుక్కలబేరం మానుకొన్నారు.

స్తోత్రపాఠం

(10 వ పేజీ తరువాయి)

'ముగ్గులోకి దించాలెనో' సిద్ధహస్తులైన స్తోత్రపాఠకులు ఎరుగుదురు. 'స్తుతిపాఠమంటే నాకు ఇష్టంలేదని ప్రకటింపగోరుతున్న వ్యక్తి భంగ్యంతరంగా జానిని కోరుతున్నాడన్నమాట. వెంటనే ఓ జగజ్జెట్టి స్తోత్రపాఠకుడు అతని దర్శనం చేసి 'మహాప్రభో! మీకు స్తోత్రపాఠమలంటే సుతరామూ ఇష్టంలేదు; వానికీ మీకూ ధ్రువాల కున్నంత దూరం' అని చిలవలు పలవలుగావర్ణించి అతగాడికి 'స్తోత్రపాఠవరూధినీ ప్రవర' అని ఒక నాతిదీర్ఘమైన బిరుదం పారేసి పని సార్థాచేసుకొని వస్తుంటాడు. లోకంలో ఈవిధంగా స్తుతిపాఠ మంటే గిట్టని వాళ్లకు నేటి స్తుతిపాఠవిధానం గిట్టటంలేదన్నమాట. అంతే. వారు ఆకాంక్షించే నమ్రత ఆకలోపాసకులలో కనిపిస్తే ముందుగా వీరే చేతు లెత్తి జోహారు లర్పిస్తారు.

మూర్ఖుడు సర్వసామాన్యంగా తన్ను పొగుడుకుంటాడు. తెలివిగలవాడు సహచరులను పొగుడుతాడు. అంతవాళ్లకు మిత్రుడనైన నేనెంతవాణ్ణో గ్రహించమని ఎదటివాడికి వ్యంగ్యగర్భితంగా చెపుతాడు. 'ఇద్దరు స్తోత్రపాఠకులు ఒకచోట చేరితే వాక్పిశాచాలు విందుచేసుకుంట' వన్నాడు ఓతాత్వికుడు. నిజమే. ఇరువురి నాలుకలూ 'తేనెపూసినకత్తులై' వాక్ప్రపంచం మీద జైత్రయాత్ర సాగిస్తవి.

స్తోత్రపాఠాలల్లో కల్లా ఉత్తమోత్తమమైనది అవతల వ్యక్తి చెప్పే విషయాన్ని ఔను, కాదనకుండా శిష్యభావంతో వినటమే. ఈసూక్ష్మం గ్రహించినవాడికి ప్రపంచవిజయం సంభవిస్తుంది. సర్వకార్యార్థాలూ కరతలామలకాలౌతవి. వీరు మాటల పెట్టుబడితో విశేష లాభాలు గడించే కాపిటలిష్టులు. వీళ్లు పొందే లాభాలకు ఏప్రభుత్వమూ అంచనా వేయించలేదు ఇందులోనూ అక్కడక్కడా 'నల్లబజారు' వ్యాపారాలు గోచరిస్తూ ఉంటవి.

స్తోత్రపాఠం ఓ వ్యసనం. అతి అనారోగ్యకరమైన వ్యసనం. కల్లు, సారాయి, మొదలైన మత్తు పదార్థాలవలెనే దానివల్ల కొన్ని ఔషధ సంబంధమైన ప్రయోజనాలు ఉన్నవని కొందరు వాదించినా వ్యసన మని అంగీకరించక తప్పని వ్యసనం. అయితే ఏం ప్రయోజనం? బాల్య

సత్యాగ్రహం

(11 వ పేజీ తరువాయి)

విక్రమార్కుడి గద్దెమీద కూర్చునేసరికల్లా కర్మదృష్టి పుట్టుకొనివచ్చినట్లుగా, తనకుర్చీలో కూర్చునేసరికల్లా కామేశ్వర రావుకి ఎప్పటి సత్యాగ్రహం అంతా ముంచుకొనివచ్చింది.

న్యాయంగా తాను ఆగ్రహం ప్రదర్శించవలసిన పరిస్థితిలో ఆ సావకాశాన్ని వెంకట్రామయ్యగారు వినియోగించుకోవడమా అని అతని ఆక్రోశం. సరే, తన సంబంధంకంటె గొప్పది వచ్చినప్పుడు మాట తిరగడానికి మొగమాటంలేకపోతే చేసుకోనీ; తన కేం అంతమాత్రంలో పెద్ద నష్టం లేదు. కాని ఈ రకపు నీలాపనిందలు వేస్తాడా? తన ప్రవర్తన బాగు లేదట—ఏమిటి చూసి అనగలిగేడో ఆ మాట. అందువల్లనే వేరే సంబంధం వెతుక్కోవలసివచ్చిందట. ఛ! ఇంతకంటె దురన్యాయం ఏముంటుంది? నిన్న రాత్రి ఉత్తరం అందిన తరువాత, తాను అంతటి కోపంలో సయితం అటువంటి ప్రవాదపు మాటలు తన ఉత్తరంలో (పోస్టుచెయ్యక పోతే నేం) రాయదలచుకోలేదే. కావాలంటే ఇటువంటివి తాను మాత్రం సృష్టించలేడా? సృష్టించడం ఏమి కర్మం కాంతం తనకు లోగడ రాసిన ఉత్తరాలు ఆ కాబోయే పెళ్ళికొడుక్కి చూపించి, పెళ్ళిఅనేది కేవలం ఒక లాంఛనంగా మాత్రమే జరగవలసినంతవరకూ తమ స్నేహం వెళ్ళిందంటే—ఏ మర్యాదస్థుడు పెళ్ళిచేసుకుంటాడు. తనమీద వాళ్లు అనవసరంగా నీలాపనిందలు మోపినప్పుడు, తానుమాత్రం అటువంటిపని ఏల చెయ్యకూడదూ? ఛా! చేయగలిగితే మాత్రం, అది తన గొప్పదనానికి లోపం కాదూ? పైగా అసమగ్రుడెవడో ఈ సంబంధం తప్పిపోయిందన్న దుఃఖంతో తానిలా చేస్తున్నట్లుగా భ్రమపడినా పడవచ్చును. మరెందుకు అడుసు తొక్కడం, కాలు కడగడమున్నూ? ఇంతకీ తాను సాధించగలిగితే వెంకట్రామయ్యగారిమీద పగ సాధించాలిగాని, కాంతానికి మాత్రం అన్యాయం చెయ్యకూడదు పాపం. ఆ తిమ్మాయికేం తెలుసును—తల్లీ తండ్రీ ఎంత చెప్తే అంత

అయితే, యిప్పుడు తను ఉత్తరం రాయడమా, మానడమా? అదీ సందేహం! తనకీ ఉత్తరం అందే లోపునే పోస్టుచేసి ఉంటే ఎంత బాగుండును? మరి గతజలసేతుబంధనం లాభం లేదు. చిట్టచివరకి అతని మనస్సు ఒక ధర్మసూక్ష్మాన్ని ఆలోచించింది. ఉత్తరం తనకు సాయంత్రం, అంటే మూడుగంటలవేళప్పుడు కదా అందింది. ఇప్పటివరకూ తన కిది వస్తుందని తెలియదుకదా. తన ఉత్తరం ఉదయమో, నిన్ననో పోస్టు చేసిఉంటే—అలాగే ఇప్పుడు చెయ్యవచ్చును. నిన్నటి తారీఖే వేస్తాను. ఇంతలో మించిపోయిందేమిటీ—అని నిబ్బరపడి, ఉత్తరం రాసి సొంతంచేశాడు. కాని, తీరా పూర్తి అయినతరువాత కవరులో పెడుతూఉండగా మనస్సు మారిపోయింది. వెంకట్రామయ్యగారి ఉత్తరమూ తన ఉత్తరమూ కలిపి, వీలయినంత చిన్నచిన్న ముక్కలుగా చించి చిత్తుకాగితాల బుట్టలో పారేశాడు సత్యాగ్రహి కామేశ్వరరావు.

అక్కడితో ఈ పాతసంగతులన్నీ మరిచిపోవాలనీ, సరోజినీ, వాళ్ళ అక్కయ్య అభిమానాన్ని సర్వథా శక్తి వంచనలేకుండా సంపాదించాలనీ నిశ్చయానికి వచ్చేడు కామేశ్వరరావు.

కాని, తగిలిన కాలికే దెబ్బతిగులుతుం దన్నట్లు గోరుచుట్టుమీద రోకటిపోటన్నట్లు, తానొకటి తలుస్తే దైవమొకటి తలుస్తుం దన్నట్లు పాపం, ఆ సాయంత్రం ఇంకొక వార్త వినవలసి వచ్చింది.

తానీ రెండురోజులాయి పేపరు చూడడమే లేదు. సరోజినికి లెక్కలలో క్లాసువచ్చిందట- 'నిజంగా మీమేలు మరిచిపోలేను. ఆ రెండు నెల్లూ చెప్పినందుకు మీకు నూర్రూపాయిలు ట్యూషను ఫీజుఇచ్చినా ఇవ్వవచ్చు'నంది వాళ్ళక్కయ్య. అంతవరకూ సవ్యంగానే ఉంది..

'ఏమయినా, అది మరి తిన్నగా చదివేటట్లులేదు. అందుచేత పెళ్ళిచెయ్యాలనుకున్నాను. సరిఅయిన సంబంధం కూడా కుదిరింది. వచ్చే నెలలో పెళ్లి. మీ పెళ్లికూడా అప్పుడే కాబోలు—కాని, ముహూర్త భేదం ఉంటే మాత్రం తప్పకమీరు రావాలి సుమండి!" అంది ఆవిడ. అప్పట్లో కూలిపోకుండా, "అలాగే తప్పకుండా వస్తానండీ, ఇంకా నా పెళ్లి ముహూర్తము సరిగా నిశ్చయంకాలేదు" అని ఎలాగ అనగలిగేడో అతనికే తెలియదు.

ఆ తరువాత ఇరవై రోజులూ మనస్సు సరిగా పనిచెయ్యక పోయినా, నిత్యకృత్యంలో ఎటువంటి లోటుపాట్లూ లేకుండా అతను నిర్వహించుకొని రావడం విశేషమే! మరీమరీ పెళ్లిళ్ల ముహూర్తాలు దగ్గరకి వస్తున్నకొద్దీ, అతనికి తనమీద తనకే నమ్మకంలేకుండా పోతున్నది సన్నాయివాద్యాల నొక్కులూ, బాండుమేళాల పటాటోపమూ వింటున్నకొద్దీ అతనికి ఇంత ప్రపంచంలోనూ తానెక్కడో ఒంటరిగానున్నమని పనిపించసాగింది. ఆముక్తవల్లా అందరు పెళ్లికుమార్తెల తండ్రులు వచ్చేవారు. ఇప్పుడొక్కడూ రాడేం? తానెవ్వరికీ అక్కరలేని ఎందుకూ కొరగానివాడయిపోయాడా?. నిరుత్సాహానికి వేరే దోహదం అక్కరలేదు. తనను తానే ఉపయోగించుకొని అభివృద్ధిపొందగలదు.

ఉదయం ఇంకా మంచంమీదనే కూర్చుని, రాత్రల్లా కంటిమీద కునుకులేదు, ఆఫీసుకి వెళ్లి పని చెయ్యడం కష్టం, ఉన్న ఒక్కరోజూ కాజువల్ లీవు పెట్టెయ్యాలనుకొంటూ ఉండగా వచ్చిపడ్డాడు వెంకట్రామయ్యగారు. అప్పుడే రైలు దిగి వచ్చినట్టుంది, చేతిలోసంచీ, వాలకమూ చూస్తే.

ఆయన కిస్తూనే, తాను 'కూర్చోండి' అంటూ చూపించిన కుర్చీలో కూర్చోకుండా, తిన్నగా తన మంచందగ్గరకు వచ్చి నిలబడే, తనకు మాట్లాడ్డానికి సావకాశం లేకుండా, అదివరకే అనదలుచుకొన్న మాటలన్నీ వల్లెవేసుకొనివచ్చినట్లుగా ఒక అరగంటసేపు, 'ఇవి చేతులు కావు; కాళ్లు' అన్న ధోరణిని మాట్లాడేడు. సారాంశం ఏమిటి అంటే తనకూ, అమ్మాయి కాంతానికి ఎంత మాత్రం ఇష్టం లేకపోయినప్పటికీ, అప్పట్లో ఆడవాళ్ల నిర్బంధంవల్ల ఆవిధంగా రాయవలసివచ్చిం దనీ, ఇప్పటికి అమ్మాయిపట్టుదల వల్లనయితే నేమి, తన బోధపరిచే శక్తివల్లనయితే నేమి ఇంట్లో అందరినీ ఒప్పించగలిగేడు. అంతే కాదు, అట్టే వ్యవధి లేదు; మర్నాడు ఉదయమే సుముహూర్తం!

నిజంగా కామేశ్వర్రావు తన ఆగ్రహాన్ని, ఆధిక్యాన్ని ఎన్నోవిధాల వెలిబుచ్చడానికి తగిన గొప్పసావకాశం ఇదే. 'అవతలి పార్టీవాళ్లు తిరిగిపోయేరు కాబోలు పాపం' అనిగాని, 'నెలరోజుల క్రిందట బాగులేని నా ప్రవర్తన ఇప్పుడెలా పనికి నస్తు'—ందనిగాని, ఇంతెందుకూ—మీవంటి—అనవసరంగా అపవాదులువేసేవారి—సంబంధం నాకెంతమాత్రం అక్కరలేదనిగాని, ఖండితంగా (ఎలాగూఅ తనుబ్రతిమాలాడుగనక) చెప్పడానికి కావలసినంత వీలుంది. కాని, ఒక్క మాటయినా ఘాటుగా అన్నాడా? ఊహుఁ. ఏమీ,అన లేదు. అతి అమాయికంగా లొంగిపోయేడు. ఇద్దరూ కలిసే వెళ్లేరు సెలవుప్రయత్నానికి. మరి వ్యవధి లేదుకదా! వెంకట్రామయ్యగారే సెలవు సంపాదించే డనాలి. సరే, మరేముంది, పెళ్ళి సలక్షణంగానే జరిగిపోయింది. దంపతులు కూడా అన్యోన్యంగానే ఉంటున్నారు.. కాని, ఇప్పటికీ, భార్యాభర్తలకి పరస్పరల సత్యాగ్రహం వచ్చిన సందర్భాలలో—

'నా ప్రవర్తన మంచిది కాదనీ, ఉద్యోగం తప్ప ఏ ఇతర ఆస్తీ లేదనీ ముందే తెలుసును కదా; నాకోసం వెతుక్కుంటూ ఎందుకు రావాలి?' అని అతనూ;

'మీకు అంత అందమయినవాళ్ళూ, డబ్బు తెచ్చేవాళ్లూ వచ్చి పడుతూఉంటే హాయిగా చేసుకోక నన్నప్పుడు చేసుకోడం ఎందుకు? ఇప్పుడు వగవడం ఎందుకూ?' అని ఆమే;

అనుకొంటూ ఉండడం పరిపాటి అయిపోయింది.

విజ్ఞానవార్తలు

గొర్రె చెట్లు

దక్షిణ అమెరికాలో కొలంబియా దేశములో శంతమార్తా అను కొండలలో కొన్ని మొక్కలున్నవట. వీటికి పొడుగాటి, తెల్లని ఉన్ని వంటి ఆకు లపరిమితముగా నుండుట చేత కొంత దూరమునుండి చూచువారికి కొండవాలులో పచ్చిక మేయు గొర్రెలవలె కనపడునట.'రాము'

భారతదేశంలో జీవనప్రమాణాలు

(9 వ పేజీ తరువాయి)

లకు మధ్య ఏర్పడిన వివాదాలను విచారించవలసినదని ప్రభుత్వం పారిశ్రామిక న్యాయసభకు ఆదేశించింది—ఫిబ్రవరి 6 వ తేదీన. యజమానులకు పనివాళ్లకు మధ్యనున్న ఒడంబడికలో లేని అంశాలు కొన్ని వివాదగ్రస్తమైనవని, కాబట్టి ఆ అంశాలను విచారించటానికి పారిశ్రామిక కోర్టుకధికారం లేదని కంపెనీవారు కోర్టుకెక్కారు. ఆ కోర్టు జడ్జి సుబ్బారావుగారు కంపెనీవాని అభిప్రాయాన్నే అంగీకరించారు. తత్ఫలితంగా ప్రభుత్వం హైకోర్టుకు అప్పీలు చేయగా, హార్విల్, గోవిందమీనన్ జడ్జీలు కంపెనీ అభిప్రాయాన్ని తిరస్కరించి, కార్మికులకు యజమానులకు మధ్య ఎట్టి వివాదం వచ్చినా—ఒడంబడికలో అంశాలకు సంబంధించ పోయినా కూడా—ఆ వివాదానికి సంబంధించిన విషయాలన్నిటినీ విచారించటానికి పారిశ్రామిక న్యాయసభకు అధికార ముందని తీర్పుచెప్పారు. ఈ తీర్పువలన కార్మికుల హక్కులు సుస్థిరమైనవి. యజమానులు కూడా ఎటువంటి వివాదానికైనా కోర్టు తీర్పులమీద ఆధారపడటమే యుక్తము. కాని ఇదంతా తేలటానికి 10 నెలలు పట్టింది తీర్పు అనుకూలంగానే ఉన్నా, అందుకు దాదాపు ఓ సంవత్సరం పట్టింది. ఇందుమూలంగా అసంతృప్తి కార్మికుల్లో వ్యాపిస్తోంది. ఈ ఆలస్యం జరుగకుండా చూస్తే ఉత్పత్తి కూడా అభివృద్ధి కాగలదు.

పసిపిల్లల విద్యా విధానము

శ్రీ పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రి

ఇండియా, పాకిస్థానులలో ఐదేళ్లలోపుగా నున్న పిల్లలు దాదాపు ఇరువదైదు మిలియన్లు గలరు. స్పెయిన్ దేశపు జనసంఖ్యకన్న వీరి సంఖ్య హెచ్చు. ఫ్రాన్సు జనాభాలో వీరు మూడువంతులుగా ఉంటారు. ఇంతమందిని జాగ్రత్తగా కాపాడి, పెంచవలసిన బాధ్యత తల్లిదండ్రులకన్న ప్రభుత్వమునకే యెక్కువ ఉండక తప్పదు. వీరినిగురించి మన రాష్ట్ర ప్రభుత్వములుకాని, కేంద్ర ప్రభుత్వముకాని యేమీ ఆలోచించుచున్నట్లు కన్పించుటలేదు. ప్లేటో (*Plato*)నుంచి నేటిదాకా విజ్ఞులు ఈ చిన్నపిల్లలను గురించి విశేషముగా శ్రద్ధ తీసికొనవలె నని ఘోషించుచున్నారు.

ప్రతివ్యక్తియొక్క జీవితములోను మొదటి ఐదేండ్లు అతిముఖ్యమైన వని మనోవిశ్లేషశాస్త్రజ్ఞులు (*Psycho-analysts*) చెప్పుచున్నారు. భౌతికముగాను, మానసికముగాను ఈ సమయముననే అనేకమార్పులు కలుగుచున్నవి. భావములుకూడ ఇప్పుడే స్థిరపడుచున్నవి. ఇవే క్రమముగా రాబోవు జీవితమునకు ప్రధానమగు పునాదులు. ఈ సమయముననే మానసికముగా వ్యక్తికి ప్రమాదము కలుగ వీలున్నది. భావస్వీకృతికి చిన్నపిల్లల మనస్సు తగిన దగుటచే, ఆత్మవిస్తృతికి, ఆత్మసంకోచమునకుగూడ అవకాశము లిచటనే గలవు.

నిద్రాహారాదులలో పెద్దలకు, పిన్నలకు విశేషభేద మున్నది. నిద్రాహారాదులు సకాలమునకు లేకపోయినను పెద్దలుండగలరు. కాని పిల్లల సుఖదుఃఖములకు, శాంతిఅశాంతులకు ఇవి చాల ముఖ్యములు. పిన్నవయసున అన్యులతో సంభాషణ సల్పుట కష్టము. అన్యుల నాశ్రయించుకొని జీవించుట పరాకోటి నందుచున్నది; కాగా ప్రాథమికవాంఛలగు నిద్ర, ఆహారము, మాటలను నేర్చుట, కాలుచేతులను స్వాధీనపరచుకొని నడచుట, ఒప్పుతప్పులను తెలిసికొనుట మొదలగునవి పిన్నవయసున అతిముఖ్యమైనవి. వీనికి సంచారిభావములకు (*Emotions*) అతిసన్నిహితసంబంధ మున్నది. పిన్నవయసున నీ సంచారిభావములే ప్రధానప్రవర్తకసూత్రము లగుచున్నవి.

కొందరు పిల్లలు నాలైగేండ్లవరకు తల్లిపాలు త్రాగుట కలదు. కొందరేడాది దాటకముందే మానుట కలదు. కొందరు తల్లులు బలవంతముగ పాలు మాన్పుట గలదు. మరికొందరు తమ వాత్సల్యము చాల మిక్కుట మని యెంచుచు డబ్బాపాలు పోయుటగలదు. బలవంతముగా పాలు మాన్పినచో పసిపిల్లవానిలో నొకవిధమగు అశక్తత, నిస్సహాయత యేర్పడుచున్నవి. తనను కనిన తల్లికూడా తనను రక్షించుటకు, పోషించుటకు ఒప్పుకొనుటలేదను నధైర్యము, దిగులు బయలుదేరుచున్నవి. ఈ లక్షణము చిన్నతనముననే అనేకవిధములుగా వ్యక్తమౌచున్నది. బొటనవ్రేలిని నోటిలో పెట్టుకొనుట యొకటి. తల్లిపాలు త్రాగని పిల్లలకు స్వాభావికములగు వత్సలత్వాది గుణములు అలవాటుపడవు. పైగా సంఘమున ముస్ముందు న్యూనతగలవారుగా ప్రవర్తింతురు. లేనిచో అతిక్రూరులుగా ప్రవర్తించి, దర్పవంతులగుదురు. ఈ విషయము తల్లిదండ్రు లెవరును మరచిపోరాదు. సంప్రదాయముగా, తరతరములనుండి వచ్చు గుణములు మాతృస్తన్యముద్వారా పిల్లలకు సంక్రమించుచున్నవి. అనగా నీ స్తన్యపానవిషయమున లేనిపోని అలవాట్లకు దిగినచో మన సంస్కృతికే ప్రమాదము కలుగును.

కొందరు తలిదండ్రులు తమ పిల్లలు చాలా తెలివి తేటలుగలవారని రెండుమూడేండ్లకే వారికి చదువుట, వ్రాయుట నేర్ప మొదలిడుట గలదు. తద్ద్వారా స్వాభావికమగు అభివృద్ధి నశించుచున్నది. దీనితో కృత్రిమమగు భావములు శరీరమున స్థావరములగుచున్నవి. అనగా వయస్సు వచ్చు కొలదిని ఈ వ్యక్తికి దర్పము మెండై, తనను మించినవారు లేనే లేరను స్వాధిక్యభావము (*Superiority Complex*) కలుగుచున్నది. ఇది వాస్తవముగా న్యూనతను కప్పరచు లక్షణము. జీవితములో నీభావమున కాటంకములు బయలుదేరి, ప్రవర్తన అరికట్టబడినచో, అనేక మానసిక రోగములు బయలుదేరుచున్నవి. ఇట్టివానిలో, ఉన్మాద మొకటి. ఉన్మాదము, మూర్ఛ, హిస్టీరియా మొదలగు వ్యాధులకు ముఖ్యబీజములు బాల్యావస్థలోనే కన్పించుచున్నవి గాన పిల్లలభవిష్యత్ శ్రేయస్సును వాంఛించి వారిచిన్నతనముననే పెద్దలు మేల్కాంచుట యుక్తము.

పసిపిల్లలు పుట్టుకలోనే సోమరులుగాను, దుష్టులుగాను, భావోద్రేకులు గాను, తెలివితేటలతోను పుట్టిరనియెంచి, దీనినంతను ప్రారబ్ధకర్మపైవేసి మాటలాడుట స్వాభావికమై పోయినది. పుట్టుకతో నీప్రవృత్తులురావు. పుట్టిన తర్వాత, ఐదేండ్లు రాకముందు అధిగతమైన వివియని శాస్త్రజ్ఞులు ఋజువుచేసినారు. వయోధికులలో ననేకక్లిష్టసంఘటనలు కన్పించుచున్నవి. గురుశిష్యులకు, వ్యక్తికి సంఘమునకు, పితాపుత్రులకు, మాతాపుత్రులకు, సోదరులకు, అప్పచెల్లెండ్రకు మధ్య కన్పించు విషాదసంఘటనలకన్నిటికిని మూలబీజము బాల్యావస్థలోనే గలదు. పితాపుత్రికలకు, మాతాపుత్రులకు సన్నిహిత సంబంధ ముండుట బాల్యమున కన్పించుచున్నది. దానితో పుత్రుడు తండ్రిని, పుత్రిక తల్లిని ద్వేషించుట బయలుదేరును. మాతాపుత్రుల వాత్సల్యమే కోపలిని ద్వేషించుటకు మూలకారణము. పితాపుత్రికల వత్సలత్వమువలననే మాకు అల్లుండ్ర వివాదములు బయలుదేరును. ఇవన్నియు భవిష్యత్తున జాగ్రదవస్థలో అనుభూతములు కావు. కాని బాల్యావస్థలో కన్పడు ప్రవృత్తుల ఫలితమే క్రమక్రమముగా వేరొకరూపమున కన్పడుటగలదు. అందుచే పసిపిల్లలను పెంచుట చాలాక్లిష్టమైనది. కనుకనే యెక్కువ శ్రమకు తీసికొనకతప్పదు.

నాలుగైదేండ్లలోపుగా నున్న పిల్లలను మనము పరిశీలింప సాగినచో వీరిలో నధికసంఖ్యాకులు సందులలోను, పెంటపోగులవద్ద, బురదలోను కనిపింతురు. ధనవంతుల పిల్లలకు దాదులున్నారు. ఈ దాదులకు పిల్లలను సరిగా పెంచుట తెలియనే తెలియదు. కొందరు నీటితో ఆటలాడుకొనుచు గన్పింతురు. మరికొందరత్యానందముతోగాని, అతిదుఃఖముతోగాని కన్పింతురు ఇంకను కొందరు స్తబ్ధులుగా, చైతన్యరహితులై చూపట్టుదురు ఇక వీరి తల్లులను గమనించినచో వారికి విద్యాగంధ ముండదు. విద్యయున్నచో, సంస్కృతి యుండదు. ఏమైనను వీరికి పిల్లలను పెంచుట తెలియనే తెలియదు. స్వేచ్ఛగానదిలినను, క్రమశిక్షణకు లోనగునట్లు పెంచినను, పసిపిల్లలకు ప్రమాదమే ఇది మరియొక క్లిష్టసమస్య.

పసిపిల్లలు ముఖ్యముగా నాటలలో విశేషకాలము గడుపుచుందురు. కాలుసేతుల నరములు, మాంసపు కండలు బాగుగా కృషినందినగాని వీలులేదు. రంగురంగులు సీమసున్నములు, వివిధాకృతులుగల బొమ్మలు, రంగుకాగితములు, అనేకరకముల పూవులు మొదలగువానిద్వారా వీరి భాష అభివృద్ధినందుటయేగాక, వీరి పంచేంద్రియములు బాగుగా అభివృద్ధి నందగలవు. ఈ యభివృద్ధిని చక్కగా నియమితము చేసి, వారి భవిష్యజ్జీవితమును దృష్టిలోనుంచుకొని మెలగవలసిన బాధ్యత పెద్దలది. పసిపిల్లల జబ్బులను గూర్చిన నిర్లక్ష్యత మన దేశములో నున్నది. మనదేశములో ఐదేండ్లలోపున మరణించువారు నూటికి నలుబదియైదుగురు కలరు. అనగా మరణించువారి సంఖ్యలో దాదాపు సగముమంది పసిపిల్లలే యని మనము తెలిసికొనినచో, పిల్లల ఆరోగ్యమును కాపాడవలసిన బాధ్యత తెలియగలదు. దీనికంతకను పెద్దలు చక్కగా వీరిని పోషించుకొని రావలసిన విధానమును అవగాహనము చేసికొనవలెను. కావున పసిపిల్లల విద్యావిధానమును, పెద్దలు నేర్వవలసిన విద్యయని భావము. ఈ విద్యను లెక్కజేయనంత కాలము మన దేశమున చక్కని పిల్లలు పుట్టరు. పుట్టినను బ్రతుకలేరు. దీనికై ప్రభుత్వమే కృషిచేయవలెను. కాని మన రాష్ట్రప్రభుత్వములలో శాస్త్రవిషయక విద్యాగ్రంథము కలవారు కొద్ది. ఈ కొద్దిమందికిగూడా నూతన మార్గములు తెలియవు. ఒకవేళ తెలిసినచో, వారికి తీరుబడి లేదు. వారి కాలమంతయు జాతి, మత, వర్ణ కలహములలోనే వ్యర్థమగుచున్నది. అందుచేత ప్రజలే ఈ పనిని నెరవేర్ప సిద్ధులుకావలెను.

పాఠశాలలలో నాట్యశాలలు

శ్రీ మల్లాది అవధాని

మొన్న అక్టోబరు ఇరవై రెండో తారీఖున బళ్లారి సెయింట్ ఫిలామినా కాన్వెంటు పాఠశాలలో సాయంత్రం ఏడుగంటలలగాయితు ఎనిమిదన్నరవరకు విద్యార్థినులచేత నాటక ప్రదర్శన చేయబడింది. టిక్కెట్లు పెట్టి ప్రదర్శన జరిగించారు. ఊళ్లోని ఉన్నతోద్యోగులూ, విద్యాధికులూ దీనికి హాజరయ్యారు.

అసలు పై పాఠశాలకు మొదటినుంచీ సొంతంగా నాటకాలు ఆడుకొనేటందుకు ఒక రంగస్థలమూ, చూచేవాళ్ల కోసమని పాఠశాలలోనిదే ఒక విశాలమైన హాలూ ఉన్నాయి. రంగస్థానానికి కావలసిన సరంజామా దుస్తులూ వగైరాలన్నీ ఉన్నాయి. సొంతపియానో బేంజో హార్మోనియం మొదలైనవి గూడా ఉన్నాయి. ఇంతే కాకుండా, విద్యుద్దీపసౌకర్యాలుకూడా (*Foot lights, top-lights, reflectors*) ఉన్నాయి. ఇంక హాలులో రెండువందలమంది ప్రేక్షకులు కులాసాగా కూర్చోవచ్చు. మొత్తానికి ఆ పాఠశాలలోని ఈ చిన్ని నాట్యశాల ముక్తసరిగాను, ముచ్చటగానూ ఉందని చెప్పక తప్పదు.

ఇంతవరకు విద్యార్థినులు తమ నాట్యశాలలో ప్రదర్శనలు తమ వినోదానికి మాత్రమే ప్రదర్శించుకొంటూ ఉండేవారు. కాని మొన్నటి దఫామాత్రం ఊళ్లోని జనంకోసమని టిక్కెట్లు పద్ధతిపైన ప్రదర్శించారు. ప్రదర్శన హాలివుడ్డు చిత్రంలాగ పట్టుమని గంటన్నరలో ఇట్టే ముగిసిపోయింది.

గమనించవలసిన విషయమేమిటంటే, ఈ ప్రదర్శనలో చాలా వైవిధ్యం ఉంది. వారు ప్రదర్శించింది ఏదో ఒక్క నాటకం మట్టుకు కాదు. కలగూరగంప. రకరకాల మనోహరమైన నాటికాదిప్రదర్శనలు ప్రదర్శించారు. ఏకపాత్రాభినయాలూ, ద్విపాత్రనాటికలూ, ఏకాంకికలు, పాటలూ, పద్యాలూ, భరతనాట్యాలూ, పాశ్చాత్య నృత్యాలూ, మొదలైన వెన్నెన్నో గంటన్నరకాలంలో ముగించేశారు.

ఈ పాఠశాల, ఎలిమెంటరీ సెకండరీ తరగతులు గలది. ఈ ప్రదర్శనలో కూడా ఎలిమెంటరీ పాఠశాల బాలికలు మొదలుకొని మెట్రిక్ పరీక్షకు చదివే బాలికలవరకూ అన్ని వయస్సులవారూ పాల్గొన్నారు. పాఠశాలలోని బాలికలందరూ ఏదో ఒక రంగంలో రంగస్థలం మీదకు రానేవచ్చారు. కాగా అందరు బాలికలూ యీ ప్రదర్శనలో పాత్రధారిణులే. పియానో మొదలైన వాద్యవిశేషాలను ఉపయోగించినవారు కూడా బాలికలే.

వీరు ప్రదర్శించిన నాటికలు అన్నీ ఇంగ్లీషు భాషలోనివి. ఇది కాన్వెంటు పాఠశాల కావడం మూలాన ఇందులో ప్రధానబోధనాభాష ఇంగ్లీషు ఆయినా నాటికలన్నీ హాస్యరస ప్రధానమైనవిగనక చాలా మనోరంజకంగా ఉన్నాయి. పాత్రధారిణులుకూడా అమితోత్సాహంతో ప్రదర్శించారు.


ఈ ప్రదర్శన చూచినవారి కొక విషయం తోచకమానదు—పాఠశాలలో నాట్యశాల అత్యంతఅవసరమైన దని. విద్యార్థులకు ఆత్మవిశ్వాసాన్నీ, ధైర్యాన్నీ ఉత్సాహాన్నీ, మనోప్రసాదత్వాన్నీ జీవితంగురించి ఆనందప్రదమైన దృక్పథాన్నీ కలిగిస్తూ వారి ఉద్రేకాలను ఉత్తమోత్తమ సాహిత్యమార్గాల్లో నడిపించగల నాటకప్రదర్శనలు, పాఠశాలా జీవితంలో ఎంత ప్రధానమైనవో, పై పాఠశాలా నాటకప్రదర్శన చూచినవారికి తట్టక మానదు.

పాఠశాలల్లో నాట్యశాలను స్థాపించడం పెద్ద పెట్టుబడితో కూడుకొన్న విషయం కాదు. పాఠశాలలోని ఏ విశాలమైన హాలునైనా నాట్యమందిరానికి ప్రత్యేకించవచ్చును. పోతే తెరలూ, దుస్తులూ, వాద్యవిశేషాలు మొదలయినవాటి కోసం ఒక వెయ్యిరూపాయలు ఖర్చుచేస్తే సరిపోతుంది. పాఠశాల కయ్యే ఖర్చులలో వెయ్యిరూపాయలు ఒక పెద్ద ఖర్చుకాదు. ఒకవేళ ఇదే పెద్ద మొత్తంగా ఎవరికన్నా కన్పించినా నాటకప్రదర్శనల మూలంగా విద్యార్థులు పొందే అశేషలాభం ముందు, ఇది స్వల్పాతిస్వల్పమైనదనడానికి సందేహమేమీ లేదు.


నాట్యకళను ఉద్ధరించడం కోసమని నాటకశాలలు స్థాపించమని కోరడం లేదు. స్వతంత్రభారతంలో ధీరులూ జీవితయాత్రలో ధైర్యంగా ముందుకు నడవగలిగినవారూ ఇతరులకు కూడా వెలుతురు చూపించగలిగినవాళ్లూ సహస్రకిరణాలు గల జీవితాన్ని సమగ్రంగా అనుభవించడానికి సమర్థతగల జాతీయపౌరులు కావాలిగనక అటువంటి పౌరులను తయారుచేసే పాఠశాలల్లోనే పవిత్రమైన ఆనందవాతావరణం కల్పించాలి. అందుకు ప్రతీపాఠశాలలోనూ ఒక్కొక్క నాటకశాలను నెలకొల్పడంకంటే మంచిమార్గం మరొకటి ఉండబోదు

పాండురంగక్షేత్ర ఉత్సవాలు


చిలకలపూడి




గుడిగోపురం




యాత్రికులు




జనసమూహం భజనలు



సింహద్వారంనుండివచ్చే జనసమూహం



కోలాటం



కోలాటం

Regd. No. M. 4476



వ్యాఖ్యాత: శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుగారు

ఐదవ ముద్రణము

సంస్కృతమూలము, తెలుగున టీకాతాత్పర్య విశేషార్థ వివరణములు గల 400 పుటల గ్రంథము. గీతాధ్యయనపరులకు మిక్కిలి ఉపయుక్తమైనది.

ఖద్దరు బైండు.

వెల రు 4-0-0 లు.

తపాలా ఖర్చు అ. 0-9-0.

ఆంధ్రగ్రంథమాల

పోస్టుబాక్సు 212, మదరాసు 1.

★

కళాప్రపూర్ణ

కీ॥ శే॥ కాశీనాధుని నాగేశ్వరరావుగారి

ఉత్కృష్టరచన

ఆంధ్రవాఙ్మయ చరిత్ర

సరికొత్తపద్ధతిని, సంగ్రహరూపంలో నడిచిన సమగ్రసమీక్ష. వెయ్యేండ్ల వాఙ్మయ చరిత్రకు విశుద్ధదర్పణం. పాతచరిత్రల నన్నిటిని అవలోడనచేసి, సమన్వయించి క్రోడీకరించిన సిసలయిన చరిత్ర.

శాసనాలలోనూ వాటిలోనూ అవ్యక్తస్వరూపంలో ఉండి ఉండి, నన్నయ ధర్మమా అని ఒక్క ఊపున దివ్యాకారంతో బైటపడి, నానాటికి నవనవోజ్జ్వలంగా వికసించిన మన వాఙ్మయం పోయిన పలు పోకడలను పోడిమితో చూపెట్టిన ఉత్తమ గ్రంథం.



వెల రూ. 2-0-0 తపాలాఖర్చు ప్రత్యేకము.

ఆంధ్రగ్రంథమాల,

పోస్టుబాక్సు నం. 212, మదరాసు.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press. 7, Thambu Chetty St., G. T. Madras.